thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 185 కరీంనగర్ శుక్రవారం, 12 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

# తెలుగు రాష్ట్రాల్లో రిచెస్ట్ పార్టీ ఇదే.. సీన్ రివర్స్..



## ఫస్ట్ ప్లేస్ లో బీఆర్ఎస్.. 4వ స్థానంలో టీడీపీ, ఆ తర్వాతే వైసీపీ.. ఈ లెక్కలు ఏంటో తెలుసా?

దేశంలోని ప్రాంతీయ పార్టీల ఆదాయంపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక విడుదలైంది. ఇందులో పలు సంచలన, ఆసక్తికర విశేషాలు బయపడ్డాయి. మొత్తం 40 ప్రాంతీయ పార్టీలు తమ ఆదాయ, వ్యయాలు బయటపెట్టగా, తొలి ఐదు స్థానాల్లో మూడు తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీలే ఉండటం విశేషం. ఇందులో ఒకటి అధికార పార్టీ కాగా, మిగిలిన రెండు విపక్షాలే. అయితే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న పార్టీగా తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఫస్ట్ ప్లేసులో నిలిచింది. దీని తర్వాత పశ్చిమబెంగాల్ అధికార పార్టీ త్రుణమూల్ కాంగ్రెస్ నిలిచింది. దేశంలో రాజకీయ పార్టీల పనితీరు, నేతల నేర చరిత్ర, ఇతర అంశాలపై ఏడీఆర్ అధ్యయనం చేస్తుంటుంది. ఇటీవల నేరచరితులు, క్రిమనల్ కేసులు నమోదైన నేతల జాబితా విడుదల చేసిన ఏడీఆర్.. తాజాగా సంపన్న పార్టీల జాబితా విడుదల చేసింది. దేశంలో మొత్తం 40 ప్రాంతీయ పార్టీల ఆదాయం రూ. 2,532 కోట్లుగా చూపింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఈ లెక్కల్లో ఆయా పార్టీలు ఎన్నికల బాండ్ల ద్వారా ఆదాయం సేకరించినట్లు తెలియజేసింది. ఏడీఆర్ రిపోర్టు ప్రకారం తెలంగాణకు చెందిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల బాండ్ల ద్వారా రూ. 685.51 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రాంతీయ పార్టీలు అన్నింటిలోనూ బీఆర్ఎస్ పార్టీకే ఎక్కువ విరాళాలు వచ్చినట్లు ఏడీఆర్ తన నివేదికలో స్పష్టం చేసింది. దేశంలో అన్ని పార్టీల మొత్తం ఆదాయంలో ఐదు పార్టీలకు కలిపి 81 స్థానం దక్కించుకోగా, అందులో బీఆర్ఎస్ ఎక్కువ ఆదాయం సంపాదించినట్లు తాజా నివేదిక చెబుతోంది. ఇక బీఆర్ఎస్ తర్వాతి స్థానంలో త్రుణమూల్ కాంగ్రెస్ రూ. 646.39 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఒడిసాలోని ప్రధాన ప్రతిపక్షం బీజేడీ రూ. 297.81 కోట్లతో మూడో స్థానం దక్కించుకున్నాయి. త్రుణమూల్ కాంగ్రెస్, బీజేడీ సుదీర్ఘకాలం ఆయా రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగిన విషయం తెలిసిందే. బెంగాల్‌లో త్రుణమూల్ ఇప్పటికీ అధికారంలో ఉండగా, బిజూ జనతాదళ్ గత ఏడాది జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. మరోవైపు ఏపీలో అధికార పక్షంలో కీలక భాగస్వామి అయిన టీడీపీ ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది. రూ. 285.07 కోట్ల విరాళాలను సేకరించిన టీడీపీ దేశంలోనే సంపన్న పార్టీల్లో నాలుగోదిగా గుర్తింపు పొందింది. టీడీపీ తర్వాత వైసీపీ ఐదో స్థానంలో నిలిచింది. వైసీపీకి రూ. 191.04 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే వైసీపీ తన ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేసినట్లు ఏడీఆర్ నివేదికలో హైలెట్ చేసింది. మొత్తం ఆదాయం కంటే సుమారు 55 శాతం అధికంగా వైసీపీ ఖర్చు చేసినట్లు చూపింది. ఇలా డీఎంకే, సమాజ్ వాదీ, జనతాదళ్ (యు)వంటి 12 పార్టీలు తమ ఆదాయాన్ని మించి ఖర్చు చేయడం విశేషం. అదేవిధంగా ఆదాయం నుంచి ఖర్చు చేయని పార్టీలు కూడా కొన్ని ఉన్నాయి. బీఆర్ఎస్ తన ఆదాయంలో రూ. 430.60 కోట్లు ఖర్చు చేయలేదని నివేదించింది.




చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఘన్‌పూర్‌కు చెందిన మనోజ్ అలియాస్ మోదెం బాలకృష్ణ సహా 10 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. మనోజ్‌పై గతంలో రూ. 2 కోట్ల రివార్డు ఉంది. మృతుల్లో ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ యారఫ్ పాండు కూడా ఉన్నారు. మరికొందరు కీలకనేతలు చనిపోయినట్టు భావిస్తున్నారు. ఎదురు కాల్పులు ముగిసిన తర్వాతే మృతులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తోంది. గరియాబంద్ ఈ30, ఎస్‌టీఎఫ్, కోబ్రా జవాన్లు ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా ఎన్‌కౌంటర్‌ని పర్యవేక్షిస్తున్నారు.




## గ్రూప్-1పై అప్పీల్‌కు టీజీపీఎస్సీ సమావేశంలో కీలక నిర్ణయం

హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయించాలని, లేదంటే పరీక్షలను రద్దు చేసి తాజాగా నిర్వహించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఇవాళ జరిగిన టీజీపీఎస్సీ ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం రీవాల్యుయేషన్ చేస్తే సాంకేతిక సమస్యలు రావొచ్చని టీజీపీఎస్సీ అభిప్రాయపడింది. మరోవైపు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్‌లు జారీ చేయడంలో, కేంద్రాల కేటాయింపులో పారదర్శకత లేదని సింగిల్ జడ్జి బుధవారం ఇచ్చిన తీర్పులో తప్పుబట్టారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను, సమగ్రతను కొనసాగించలేదని, పక్షపాతంతో వ్యవహరించినట్లు కనిపిస్తోందని, కమిషన్ తన సొంత నియమ, నిబంధనలను సైతం ఉల్లంఘించిందని పేర్కొన్నారు. పరీక్షలు రాసిన వారి సంఖ్యపై పొంతన లేని సమాధానాలు చెబుతోందని, మూల్యాంకనం కోసం చేసిన ప్రొఫెసర్ల ఎంపికలోనూ పారదర్శకత పాటించలేదని, ఫలితంగా తెలుగు మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్నారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరంలో పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తు.. చర్యల్లో భాగంగా.. పునరావాస కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు అధికారులు సమన్వయం చేసుకుంటూ.. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలపైన అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువులు, కుంటలకు గండిపడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వదర నీరు చేరడంతో చెరువులను తలిపిస్తున్నాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. హయత్‌నగర్‌లో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.




# నివురుగప్పిన నిప్పులా నేపాల్

## హింసాత్మక ఘటనల్లో పెరుగుతున్న మరణాల సంఖ్య - వేలాది మందికి గాయాలు

## సైన్యం పహారాలో కొనసాగుతున్న కర్ఫ్యూ

## యాత్రలకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకుపోయిన వందలాది మంది భారతీయులు

## బద్దలైన జైళ్లు... పారిపోయిన 13,000 మంది ఖైదీలు

## ఆర్మీ, జెన్ జెడ్ మధ్య ముగిసిన తొలిదఫా చర్చలు

కాఠ్మండు : హిమాలయాల నేపాల్‌లో సోషల్‌మీడియాపై నిషేధంతో శాంతియుతంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం ఉగ్రరూపం దాల్చి డజన్లమందిని పొట్టనబెట్టుకుని బుధవారానికి చాలామటుకు శాంతించింది. కానీ బయటిశక్తుల విధ్వంసకర ఉద్యమ ఎగబోతతో నివురుగప్పిన నిప్పులా తయారై తాత్కాలిక ప్రభుత్వానికి కంటిమీద కనుకులేకుండా చేస్తోంది. దాంతో సైన్యంరంగంలోకి దిగి దేశవ్యాప్త కర్ఫ్యూను కఠినంగా అమలుచేస్తోంది. ఉద్యమబాట వీడి చర్చల పథంలో సాగాలంటూ విద్యార్థి సంఘాలకు దేశాధ్యక్షుడు రామచంద్ర పౌదెల్ పిలుపునిచ్చిన నేపథ్యంలో 'జెన్ జెడ్ నేపాల్'విద్యార్థి సంఘం ప్రతినిధులు నేపాల్ సైన్యంతో బుధవారం తొలిదఫా చర్చలు జరిపారు. రెండు గంటలపాటు చర్చించినా ఎలాంటి ఏకాభిప్రాయం కుదర్లేదు. మరోమారు చర్చలు జరపనున్నారు. నేపాల్ మాజీ మహిళా చీఫ్ జస్టిస్ సుశీల కర్కి, కాఠ్మండు మేయర్ బాలేంద్ర షా, మాజీ విద్యుత్ బోర్డ్ సీఈఓ కుల్మాన్ ఘిసింగ్‌లలో ఏవరో ఒకరి సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడాలని విద్యార్థులు డిమాండ్‌చేస్తున్నట్లు తెలుస్తోంది. స్వదేశాన్ని నిరసనోద్యమ అగ్నికీలల్లోకి తోసేశారన్న ఆరోపణలను విద్యార్థులు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. శాంతియుతంగా పోరాటంచేస్తుంటే బయటిశక్తులు దూరి విధ్వంసం సృష్టించాయని స్పష్టంచేశాయి. ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేసినా ఆందోళనలు చల్లారకపోవడంతో సైన్యం మంగళవారం అర్ధరాత్రి రంగంలోకి దిగింది. అత్యంత సమస్యాత్మకంగా మారిన ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంది. దేశవ్యాప్త కర్ఫ్యూను విధించింది. అయితే హింసాత్మక ఘటనల్లో మరణాల సంఖ్య 33కు పెరిగింది. 1,033 మంది గాయపడ్డారు. కఠిన ఆంక్షలను అందరూ పాటించాలని, లూటీ, దోపిడీ వంటివి పునరావృతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యాత్ర, పర్యటన కోసమొచ్చి చిక్కుకుపోయిన విదేశీయులను భద్రంగా స్వదేశాలకు తరలించే ప్రక్రియ మొదలెడతామని ఆర్మీ భరోసా ఇచ్చింది. ఆలోపు విదేశీ పర్యాటకులు, యాత్రికులకు తగు సాయం చేయాలని హోటళ్లు, టూరిజం సంస్థలను ఆర్మీ ఆదేశించింది.

కాఠ్మండులో దుకాణాలు కొల్లగొట్టిన అల్లరిమూకల సభ్యులను ఆర్మీ అరెస్ట్‌చేసింది. వారి నుంచి భారీ ఎత్తున నగదు, 31 ఆయుధాలు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంది. నేపాల్‌లో తాజా పరిస్థితిని గమనిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ బుధవారం చెప్పారు.

**పారిపోయిన ఖైదీలు...** ఆందోళనకారులు జైళ్లను బద్దలుకొట్టడంతో వాటిల్లోని 13,000 మందికిపైగా ఖైదీలు పరారయ్యారు. ఢిల్లీబజార్ జైలు, ఛిత్వాన్, నఖూ, ఝుంపా్క, కంచన్‌పూర్, జలేశ్వర్, కస్కీ, డాంగ్, జుమ్లా, సోలూఖుంబు, గౌర్, బజ్హాంగ్‌లోని జైళ్ల నుంచి ఖైదీలు పారిపోయారు. ఆకొద్ది సమయంలో పారిపోవడం సాధ్యంకాని ఖైదీలు కారాగారాల్లో ఘర్షణలకు దిగుతున్నారు. పశ్చిమ నేపాల్‌లోని బాంకే ప్రాంతంలోని నౌబస్తా ప్రాంతీయ జైలు పరిధిలోని బాలనేరస్తుల కేంద్రంలో కొందరు జైలువార్డన్ల నుంచి ఆయుధాలు లాక్కునేందుకు తెగించారు. ఈ ఘర్షణల్లో ఐదుగురు బాలలు చనిపోయారు. కొన్ని జైళ్ల నుంచి పారిపోయిన ఖైదీలను సైన్యం ఎలాగోలా వెతికి పట్టుకుని మళ్లీ జైల్లో పడేసింది.

**పర్యాటకుల ఆక్రందనలు...** పొఖారా పట్టణంలో వాలీబాల్ లీగ్ మ్యాచ్‌ల కోసం వచ్చిన భారతీయ మహిళ ఉపస్థ గిల్ ఆందోళనకారుల దాడి నుంచి తప్పించుకున్నారు. తనను రక్షించాలని, స్వదేశానికి పంపించాలని భారతసర్కార్‌ను వేడుకుంటూ ఆమె ఇన్‌స్టా గ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్‌చేశారు. "మ్యాచ్ కోసం ఇక్కడికొచ్చా. హోటల్ స్పాలో ఉన్నప్పుడు ఆందోళనకారులు పెద్ద కర్రలతో వెంటబడ్డారు. ఎలాగోలా వారి బారి నుంచి తప్పించుకున్నా. కానీ నా లగేజీ మొత్తం హోటల్‌లోనే ఉండిపోయింది. ఆ హోటల్‌కు నిరసనకారులు నిప్పుపెట్టి కాల్చేశారు. దయచేసి నన్ను భారత్‌కు పంపేయండి. రోడ్ల మీద ఎక్కడ చూసిన మంటలే చెలరేగుతున్నాయి. ఇక్కడ దారుణ పరిస్థితులున్నాయి"అని ఆమె వీడియోలో వాపోయారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఇలా పలు రాష్ట్రాలకు చెందిన చాలా మంది పర్యాటకులు నేపాల్‌లో చిక్కుకుపోయి సురక్షిత తిరుగుప్రయాణం కోసం ప్రభుత్వ సాయం అర్థిస్తున్నారు. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటికే నేపాల్ అధికారవర్గాలతో చర్చలు జరుపుతున్నాయి. అయితే ఎయిర్ ఇండియా, ఇండిగో విమానాల్లో భారతీయులను వెనక్కి రప్పిస్తామని పౌరవిమాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు.




# హైదరాబాద్ శివారులో కుండపోత వర్షం..

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా.. నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్‌సిటీ పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు కుండపోత వర్షం కురిసింది.

**విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్...** భారీ వర్షానికి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్‌నగర్ నుంచి సిటీవైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.

**గంటల వ్యవధిలో 13సెం.మీ వర్షం...** మరోవైపు మెదక్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మూడున్నరగంటల వ్యవధిలోనే 13 సెం.మీ వర్షపాతం నమోదైంది.

రాజీపల్లిలో 9.2 సెం.మీ, పాతూర్‌లో 8 సెం.మీ మేర వర్షం కురిసింది. మెదక్ పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీని వరద ముంచెత్తింది. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మెదక్–హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో అధికారులు జేసీబీతో డివైడర్‌ను తొలగించారు.




# మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన.. ఎప్పుడంటే!

వరంగల్, సెప్టెంబరు 11: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 13వ తేదీన మేడారంలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా మేడారం అభివృద్ధి పనులపై సమీక్ష చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 2026 జనవరి 28వ తేదీ నుంచి మేడారం జాతర జరుగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మేడారం అభివృద్ధికి రూ.150కోట్లు కేటాయించింది కాంగ్రెస్ సర్కార్. జాతరకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మేడారం ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. మేడారంలో సీఎం పర్యటనలో భాగంగా జరిగే సమీక్షా సమావేశంలో ఆలయ మాస్టర్ ప్లాన్‌ను ఫైనల్ చేయనున్నారు. గద్దెల వద్ద నూతన నిర్మాణాలు, రోడ్ల విస్తరణ, భక్తులకు ఇబ్బంది లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, జంపన్న వాగుపై చెక్ డ్యామ్‌తో సహా పలు అభివృద్ధి పనులపై సమీక్ష చేసి సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు ఇవ్వనున్నారు.

# బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుంది.. మంత్రి పొంగులేటి ఫైర్



ఖమ్మం : కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కృషిచేస్తుంటే.. బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ మంత్రి పొంగులేటి నివాసంలో కాంగ్రెస్ నేతల సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి నిజామాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, మంత్రులు కొండా సురేఖ వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ విజయోత్సవ బహిరంగ సభ విజయవంతం కోసం జనసమీకరణ ఏర్పాట్లపై చర్చించామని తెలిపారు. 42శాతం బీసీ రిజర్వేషన్లతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. బహుజన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

**కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు: బీర్ల ఐలయ్య...** గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. ఆలేరు నియోజకవర్గానికి 3700 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ప్రజా పాలనతో, బీర్ల ఫౌండేషన్ సహకారంతో పేదలకు ప్రోత్సాహం ఇస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పట్టుబట్టలు, పొట్టేలు బహుకరిస్తున్నామని తెలిపారు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా ఇస్తున్నామని ప్రకటించారు. 2007లో వర్టూర్ గ్రామంలో దళిత వాడల్లో పల్లెనిద్ర చేసిన కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని నట్టేట ముంచారని మండిపడ్డారు.

చట్టం తన పని చేసుకుపోతోందని.. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉంటే అధికారంలోకి వచ్చిన వారంలోపే అరెస్టులు ఉండేవని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

# విలాసవంతమైన జీవితాలు గడపాలనే ఆలోచన తప్ప మరేమీ లేదు



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన 61 హామీల్లో ఒకటి రెండు తప్ప ఏవీ అమలు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఏమార్చి విలాసవంతమైన జీవితాలు గడపాలనే ఆలోచన తప్ప మరేమీ లేదని మండిపడ్డారు. మంత్రివర్గంలో ఎక్కువ మంది బిసి మంత్రులు ఉండాల్సిన అవసరం ఉందని, ప్రధాన శాఖలు బిసి మంత్రులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి సభకు ముందు శ్వేత పత్రం ఇవ్వాలని కోరారు. మొసలి కన్నీరు, కల్లబొల్లి మాటలతో ఈ ప్రభుత్వం కాలం గడుపుతోందని ఫైర్ అయ్యారు. బీసీల అంశంపై మాట్లాడాలని తాము భావిస్తే...అసెంబ్లీ వాయిదా వేసుకుని పోయారని విమర్శలు గుప్పించారు.







# మూకాంబిక అమ్మవారికి.. రూ.4 కోట్ల విలువైన కిరీటం బహూకరించిన ఇళయరాజా

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాఉడుపి (కర్ణాటక)లోని కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. రూ.4 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన వెండి కిరీటాన్ని అమ్మవారికి బహూకరించారు. వీరభద్ర స్వామికి వెండి ఆయుధాన్ని (కత్తి) ఇచ్చారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన అనంతరం అర్చకులు.. ఇళయరాజాకు తీర్థ ప్రసాదాలతోపాటు అమ్మవారి ఫొటో అందజేశారు. ఇళయరాజా వెంట ఆయన తనయుడు కార్తిక్, మనవడు యతీశ్ తదితరులు ఉన్నారు. జగన్మాత మూకాంబిక అమ్మ ఆశీస్సులే వల్లే ప్రతిదీ సాధ్యమైందని, తాను చేసిందేం లేదని ఇళయరాజా పేర్కొన్నారు. “సాధారణ భక్తుడిగానే ఇళయరాజా ఈ ఆలయానికి వస్తుంటారు. అమ్మవారికి 2006లోనూ ఆయన ఓ కిరీటం బహూకరించారు” అని మూకాంబిక ఆలయం మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ బాబు శెట్టి తెలిపారు.




# మ్యాన్ హెూల్‌లో పడిపోయిన ఐదేళ్ల బాలిక.. స్పందించిన చార్మినార్ జోనల్ కమిషనర్

హైదరాబాద్: యాకత్ పురాలో చోటు చేసుకున్న ఓ ప్రమాదకర సంఘటనపై చార్మినార్ జోనల్ కమిషనర్ స్పందించారు. మౌలాకా చిల్లా ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలిక ఓపెన్‌గా ఉన్న మ్యాన్ హెూల్‌లో పడిపోయిన ఘటన స్థానికులను, అధికారులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. అయితే, అదృష్టవశాత్తూ అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి ఆ చిన్నారిని బయటకు తీశారు. ఈ ఘటనలో బాలికకు ఎలాంటి తీవ్రమైన గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే లోకల్ డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం చిన్నారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆ బాలిక సురక్షితంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, నిన్న హైడ్రా సిబ్బంది మ్యాన్ హెూల్‌ను శుభ్రం చేసిన తర్వాత, తిరిగి మూయకుండా అక్కడి నుంచి వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనను హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చార్మినార్ జోనల్ కమిషనర్ తెలిపారు. ఇలాంటి అవాంఛనీయ ఘటనలు మళ్లీ ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు..




# బోధన్ ఉగ్రలింకుల ఘటన.. ప్రత్యేక వీడియోకాల్ యాప్‌ను వినియోగించిన నిందితులు

బోధన్: నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఉగ్రలింకుల ఘటనలో దర్యాప్తు కొనసాగుతోంది. బుధవారం బోధన్‌లో ఓ యువకుడిని దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం దిల్లీకి తీసుకెళ్లారు. మరోవైపు ఉగ్రవాదులతో యువకుడికి సంబంధం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఝూర?ండ్‌లోని రాంచీలో బాంబు దాడులకు కుట్ర పన్నుతున్న డానిష్ అనే ఉగ్రవాదిని దిల్లీ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. అతన్ని విచారిస్తున్న క్రమంలో బోధన్ యువకుడి పేరు బహిర్గతమైంది. ఈక్రమంలో దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక వీడియోకాల్ యాప్ ద్వారా నిందితులు తరచూ మాట్లాడుకుంటున్నట్లు గుర్తించారు.

# జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు.. అమలు చేయరు: రామచందర్‌రావు



హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఇండియా కూటమిలో ఐక్యత లేదని స్పష్టమైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. “తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్లకు జీతాలు రావడం లేదు. యూనివర్సిటీ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో యూనివర్సిటీలను నడుపుతూ భావితరాలను అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.వెయ్యికోట్లు ఇస్తానని సీఎం రేవంత్ గొప్పలు చెప్పారు. దావోస్‌కు వెళ్లి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారు? దారి ఖర్చులు కూడా వచ్చినట్లు లేదు.

రాష్ట్రంలో పరిపాలనకు పక్షవాతం వచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు తప్ప.. అమలు చేయరు. యువత గురించి ప్రభుత్వం ఆలోచించాలి” అని రామచందర్‌రావు కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల గొంతుకోసింది.. కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబరు 11: రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్కారు కొలువు కోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్ని... అమ్మా, నాన్నల కష్టార్జితాన్ని ధారపోసి పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని ఈ కాంగ్రెస్ సర్కార్ వమ్ముజేసిందని ధ్వజమెత్తారు మాజీమంత్రి కేటీఆర్. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైందని మండిపడ్డారు. అంగట్లో కొలువులు అమ్ముకొని ఈ ప్రభుత్వం నిరుద్యోగుల గొంతుకోసిందని ఆక్షేపించారు. గ్రూప్– 1 పరీక్ష నిర్వహణలో ఫెయిలైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదని హెచ్చరించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లుగా గ్రూప్ –1 పరీక్ష మళ్లీ తాజాగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ –1 పరీక్షలో అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ వేయాలని సూచించారు. గ్రూప్ –1 పరీక్షలో అసలు దొంగలెవరో తేల్చాలని కోరారు. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

# సెప్టెంబర్ 12...మొఘల్ సామ్రాజ్యం లో బీజాపూర్ రాజ్యం కలిసి పోయిన దినం



చరిత్ర పుటలను తిరగ వేస్తే సెప్టెంబర్, 12వ తేదీన అదిల్ షాహీ వంశం పతనమైన ఘటన కన్పిస్తుంది. ఔరంగ జేబుతో 1686వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో బీజాపూరు రాజ్యం ఓడిపోయింది. దానితో మొఘల్ సామ్రాజ్యంలో కలిసిపోయింది. ఆదిల్షా షాహీ వంశము పతనమైంది. ఆదిల్‌షాహీ వంశము 1490 నుండి 1686 వరకు బీజాపూరు కేంద్రంగా దక్కన్ పీఠభూమి యొక్క పశ్చిమ ప్రాంతాన్ని ఏలిన షియా ముస్లిం సుల్తానుల వంశము. బీజాపూరు 1347 నుండి 1518 వరకు బహమనీ సుల్తానుల రాజధానిగా ఉంది. 15వ శతాబ్దం చివరలో ఈ సామ్రాజ్యం క్షీణించి, తుదకు 1518లో అంతరించి పోయింది. బహమనీ సుల్తానుల సామంతులుగా ఉన్న ఆదిల్ షాహీలు బహమనీ సామ్రాజ్య పతనం తరువాత స్వతంత్ర రాజులైనారు. ఆదిల్‌షాహీ వంశపు స్థాపకుడు యూసుఫ్ ఆదిల్‌షా. బీజాపూరు సుల్తాన్ 1686, సెప్టెంబరు 12న ఔరంగజేబుతో యుద్ధంలో ఓడిపోయి, మొఘల్ సామ్రాజ్యంలో కలిసిపోయింది. 1620లో రెండవ ఇబ్రహీం ఆదిల్‌షా పాలనలో బీజాపూర్ స్వతంత్ర రాజ్యంగా కాక ముందు ఈ వంశ వ్యవస్థాపకుడు యూసఫ్ ఆదిల్ షా (1490%–%1510), బీజాపూర్ రాజ్య విభాగానికి గవర్నర్ గా నియమింప బడ్డాడు. యూసఫ్ ను, ఆయన కొడుకు ఇస్మాయిల్ ను ఆదిల్ ఖాన్ బిరుదుతో వ్యవహరించే వారు. ఖాన్ అంటే పర్షియన్, మంగోలియన్ భాషల్లో నాయకుడు అని అర్థం. షా బిరుదు కన్నా తక్కువ స్థాయి కలిగినదే అయినా ఖాన్ అనేది రాచ మర్యాద కలిగిన బిరుదు. యూసఫ్ మనవడు ఇబ్రహీం ఆదిల్ షా 1 (1534–1558), తో "ఆదిల్ షా" బిరుదు సామాన్య వాడుకలోకి వచ్చింది. బీజాపూర్ సుల్తానుల సరిహద్దులు కాలానుగుణంగా మారుతూ వచ్చాయి. ఈ రాజ్య ఉత్తరపు టెల్లలు ఎప్పుడూ స్థిరంగానే ఉన్నాయి. ప్రస్తుత దక్షిణ మహారాష్ట్ర నుంచి ఉత్తర కర్ణాటక వరకూ ఈ రాజ్యం విస్తరించి ఉండేది. రాయచూరు అంతర్వేది ప్రాంతాన్ని గెలవడంతో దక్షిణం వైపు వారి విస్తరణ ప్రారంభమైంది. 1565లో తళ్ళికోట యుద్ధంలో గెలుపుతో విజయనగర సామ్రాజ్యాన్ని గెలుచుకుని ఇంకా దక్షిణానికి జరిగారు. మొహమద్ ఆదిల్ షా (1627%–%1657), తరువాతి దండయాత్రలతో బీజాపూర్ అధికారపు సరిహద్దు మరింత దక్షిణాన ఉన్న బెంగళూరు వరకూ వచ్చాయి. పశ్చిమాన పోర్చుగీస్ పరిపాలనలో ఉన్న గోవా, తూర్పున కుతుబ్ షాహీ వంశం పాలిస్తున్న గోల్కొండ రాజ్యం వరకూ బీజాపూర్ రాజ్యం విస్తరించి ఉండేది. బహమనీ ప్రావిన్సు రాజధాని అయిన బీజాపూర్ నే వీరు కూడా చివరి వరకూ రాజధానిగా కొనసాగించారు. ఇబ్రహీం ఆదిల్ షా %× (1534–%1558), అలీ ఆదిల్ షా %× (1558–%1579) బీజాపూర్ నగరాన్ని పునర్నిర్మించారు. వీరిద్దరి పరిపాలనా కాలంలో నగరానికి ప్రహరీ, కాంగ్రిగేషన్ మసీదు, రాజభవనాలు, ప్రధాన నీటి సరఫరా మౌలిక సదుపాయాల నిర్మాణాలు చేపట్టారు. వారి వారసులు అయిన ఇబ్రహం ఆదిల్ షా %×× (1580–%1627), ఆదిల్ షా (1627%–%1657), అలీ ఆదిల్ షా %×× (1657–%1672) లు బీజాపూర్ ను సుందరమైన రాజభవనాలు, మసీదులు, సమాధులు, ఇతర కట్టడాలతో మరింత అలంకరించారు. దక్కన్ సుల్తనేట్, ఇండో – ఇస్లామిక్ నిర్మాణ శైలికి అత్యుత్తమ ఉదాహరణాలలో ఒకటిగా నిలిచింది బీజాపూర్ నగరం. బహమనీ సామ్రాజ్యం పతనం కావడంతో బీజాపూర్ లో అస్థిరత నెలకొంది. విజయ నగర సామ్రాజ్యం, ఇతర దక్కన్ సుల్తానేట్ లతో నిరంతర యుద్ధాల కారణంగా రాజ్యంలో అభివృద్ధి క్షీణించింది. దక్కన్ సుల్తానేట్ మిత్ర రాజ్యాలన్నీ కూటమిగా కలసి 1565లో తళ్ళికోటలో విజయనగర రాజుల్ని ఓడించి, సామ్రాజ్యాన్ని గెలుచు కున్నారు. బీజాపూర్ ఎన్నో ప్రయత్నాల తరువాత ఆఖరుకి పొరుగు సుల్తా నేట్ అయిన బీదర్ ను 1619లో గెలుచు కున్నారు. పోర్చుగీస్ సామ్రాజ్యం గోవాలోని ఆదిల్ షాహికు చెందిన రేవు పట్టణంపై తీవ్ర ఒత్తిడి కొనసాగించే వారు. ఈ రేవుపై పోర్చుగీస్ వారు పెత్తనం చెలాయించేవారు. ఆఖరుకు ఇబ్రహిం పరిపాలనా కాలంలో ఆ రేవు పట్టణాన్ని పోర్చుగీస్ వారు గెలుచు కున్నారు. ఛత్రపతి శివాజీ తిరుగుబాటుతో కొంత ఇబ్బంది ఎదుర్కున్నా, కొన్నాళ్ళు బీజాపూర్ రాజ్యం స్థిరంగానే కొనసాగింది. శివాజి తండ్రి షాజీ బోన్స్ లే ఆదిల్ షా పాలనలో మరాఠా ప్రాంతానికి ప్రధాన సేనాధిపతిగా పనిచేశాడు. తరువాతి కాలంలో శివాజీ మరాఠా ప్రాంతాన్ని గెలుచుకుని స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడు. బ్రిటీష్ సామ్రాజ్యానికి ముందు మరాఠా సామ్రాజ్యం భారతదేశం లోని అతిపెద్ద సామ్రాజ్యంగా నిలిచింది. 16వ శతాబ్దం చివరి భాగంలో బీజాపూర్ సామ్రాజ్యానికి మొఘల్ సామ్రాజ్యం దక్కన్ ప్రాంతంలో విస్తరణ ప్రారంభం వల్ల అతిపెద్ద ముప్పు మొదలైంది. శివాజీ తిరుగు బాటుతో బలహీనపడిన బీజాపూర్ సామ్రాజ్యంపై మొఘల్ రాజులు సులువుగా అదుపు సంపాదించ గలిగారు. ఆదిల్ షాహీ సామ్రాజ్యంపై వివిధ ఒప్పందాలు విధించడం ద్వారా మొఘలులు బీజాపూర్ లో విదేశీ పరిపాలన చేయడం ప్రారంభించారు. కొన్ని దశల అనంతరం 1636లో బీజాపూర్ రాజ్యం అధికారికంగా మొఘలుల అధీనంలోకి పాక్షికంగా వెళ్ళిపోయింది. 1686లో బీజాపూర్ రాజ్యాన్ని ఆక్రమించు కోవడానికి ముందు నుంచీ ఆదిల్ షాహీల ఖజానాను ఖాళీ చేస్తూ వచ్చారు మొఘలులు. వాస్తవానికి 13వ శతాబ్దం ఆఖరి కాలంలో జిల్లాభూభాగం ఖిల్జీ సుల్తానేట్, ఢిల్లీ సుల్తానేట్ లోకి చేర్చబడింది. 1347లో జిల్లా భూభాగాన్ని గుల్బర్గాకు చెందిన బహ్మనీ సుల్తానులు ఆక్రమించు కున్నారు. ఈ సమయంలో విజయపూర్ బీజపూర్ అని పిలువబడింది. 1518లో బహ్మనీ సుల్తానేట్ ఐదు రాజాస్థానాలుగా (దక్కన్ సుల్తానేట్‌గా ) విభజించ బడింది. వీటిలో ఒకటి ఆదిల్షాహీ రాజ్యంగా (1490–1686) పాలించ బడింది. స్వతంత్ర బీజపూర్ సామ్రాజ్య స్థాపన చేసిన యూసఫ్ ఆదిల్ షా కాలంలో బీజపూర్ ఉన్నత స్థితికి చేరింది. 1686 నాటికి మొగల్ చక్రవర్తులు బీజపూర్‌ను ఆక్రమించుకున్న తరువాత ఆదిల్షా పాలన ముగింపుకు చేరింది. 1724లో హైదరాబాదు నిజాం స్వాతంత్ర్యం ప్రకటించుకుని దక్కన్‌లో నిజాం సామ్రాజ్య స్థాపన చేసాడు. తరువాత నిజాం బీజపూర్‌ను తనరాజ్యంలో విలీనం చేసుకున్నాడు. 1760లో మరాఠీల ద్వారా నిజాంను ఓటమితో తరువాత బీజపూరును నిజాం మరాఠీల వశంచేసాడు. 1818 నాటికి పేష్వా మూడవ బ్రిటిష్ – మరాఠీ యుద్ధంలో బ్రిటిష్ చేతిలో ఓడించ బడ్డాడు. తరువాత బీజపూర్ బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగం అయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రోత్సాహమే మనోధైర్యానికి మూలాధారం

## సెప్టెంబర్ 12... జాతీయ ప్రోత్సాహక దినోత్సవం




సెప్టెంబర్ 12న జాతీయ ప్రోత్సాహక దినోత్సవం జరుపుకోవడం వెనుక ఒక లోతైన మానవీయ భావజాలం దాగి ఉంది. మనిషి జీవనంలో విజయాలు, పరాజయాలు, ఆనందం, దుఃఖం, ఆశలు, నిరాశలు పరంపరగా ఎదురవుతుంటాయి. కానీ ఈ విభిన్న అనుభవాల మధ్య నిలబెట్టేది మనోధైర్యం. ఆ మనోధైర్యాన్ని నిలబెట్టే శక్తి ప్రోత్సాహమే. ఒక మనిషి మాట మరొక మనిషికి ప్రాణాధార మవుతుందని చెప్పడానికి ఇది అత్యుత్తమ ఉదాహరణ. జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మొదట అమెరికాలో 2007లో ఆవిర్భవించింది. "ప్రతి మనిషి సామర్థ్యం అపారమైందే కాని దాన్ని వెలికితీయడానికి ప్రేరణ కావాలి" అన్న ఆలోచనతో ఈ రోజు ఏర్పాటైంది. ఆలోచన ఒక దేశానికి పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న ఈ దినాన్ని గుర్తుచేసుకుంటూ సానుకూల ఆలోచనలు పంచుకుంటున్నారు. ప్రోత్సాహం ఎందుకు అవసరమంటే, అది కేవలం ఒక శబ్దం కాదు, ఒక శక్తి. ఒక చిన్నపిల్ల తొలిసారి నడక మొదలు పెట్టినప్పుడు తల్లి చెప్పే "నీకు వస్తుంది" అన్న మాటే బలాన్నిస్తుంది. విద్యార్థి పరీక్షల భారం ఎదుర్కొన్నప్పుడు గురువు చెప్పే "నువ్వు చేయగలవు" అన్న మాటే ధైర్యాన్నిస్తుంది. క్రీడాకారుడు ఓటమి తర్వాత నిరుత్సాహానికి లోనైనప్పుడు స్నేహితుడు చెప్పే "తర్వాతి సారి నీ విజయం ఖాయం" అన్న మాటే అతనిని తిరిగి లేస్తుంది. ఈ మాటల్లో దాగి ఉన్న ప్రేరణ తోనే మనిషి అసాధ్యాన్ని సాధ్యం చేస్తాడు. సమాజంలో ప్రోత్సాహం ఒక బంధాన్ని పెంచుతుంది. మనం ఇతరులను అభినందించినప్పుడు, ప్రోత్సహించినప్పుడు వారితో ఉన్న బంధం మరింత దృఢమవుతుంది. ఉద్యోగ స్థలంలో సహోద్యోగికి ఒక ప్రశంస, కుటుంబంలో బిడ్డకు ఒక అభినందన, స్నేహితునికి ఒక ధైర్య వాక్యం %–% ఇవన్నీ కలిసి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. పరిశోధనల ప్రకారం ఉద్యోగ ప్రదేశాల్లో ప్రోత్సాహక వాతావరణం ఉంటే ఉత్పాదకత 30 శాతం పెరుగుతుందని, విద్యార్థులు 40 శాతం ఎక్కువగా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తారని నిర్ధారించబడింది. ఇది గణాంకాల రూపంలో ప్రోత్సాహం యొక్క శక్తిని స్పష్టంగా చూపిస్తుంది. ఈ రోజు పాటించాల్సిన విధానం చాలా సులభం. కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలి, సహోద్యోగులకు ధైర్యం చెప్పాలి, వెనుకబడిన వారికి సానుకూల మద్దతు అందించాలి. ఒక చిన్న సహాయం కూడా ఒక పెద్ద ప్రోత్సాహ మవుతుంది. ఉదాహరణకు, చదువులో ఇబ్బంది పడుతున్న విద్యార్థికి సహాయం చేయడం, బిజీగా ఉన్న స్నేహితుని పనిలో తోడ్పడడం, ఒక వృద్ధునికి ధైర్యం చెప్పడం వంటి చిన్న చర్యలు గొప్ప ఫలితాలు ఇస్తాయి. మన భారతీయ సంస్కృతిలో ప్రోత్సాహం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. వేదాల్లో "మంచి మాట వంద యజ్ఞాల కంటే శ్రేష్ఠం" అని చెప్పబడింది. కవి గురజాడ అప్పారావు "దేశమంటే మట్టి కాదు, మనుషుల సమూహం" అన్నప్పుడు కూడా పరస్పర ప్రోత్సాహమే ఒక సమాజాన్ని నిర్మిస్తుందని సూచించారు. తాళ్ళపాక అన్నమయ్య, త్యాగరాజు కీర్తనల్లోనూ భక్తిని ప్రేరేపించే ఉత్సాహ వాక్యాలే ప్రధానంగా కనిపిస్తాయి. ప్రోత్సాహం ఇవ్వడం మన కర్తవ్యం మాత్రమే కాదు, మన సంస్కృతి కూడా. ఈ రోజు మనకు గుర్తుచేస్తున్నది %–% ప్రోత్సాహం ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక సమాజాన్నీ మార్చగలదు. ఒక చిన్న వాక్యం, ఒక ఆశాజనకమైన దృష్టి, ఒక మధురమైన అభినందన %–% ఇవన్నీ కలిసి నిస్సహాయుడిని స్ఫూర్తివంతుడిగా మార్చగలవు. జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని కేవలం ఒక రోజుకు పరిమితం చేయకుండా ప్రతీ రోజూ మనం ఆచరించాలి. మన కుటుంబం, మన స్నేహితులు, మన సహచరులు మాత్రమే కాదు, మన పరిచయం లేని వ్యక్తికైనా ఒక చిరునవ్వు, ఒక సానుకూల మాట ఇవ్వగలిగితే అదే నిజమైన ప్రోత్సాహం అవుతుంది. ప్రోత్సాహం ఇస్తే ప్రేరణ కలుగుతుంది, ప్రేరణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, ఆత్మవిశ్వాసం విజయానికి దారితీస్తుంది. ఈ శాశ్వత సత్యాన్నే సెప్టెంబర్ 12 జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# బ్రేకప్‌లు..తాత్కాలిక విఫలమా, లేక శాశ్వత నష్టమా?



దేశంలో లవ్ ఫెయిల్యూర్స్ తో యువత బలవన్మరణాలకు పాల్పడడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ప్రేమ విఫలమవడాన్ని జీవితాంతం ఓటమిగా భావించే తీరు యువతలో పెరగడం ఆందోళనకరం. ఈ దురదృష్టకర పరిస్థితి మన సమాజం, కుటుంబం, విద్యా వ్యవస్థల వైఫల్యాన్నే ప్రతిబింబిస్తోంది. 'వన్ లైఫ్' హెల్ప్‌లైన్ ప్రతి సంవత్సరం 23,000కి పైగా కాల్స్ స్వీకరిస్తోంది. వీటిలో పెద్ద సంఖ్యలో వస్తున్న కాల్స్ లవ్ ఫెయిల్యూర్స్ కావడం గమనార్హం.

**చిన్నయ సమస్యలు మహా సంక్షోభంగా...** ప్రేమ ఒక సహజమైన భావోద్వేగం. కానీ అది విఫలమైతే జీవితం ముగిసిందన్న భావనతో ముడిపెట్టడం అత్యంత ప్రమాదకరం. మన సమాజం యువతను భావోద్వేగ పరిపక్వత వైపు నడిపించడంలో విఫలమవుతోంది.

భావోద్వేగాలను అంగీకరించడం, వైఫల్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం, తిరిగి ముందుకు సాగడం అనే జీవిత పాఠాలను నేర్పించకపోవడంతో చిన్న సమస్యలు కూడా యువత మహా సంక్షోభంగా భావిస్తున్నది.

**మొదటి మెట్టు అదే..** ఈ సమస్య పరిష్కారంలో కుటుంబం, స్నేహితులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలి. ఒక యువకుడు లేదా యువతి బ్రేకప్ తర్వాత ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే వారిని ఒంటరిగా వదిలేయకుండా మాట్లాడటం, వారి సమస్యలను చెప్పుకున్నడు కాస్తంత సానుభూతి చూపడం, నమ్మకం కల్పించడం అత్యవసరం. ఎందుకంటే ఒక ప్రాణాన్ని కాపాడగల మొదటి మెట్టు ఇదే.

**అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి..** ప్రభుత్వం, విద్యాసంస్థలు కూడా మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. కౌన్సెలింగ్ సెంటర్లు, హెల్ప్‌లైన్ నంబర్లు, అవగాహన కార్యక్రమాలు తప్పనిసరిగా ఉండాలి. సోషల్ మీడియాలో కూడా యువతను నిస్సహాయత నుంచి బయటకు తీయగల సానుకూలమైన సందేశాలు వ్యాప్తి చెందాలి.

**అది అంతిమం కాదు..** ఆత్మహత్య ఎప్పుడూ పరిష్కారం కాదు. అది ఒక క్షణిక భావోద్వేగంలో తీసుకున్న శాశ్వత నష్టం. బ్రేకప్ ఒక తాత్కాలిక విఫలం, కానీ జీవితం శాశ్వతం. ప్రేమలో ఓటమి అనేది జీవనయాత్రలోని ఒక మలుపు మాత్రమే, అంతిమం కాదనేది గ్రహించాలి. లవ్ ఫెయిల్యూర్స్ సంబంధాలను ముగించవచ్చు, కానీ జీవితాన్ని కాదు. జీవితం విలువైనదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని యువతకు నమ్మకం కల్పించాలి.

# నిరసనల్లో సడేమియా.. నేపాల్ జైళ్ల నుంచి ఖైదీలు జంప్

నేపాల్ రాజధాని కాఠ్మాండూలో నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. సోషల్ మీడియాపై ప్రభుత్వం విధించిన నిషేధంతో ఆగ్రహించిన జనరేషన్ జెడ్ యువత, దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దిగారు. ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో దేశం అల్లకల్లోలంగా తయారైంది. ఇది కేవలం రాజకీయ సంక్షోభం కాకుండా, భద్రతా సంక్షోభంగా రూపాంతరం చెందింది.

**భయంకర పరిణామాలు.. విధ్వంసం....** ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకారులు తీవ్రమైన విధ్వంసక చర్యలకు పాల్పడ్డారు. పార్లమెంట్ భవనానికి నిప్పు పెట్టడం, ఉప ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రిపై దాడి వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, నిరసనకారుల మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకు కాఠ్మాండూలో 17 మంది ప్రాణాలు కోల్పోగా.. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 19కి చేరింది. ఈ అల్లర్లు, దేశంలో శాంతిభద్రతలను పూర్తిగా నాశనం చేశాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఖైదీలకు ఊహించని వరం...** దేశంలో నెలకొన్న ఈ అలజడిని జైళ్లలోని ఖైదీలు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. బిర్‌గుంజ్




జైలుపై నిరసనకారులు దాడి చేసి గేట్లను పగులగొట్టడంతో, ఖైదీలు పెద్ద ఎత్తున బయటకు పారిపోయారు. అదేవిధంగా, మహోతరి, పోఖారా జైళ్లతో సహా పలు జైళ్లలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. మహోతరి జైలు నుంచి 576 మంది ఖైదీలు, పోఖారా జైలు నుంచి 900 మంది ఖైదీలు తప్పించుకున్నారని సమాచారం. మొత్తం మీద నేపాల్‌లోని అనేక జైళ్ల నుంచి వేలాది మంది ఖైదీలు పారిపోయారని స్థానిక మీడియా కథనాలు చెబుతున్నాయి. అయితే ఈ సంఖ్యపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

**భవిష్యత్తు అగమ్యగోచరం...** ఒకవైపు దేశవ్యాప్తంగా ప్రజల తీవ్ర నిరసనలు, మరోవైపు జైళ్ల నుంచి వేలాది మంది ఖైదీలు బయటకు రావడంతో నేపాల్ ప్రభుత్వం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రాజకీయ ఆందోళనలు ఇప్పుడు భద్రతకు పెనుసవాలుగా మారాయి. సోషల్ మీడియా నిషేధంతో ప్రారంభమైన ఈ ఆందోళనలు, దేశ రాజకీయ వాతావరణాన్ని తలకిందులు చేయడమే కాకుండా, జైళ్ల గోడలను కూడా కూల్చేశాయి, భవిష్యత్తులో శాంతి భద్రతల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

# ట్రంప్ టారిఫ్ లతో మునుగుతున్న అమెరికన్ కంపెనీలు?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇతర దేశాలపై సుంకాల భారం మోపి అమెరికాకు అదనపు ఆదాయం రాబట్టాలని ప్రయత్నించినా%ొ% ఆ ఝలక్ ఎక్కువగా అమెరికన్ కంపెనీలకే తగులుతోందని తాజాగా బయటపడింది. ముఖ్యంగా చైనాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అగ్రరాజ్యానికి చెందిన కంపెనీలు కొత్త టారిఫ్‌ల ప్రభావంతో నష్టాలను ఎదుర్కొంటున్నాయి. షాంఘైలోని అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సర్వేలో ఈ వాస్తవం స్పష్టమైంది. సర్వేలో పాల్గొన్న 254 కంపెనీలలో దాదాపు మూడోవంతు సంస్థలు.. కొత్త సుంకాల కారణంగా తమ అంచనా ఆదాయం తగ్గిపోతుందని స్పష్టం చేశాయి. ముఖ్యంగా చైనాతో నేరుగా వ్యాపారం జరిపే రసాయన, ముడిసరుకు దిగుమతి చేసుకునే కంపెనీలు ఎక్కువ



నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. ట్రంప్ తొలుత చైనా దిగుమతులపై 30 శాతం అదనపు సుంకాలు విధించగా%ొ% వాటిని తర్వాత 145 శాతానికి పెంచారు. దీనికి ప్రతిగా చైనా కూడా 10 శాతం వరకు ప్రతీకార సుంకాలు విధించింది. ఫలితంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం తలెత్తింది. అయితే మేలో ఇరు దేశాధినేతలు పరస్పర సుంకాలను తగ్గించుకోవాలని నిర్ణయించినప్పటికీ, అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. సర్వే వివరాలను వెల్లడించిన షాంఘై ఛాంబర్ అధ్యక్షుడు ఎరిక్ షెంగ్ మాట్లాడుతూ "సుంకాలు మా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవడంలో అనిశ్చితి పెద్ద సవాలుగా మారింది" అని అన్నారు. ఇక బ్యాంకింగ్, కొన్నిరకాల సర్వీస్ రంగాల్లో సుంకాల ప్రభావం పెద్దగా కనిపించడం లేదని సర్వే చెబుతోంది. కానీ మిగతా పరిశ్రమలు మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు అత్యవసర చట్టాల కింద టారిఫ్‌లు విధించడంపై ఇప్పటికే పలు కోర్టులు అవి చెల్లుబాటు కావని తీర్పునిచ్చాయి. అయితే ట్రంప్ ప్రభుత్వం ఈ తీర్పులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మొత్తం చూస్తే ట్రంప్ సుంకాలు చైనా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి కంటే అమెరికా స్వదేశీ కంపెనీలకే పెద్ద బొక్కా అవుతున్నాయనేది వాస్తవం.

# చురకలు

## సంపాదకీయం

### కేజ్రీవాల్ బీజేపీ నెత్తిన పాలు పోస్తారా ?

బీహార్ లో మరి కొద్ది నెలలలో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని అక్కడ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి భావిస్తోంది. ఈసారి గెలుపు బీజేపీకి చాలా ముఖ్యం. బీహార్ లో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు ఉన్నాయి. అలాగే ఉత్తరాదిన బీహార్ చాలా కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక ప్రతిపక్షం పాగా వేస్తే 2029 లోక్ సభ ఎన్నికల నాటికి వారి రాజకీయ విస్తరణకు బాటలు పడతాయని బీజేపీ ఆలోచిస్తోంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లో అవకాశమే ఇవ్వకూడదని పట్టుదలతో పనిచేస్తోంది. బీజేపీ జేడీయూ ఘట బంధన్ బీహార్ లో బలంగా ఉందని నమ్ముతోంది. మరో వైపు చూస్తే జన సూరజ్ పార్టీతో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే బరిలో ఉంటున్నారు. ఆయన పార్టీ పోటీ వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందని కూడా లెక్క వేసుకుంటోంది. అయితే ప్రతీ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేస్తోంది. ఆ విధంగా ఆ పార్టీ ఇండియా కూటమి ఓట్లను లాగేసుకుంటోంది. దాంతో కూటమికి అది ఇబ్బందిగా మారి ఎన్డీయే భారీగా రాజకీయ లాభం పొందుతోంది. బీహార్ లో చూస్తే ఎక్కువ ముస్లిం డామినేషన్ అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. మరి ఈసారి కూడా మజ్లిస్ సొంతంగా పోటీకి దిగుతుందా అంటే అలా కాదు అని ఆ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు. బీజేపీని ఓడించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. అందువల్ల తాము కూటమితో పొత్తులకు వెళ్తామని అంటున్నారు. తమకు బలం ఉన్న సీట్లను ఇండియా కూటమి ఇస్తే కనుక కలసి పోటీ చేసి బీహార్ లో ఎన్ డీయే ప్రభుత్వం రానీయకుండా చేస్తామని శపథమే చేస్తున్నారు. మహారాష్ట్రతో పాటు చాలా చోట్ల మజ్లిస్ ఒంటరి పోరు బీజేపీకి కలసి వచ్చింది. ఈసారి మాత్రం అసదుద్దీన్ కొత్త వ్యూహం అనుసరిస్తామని చెప్పడంతో బీహార్ లో బీజేపీకి ఇబ్బందే అని అంతా అనుకుంటున్నారు. అయితే అదే సమయంలో ఆప్ బీజేపీకి అనుకోని వరాన్ని ఇస్తున్నట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. బీహార్ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ తాజాగా ప్రకటించారు. బీహార్ లో కాంగ్రెస్ తో కానీ ఇండియా కూటమితో కానీ తమకు ఎటువంటి పొత్తులు ఉండవని ఆయన తెగేసి చెబుతున్నారు. దాంతో బీజేపీ నెత్తిన పాలు పోయడానికేనా ఆప్ అధినేత ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు అన్నది చర్చకు వస్తోంది. నిజానికి ఆప్ చాలా కాలం నుంచే ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో కూడా పొత్తులు లేకుండా పోటీకి దిగి కోరి ఓటమిని తెచ్చుకుంది. అయినా సరే తమది అదే రూట్ అంటోంది. గుజరాత్ లో కూడా తాము ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతోంది. ఆప్ కి కోపం ఏమిటి అంటే ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ తమ విజయావకాశాలను దెబ్బ తీసింది అని. అందుకే కాంగ్రెస్ శిబిరంలో తాము చేరేది లేదని చెబుతోంది. ఈ విధంగా ఆప్ తీసుకున్న నిర్ణయంతో బీహార్ లో రాజకీయ పరిణామాలు మారుతాయా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఒక వైపు పీకే మరో వైపు ఆప్ ఇలా రెండు పార్టీలు వీలైనంత దాకా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలిస్తే కనుక మరోసారి బీహార్ లో అధికారం తమకు దక్కుతుందని బీజేపీ లెక్క వేస్తోంది. మరో వైపు మజ్లీస్ తో ఇండియా కూటమి పొత్తు కూడా అంత సులువు కాదని భావిస్తోంది. ఆ పార్టీ అడిగే సీట్లను కనుక కేటాయించకపోతే ఒంటరి పోరుకే మజ్లిస్ కూడా దిగుతుందని భావిస్తోంది. ఇలా విపక్షంలో చీలికలు బలహీనతలే బీహార్ కుర్చీని పదిలంగా తమకు అప్పగిస్తాయని బీజేపీ భావిస్తోందిట. బీజేపీయేతర రాజకీయ పార్టీలలో ఐక్యత ఇపుడు అంతటా కనిపించడం లేదు. కాంగ్రెస్ అందరినీ కలుపుకుని పోయే విషయంలో భేషజాలకు పోతోంది. అది కూడా బీజేపీకి అంది వచ్చిన అవకాశంగా మారుతోంది అని అంటున్నారు. ఈసారి కూడా బీహార్ లో ఓటమి చెందితే లాలూ పార్టీతో పాటు కాంగ్రెస్ కూడా రాజకీయంగా మరిన్ని ఇబ్బందులు చూడాల్సి వస్తుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# లక్షలాది మందికి దృష్టిని ప్రసాదించిన శివారెడ్డి - సెప్టెంబర్ 12... పద్మశ్రీ పెరుగు శివారెడ్డి జయంతి




రెండు లక్షల యాభై వేలకు పైగా కంటి శుక్లాల ఆపరేషనులు చేసి అత్యధిక కంటి శుక్లాల ఆపరేషనులు చేసిన డాక్టరుగా గిన్నీస్ ప్రపంచ రికార్డులకు ఎక్కిన అసమాన కంటి శస్త్ర చికిత్స నిపుణుడు శివారెడ్డి. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహా దారుగా, భారత రాష్ట్రపతి లి గౌరవ నేత్ర చికిత్సకులుగా పని చేసిన డాక్టర్ పెరుగు శివారెడ్డి (సెప్టెంబర్ 12, 1920 - సెప్టెంబర్ 6, 2005) ఆంధ్రప్రదేశ్ లోని ఒక ప్రఖ్యాత నేత్రవైద్య నిపుణుడు. పెరుగు శివారెడ్డి కర్నూలు జిల్లా దిన్నెదేవర పాడు గ్రామంలో 1920, సెప్టెంబరు 12 న జన్మించారు. ఈయన తండ్రి పి. హెచ్.రెడ్డి. (పెరుగు హుస్సేన్ రెడ్డి - దర్గా దగ్గర జన్మించటంతో ఈ పేరు పెట్టడం జరిగినది). ఆయన 1946లో మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.బి.బి.యస్. (డాక్టరు) పట్టా పొంది 1952లో నేత్ర వైద్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.యస్. పట్టాను స్వీకరించారు. ప్రారంభ ఉద్యోగం మద్రాసు మెడికల్ సర్వీసెస్ లో అసిస్టెంట్ సర్జన్ (1949-53) ఆంధ్ర మెడికల్ కాలేజి, కె.జి (కింగ్ జార్జి) హాస్పిటల్, విశాఖ పట్టణంలో ఆప్తాల్మాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసిస్టెంట్ సర్జన్ గా (1953-56) పనిచేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్ (1958 - 61) సరోజినీ ఐ హాస్పటల్ ఆహ్వానం మీద అక్కడ సూపరిండెంట్ గా, అప్తాల్మాలజీ ప్రొఫెసర్ గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. 1961-75 కాలంలో రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో చేరారు. అప్తాల్మాలజీ డైరక్టరుగా (1978-81) పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్ కు ప్రొఫెసరుగా (1975-78) వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహా దారుగా, దేశ ప్రథమ పౌరుడి (రాష్ట్రపతి) కి గౌరవ నేత్ర చికిత్సకులుగా నియమితు లయ్యారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ అప్తాల్మాలజీ విభాగానికి ఎమెరిటస్ ప్రొఫెసర్ గా, చైనా లోని సన్-యట్ సెన్ యూనివర్శిటీ ఆఫ్ మెడిసన్ సంస్థకు విజిటింగ్ ప్రొఫెసర్ గా రాణించారు. గుండె పోటుతో మరణించే వరకు ఆయన హైదరాబాదులోని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి డైరెక్టరుగా ఉన్నారు. అనేక దేశాలు పర్యటించారు. అమెరికా అకాడమీ ఆఫ్ ఆప్తల్మాలజీ వారు కొంతకాలం తమతో ఉండేందుకు ఆహ్వానించి, అపూర్వ గౌరవ మర్యాదలు అందించారు. అనేక దేశాల్లోని సన్నిహిత మిత్రులు తమ దేశాలు వచ్చి, స్థిరపడాలని కోరి ఒత్తిడి చేసినా ఈయన యిష్టపడలేదు. డాక్టర్ శివారెడ్డి ఆంధ్రప్రదేశ్ స్టేట్ అప్తాల్మాలాజికల్ అసోషియేషన్ అధ్యక్షులుగాబీ ఆల్ ఇండియా అప్తాల్మాజాలికల్ సొసైటీ అధ్యక్షులుగాబీ ఆసియా ఫసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తాలజీ ఉపాధ్యక్షులుగాబీ స్థాపక సభ్యులుగాబీ అమెరికన్ అకాడమీ ఆఫ్ అప్తాల్మాలజీ గౌరవ సభ్యులుగాబీ ఇండియన్ నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్సన్ ఆఫ్ బ్లయిండ్‌నెస్ గౌరవ సభ్యులుగాబీ ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ మొదలగు పదవులను నిర్వహించారు. మద్రాసు యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ (1946), ఆంధ్ర యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (1952) పూర్తయిన తర్వాత కూడా మూడు దశాబ్దాల పాటు నేత్ర వైద్య చికిత్సను బోధించారు. 500 మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్లకు శిక్షన అందించారు. దేశ, విదేశాలలో ఈయన శిష్యులు అప్తాల్మోజిక్ సర్జన్ లుగా అనేకమంది కీర్తి ప్రతిష్ఠలు పొందుతున్నారు. అనేక గ్రామాలలో కాటరాక్ట్ సమస్యలతో బాధపడే వారున్నారని, ఊరూరా క్యాంపులు నిర్వహించి ప్రజలను ఎడ్యుకేట్ చేశారు. ఆపరేషన్లు నిర్వహించారు. మన దేశంలో ఈ తరహాగా కంటి క్యాంపులు, నిర్వహించడం తొలిసారి. 500 క్యాంపులు, దాదాపు మూడు లక్షల కాటరేక్ట్ ఆపరేషన్లు చేశారు. సొంత డబ్బు చాలా ఖర్చు చేశారు. మొబైల్ సర్వీస్ కూడా ఆర్గనైజ్ చేశారు. రిటైర్ అయిన తర్వాత కూడా రెండు శతాబ్దాల పాటు క్యాంపులు నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోకూడా క్యాంపులు నిర్వహించి, తద్వారా చికిత్సతో పాటు మందులు కూడా యిచ్చేవారు. ఫుడ్ కూడా పెట్టేవారు. అద్దాలు కూడా యిచ్చేవారు. స్వంత డబ్బు కూడా వ్యయ పరిచేవారు. దేశంలో అత్యున్నత హోదాలలో ఉన్న చాలామందికి చికిత్స చేసి, "విజన్" కల్పించారు. రెండు లక్షల యాభై వేలకు పైగా కంటి శుక్లాల ఆపరేషనులు చేసి అత్యధిక కంటి శుక్లాల ఆపరేషనులు చేసిన డాక్టరుగా గిన్నీస్ ప్రపంచ రికార్డుల కెక్కారు. భారత ప్రభుత్వం నుండి 1971లో పద్మశ్రీ, 1977లో పద్మభూషణ్ పురస్కారాలను పొందారు. ఈయన విశాఖపట్నం, వరంగల్, కర్నూలులలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలల యేర్పాటుకు చాల కృషి చేశారు. 1990లో కర్నూలులో స్థాపించబడిన ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఆయన పేరున స్థాపింపబడింది. ప్రఖ్యాత తెలుగు హీరో మెగాస్టార్ చిరంజీవి తన పేరున స్థాపించిన చిరంజీవి నేత్ర వైద్యశాల కొరకు శివారెడ్డి గారి సలహాలను కోరి, ఆయన సూచనలను పాటించారు. కంటి చికిత్సలతో పాటు సోషల్ యాక్టివిటీస్ కూడా అనేకం చేశారు. గ్రంథ రచనలు చేశారు. దేశ, విదేశీ ప్రత్రికల్లో సైంటిఫిక్ ఆర్టికల్స్ అనేకం రాసారు. 1985 నుంచి భారతీయ విద్యాభవన్ కు ఛైర్మన్ గా యున్నారు. సిబిఐటి బోర్డులో ఉన్నత పదవులను అలంక రించారు. అళాసాగర్ సాంస్కృతిక సంస్థకు అధ్యక్షులుగా కొంతకాలం ఉన్నారు. ఈ విధంగా పలు సోషల్ ఏక్టివిటీస్ లో ఉండేవారు. దేశంలోనే పేరెన్నిక గన్న సరోజినీ దేవి కంటి హాస్పటల్ కీర్తి ప్రతిష్ఠలను ఈయన సారథ్య నైపుణ్యం, మార్గదర్శకత్వాలే ప్రధాన కారణాలు. కార్నియల్ గ్రాఫ్టింగ్ రంగంలో ప్రత్యేకంగా ఘనకీర్తి నార్జించటనికి గల కారణం కూడా ఈయన ప్రతిభే. అంతర్జాతీయ మెడిసన్ జర్నల్స్ లో దాదాపు 30 పరిశోధనా పత్రాలను వెలువ రించారు. 1973 లో జర్మనీ దేశంలోని మ్యూనిచ్ లో జరిగిన ఇంటర్నేషన్నల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఆప్తాల్మాలజీలో ఈయన కనుగొన్న చాలా అరుదైన క్రిమికి (అకసేరుక జీవి) సంబంధించిన సమాచారం అందించారు. తర్వాతి కాలంలో దానికి ఈయన పేరు మీదనే %+శీతీఒఖు =వఒఎ% అని నామకరణం చేశారు. డాక్టర్ శివారెడ్డికి అనేక ప్రతిష్ఠాత్మక గౌరవాలు, అవార్డులు అందాయి. 1970 లో పద్మశ్రీబీ 1977 లో పద్మభూషణ్‌బీ వెంకటేశ్వర యూనివర్శిటీ వారిచే డి.ఎస్.సి. (1980) బీ 1981 లో అమెరికన్ అకాడమీ ఆఫ్ అప్తాల్మాలజీ వారి గెస్ట్ ఆఫ్ హానర్‌బీ 1981 లో డాక్టర్ బి.సి.రాయ్ నేషనల్ అవార్డుబీ లక్ష కాటరేక్ట్ ఆపరేషన్లు పూర్తిచేసిన సందర్భంగా దేశ ప్రధానిచే మెమెంటో బహూకరణబీ 1985 లో ఆసియా-పసిఫిక్ అకాడమీ ఆఫ్ అప్తాల్మాలజీ వారి జీన్ రిజాల్ మెడల్ (ఆసియా - పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తాల్ మొకజీ వారిచే) ఆడెన్ వాలా ఓరేషన్ గోల్డ్ మెడల్ మొదలగునవి. ఈయన 2005 ఆగస్టులో పార్కిన్‌సన్స్ వ్యాధికి గురై, సెప్టెంబరు 6న గుండెపోటుతో మరణించారు. 85 ఏళ్లు జీవించి, స్ఫూర్తిదాతగా నిలిచిన డాక్టర్ శివారెడ్డి తెలుగు వారికి గర్వకారకులు, చిరస్మరణీయులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అనేక సంస్కరణలకు ఆద్యుడు సుబ్రహ్మణ్య భారతి

## ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శకుడు సుబ్రహ్మణ్య భారతి - సెప్టెంబర్ 12...సుబ్రహ్మణ్య భారతి వర్ధంతి

కవిత్వంలో ప్రగతి శీలమైన, సంస్కరణాత్మకమైన ఆదర్శాన్ని వ్యక్తీకరించిన కవి సుబ్రహ్మణ్య భారతి. ఆధునిక తమిళ సాహిత్యానికి ఆయనను మార్గదర్శకునిగా భావిస్తారు. ప్రాచీన, సమకాలీన అంశాల మేలు కలయికగా నిలిచే కవిత్వ శైలి ఆయన సొంతం. ఆధునిక తమిళ సాహిత్యంలో ఆయన ఆలోచన, ఊహ, పద్యంలోని పటుత్వం కొత్తపుంతలు తొక్కాయి. వేలాది కవితలు... భారత జాతీయ గీతాలు, ప్రణయ గీతాలు, బాలల కవితలు, ప్రకృతి గీతాలు, తమిళ భాష గొప్పతనాన్ని ఉగ్గడించే కవితలు, భారత స్వాతంత్ర్య పోరాట ప్రముఖులైన తిలక్, గాంధీ, లజపతిరాయ్ వంటివారిని ప్రస్తుతించే కవితలు వంటి విస్తారమైన, విభిన్నమైన అంశాలను స్వీకరించి అద్భుతమైన రీతిలో రాశారు. శక్తి, కాళి, వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, శివుడు, కృష్ణుడు వంటి వారినే కాక ఇతర మతదేవతలైన అల్లా, ఏసు వంటివారిని కూడా ప్రస్తుతించారు. జాతీయ, సంస్కరణ నాయకులైన అరబిందో, బాలగంగాధర తిలక్, స్వామి వివేకానంద వంటివారి ప్రసంగాలను అనువదించారు. చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి' (1882 డిసెంబరు 11 - 1921 సెప్టెంబరు 12) తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శిగానూ, "మహాకవి భారతి"గానూ సుప్రసిద్ధుడు, తమిళ సాహిత్య ప్రముఖుల్లో అత్యున్నత వ్యక్తిగా పేరొందారు. ఆయన అసంఖ్యాక రచనలు భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత వంటి భావాలను వెలుగొందేలా చేశాయి. భారతి చిన్నసామి సుబ్రహ్మణ్య అయ్యర్, లక్ష్మీ అమ్మాళ్ దంపతులకు సుబ్బయ్యగా 11 డిసెంబర్ 1882 లో డిసెంబర్ 11న ఎట్టయపురం గ్రామంలో జన్మించారు. తిరునల్వేలిలోని ఎం.డి.టి. హిందూ కళాశాల అన్న స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. యుక్త వయసు నుంచి సంగీతం అభ్యసించడం, 11వ యేటనే కవితలల్లడం నేర్చారు.



విద్యలకు అధిదేవత అయిన సరస్వతీ దేవి పేరిట "భారతి" అన్న బిరుదాన్ని ఆ సమయంలోనే ఆయన పొందారు. విశేషమైన పట్టుదల, కృషితో ఆయన 32 భాషలు (29 భారతీయ భాషలు, 3 విదేశీ భాషలు) నేర్చుకున్నారు. స్త్రీలు రాజకీయాల్లో భాగస్వాములు కావాలని ప్రబోధిస్తూ, ఉద్యమించిన వారిలో తొట్టతొలి సంస్కర్తగా భారతిని భావిస్తారు. భారతి స్త్రీల హక్కుల గురించి, వారి విద్య గురించి విస్తృత స్థాయిలో ఆలోచించారు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులేనని భావిస్తే ప్రపంచం వైజ్ఞానికంగా, మేధాపరంగా సమున్నతంగా విలసిల్లుతుందని భారతి భావించారు. స్త్రీల హక్కులకు భంగం కలిగించేలా మాట్లాడిన శాస్త్రాలను, ఆచారాలను ఆయన ఖండించారు. ఆయన భావాల్లో చాలావరకూ ఆధునిక కాలానికి కూడా సమకాలీనంగా నిలవడం విశేషం. హిందూ సమాజంలోని కుల వ్యవస్థకు కూడా భారతి వ్యతిరేకంగా పోరాడారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా తన కుల గుర్తింపును విడిచి పెట్టేశారు. జీవించే ప్రతి జీవం సమానమేనని భావించారు. దీన్ని చూపించేందుకు ఒక యువ దళితునికి ఉపనయనం చేసి బ్రాహ్మణుని చేశారు. అప్పట్లో తర్వాతి తరాల వారి మనస్సులోకి పెద్దలు విభజన బీజాలు నాటడాన్ని వెక్కిరించారు. వేదాలను, గీతను బోధించేప్పుడు తమ స్వంత ఆలోచనలు దానిలో చేర్చి కువ్యాఖ్యానాలు చేయడాన్ని బహిరంగంగా ఖండించారు. దళితులను హిందూ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి ఆయన గట్టిగా మద్దతిచ్చారు. తమిళనాట సుబ్రహ్మణ్య భారతి భావాత్మక విప్లవాన్ని సాధించారు. సంస్కరణ, దేశభక్తి, జాతీయ వాదం, తమిళ భాష ఔన్నత్యం వంటి అంశాల్లో ఆయన కవితలు తమిళులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. సామాన్యమైన ప్రజలు ఆయన కవితలను కంఠస్థం చేసి సందర్భానుసారం ప్రస్తావించే స్థాయికి వచ్చాయి. కోట్లాదిమంది ప్రజలు ఆయన రాసిన కవితల పంక్తులను ప్రస్తావించడం విశేషం. ప్రేమ, భక్తి, కరుణ, శాంతి, యుద్ధం వంటి సార్వజనీనమైన అంశాల్లోనూ భారతి గీతాలు సందర్భానుసారంగా ప్రజల నాలుకలపై నర్తించాయి. భారత ప్రభుత్వం, మానవ వనరుల అభివృద్ధి శాఖతో కలిసి 1987లో అత్యున్నత జాతీయ స్థాయి సుబ్రహ్మణ్య భారతి పురస్కారాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం హిందూ సాహిత్యంపై అత్యున్నత స్థాయి రచనలు చేసిన రచయితలను సత్కరిస్తోంది. భారతీయార్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పేరిట 1982లో కోయంబత్తూరులో నెలకొల్పారు. మెరీనా బీచ్ వద్ద, భారత పార్లమెంటు భవనం వద్ద భారతీయార్ విగ్రహాన్ని నెల కొల్పారు. కోయంబత్తూరు లోని భారతీయార్ రోడ్డు, న్యూఢిల్లీ లోని సుబ్రమణియం భారతి మార్గ్,ఇలా ఎన్నో రోడ్లుకు ఆయన పేరు పెట్టారు. కర్ణాటక సంగీత రంగంలో తరచుగా వినవచ్చే కృతుల్లో సుబ్రహ్మణ్య భారతి కీర్తనలు ఉన్నాయి. ఆయన రచించిన పలు కీర్తనలను పలువురు కర్ణాటక సంగీత విద్వాంసులు కచేరీల్లోనూ, రికార్డుల్లోనూ గానం చేశారు. 1921 సెప్టెంబరు 12లో అర్థరాత్రి ఆయన మరణించారు.**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తొలిమహిళా న్యూస్ రీడర్ ఆంధ్రా నైటింగేల్ మంగమ్మ - సెప్టెంబర్ 12...జోలెపాళ్యం మంగమ్మ జయంతి



జోలెపాళ్యం మంగమ్మ. అలనాటి రేడియో శ్రోతలకు సుపరిచితమైన పేరు. నేడు ఆకాశవాణి ప్రపంచము లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. భారత ప్రభుత్వ సమాచార , ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యములో పని చేస్తుంది. రేడియో వార్తలు నిబద్ధతకు, విశ్వసనీయతకు తొలినాళ్ళ నుండి పేరు పొందాయి. సమాచార వ్యవస్థ పటిష్ఠంగా లేని రోజుల్లో రేడియో వార్తల కోసం జనం ఆసక్తిగా ఎదిరి చూసే వారు. ఒకప్పుడు రేడియో మాత్రమే ఒక సమాచార సాధనంగా ఉన్న పాతకాలపు మరచి పోలేని రోజులలో, ప్రజలకు వార్తలు ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ప్రజలలో ఒకరిగా, అందరికీ ఆత్మీయులుగా వార్తా చదువరులు తమ తమ శైలులలో సుస్థిర స్థానం సంపాయించు కొన్నారు. ఆకాశవాణిలో వార్తా చదువరులుగా , ఎంతగానో ప్రాచుర్యం పొందిన వారిలో న్యూస్ రీడర్సుది ప్రథమ స్థానం. ఆ విధంగా తెలుగులో ఇటు ప్రాంతీయ కేంద్రాలైన విజయవాడ, హైద్రాబాదు నుండి వచ్చే ప్రాంతీయ వార్తలు, అటు హస్తిన నుండి వచ్చే జాతీయ వార్తలు ప్రజలకు కావలిసిన విశేషాలను నిర్ణీత సమయ సారిణి ప్రకారం తెలియ చెప్పేవి. ఆ రోజుల్లో ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు చదివే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాణీ. ఎవరి స్టైల్ వారిదే. ప్రముఖ సినీ నటుడు కొంగర జగ్గయ్య,కపిల, కాశీపతి, శ్రీ వాత్సవ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, పన్యాల రంగనాథరావు, వనమాలి ప్రసాద్, జోళిపాళ మంగమ్మ, కందుకూరి సూర్యనారాయణ, తిరుమలశెట్టి ?శ్రీరాములు, అద్దంకి మన్నార్, వావిలాల రాజ్యలక్ష్మి, దుగ్గిరాల పూర్ణయ్య, ఏడిద గోపాలరావు వార్తలు చదవడంతో తెలుగువారి హృదయాలకు సన్నిహితులయ్యారు. ఇలా ఎందరో మహానుభావులు. ఎవరికి ఎవరు తీసిపోరు. వార్తలు మధ్య నుంచి విన్నా చదువు తున్నది పలానా అని చెప్ప గలిగేలా తమదయిన తరహాలో వార్తలు చదివే వాళ్ళు. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో తెలుగు న్యూస్ రీడర్‌గా, ఢిల్లీ తెలుగు న్యూస్ విభాగంలో దశాబ్ద కాలానికి పైగా సేవలందించిన మంగమ్మ తెలుగు రేడియో శ్రోతలకు చిర పరిచయస్థురాలు. "ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది జోలిపాళ్యం మంగమ్మ" అంటూ తెలుగు శ్రోతలకు వార్తలు వినిపించిన చిరపరిచిత స్వరం ఆమెది. జోలిపాళ్యం మంగమ్మతో పాటు , విభాగ అధిపతి దుగ్గిరాల పూర్ణయ్య, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, కందుకూరి సూర్యనారాయణ, ఏడిద గోపాలరావు, అద్దంకి మన్నార్ తదితరులు ఆమె సహచరులు. జోలెపాళ్యం మంగమ్మ తెలుగు రచయిత్రి, రేడియో వార్తా చదువరి. మంగమ్మ ఆల్ ఇండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్‌గా ప్రసిద్ధురాలుగా పేరెన్నిక గన్నారు . ఆమె చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1925, సెప్టెంబరు 12న జన్మించారు. ఎం.ఎ., బి.ఎడ్ చదివారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈమెకు తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచ్, ఎస్పరాంటో, తమిళ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఈమె ఆలిండియా రేడియో న్యూఢిల్లీలో 10 సంవత్సరాలు ఎడిటర్‌గా, న్యూస్ రీడర్‌గా విధులు నిర్వర్తించారు. 1962 నుండి నేషనల్ ఆర్కీవ్స్, ఢిల్లీలో పరిశోధనలు చేశారు. బోధనా రంగంలో సుమారు పాతిక సంవత్సరాల అనుభవం సంపాదించారు. ఈమె కేంద్ర సమాచార శాఖ, విదేశాంగ శాఖలలో కీలకమైన పదవులను నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొదలైన సంస్థలలో జీవిత సభ్యురాలు. ఇంకా ఈమె అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవల్ప మెంట్ అధ్యక్షురాలిగా, లోక్ అదాలత్‌లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలను అందించారు. ఆమె ఇంగ్లీషు, తెలుగు భాషలలో పలు పుస్తకాలను రచించారు. న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించారు. "ఆంధ్రానైటింగేల్" అనే బిరుదును పొందారు. తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు (1746-1856), ఆంధ్రదేశంలో క్రైస్తవ మిషనరీల సేవ, ఇండియన్ పార్లమెంట్, శ్రీ అరబిందో, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, అనిబీసెంట్ పుస్తకాలను ఆమె తెలుగులో వెలువరించారు. అలాగే ప్రింటింగ్ ఇండియా, అల్లూరి సీతా రామరాజు, లాస్ట్ పాలెగార్ ఎన్‌కౌంటర్ విత్ ది బ్రిటిష్ ఇన్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1846-1847, ది రేట్ స్కూల్స్ ఆఫ్ గోదావరి పుస్తకాలను ఆంగ్లంలో రచించారు. మదన పల్లెలోని తన స్వగృహంలో 2017, ఫిబ్రవరి 1వ తేదీన తన 92వ యేట వృద్ధాప్య సమస్యలతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## కొత్త కార్డుదారుల ప'రేషన్'

సూర్యాపేట : 'నూతనకల్ మండలానికి చెందిన ఏనుగ శిరీష రేషన్ కార్డు కోసం ఏడేళ్లుగా నిరీక్షించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా ఆమెకు నెల రోజుల క్రితం రేషన్‌కార్డు వచ్చింది. బియ్యం కోసం రేషన్ దుకాణానికి వెళ్లగా కార్డ్ అప్‌డేట్ కాలేదు.. వచ్చే నెల ఇస్తామని డీలర్ చెప్పడంతో నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. అధికారులు స్పందించి తనకు బియ్యం వచ్చే విధంగా చూడాలని కోరుతోంది.'

**పదేళ్ల నిరీక్షణ..**

తర్వాత కొత్తగా రేషన్ కార్డులు మంజూరవడంతో లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో.. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి అధికారుల పరిశీలన అనంతరం విడతల వారీగా మంజూరవుతున్నాయి. జూన్‌లో మూడు నెలలకు సంబంధించి ఒకేసారి బియ్యం పంపిణీ చేయగా.. అందులో కొత్త కార్డులు పొందిన వారిలో కొందరికే బియ్యం అందజేశారు. ఈ మూడు నెలల వ్యవధిలో దరఖాస్తు చేసుకొని రేషన్ కార్డు వచ్చిన లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి బియ్యం పంపిణీ చేస్తున్నారు. కాగా కొందరు లబ్ధిదారులకు



బియ్యం పంపిణీలో వింత సమస్య ఎదురవుతోంది. కార్డు అప్‌డేట్ లేని కారణంగా డీలర్లు బియ్యం పంపిణీ చేయడం లేదు. దీంతో ఆయా లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. కార్డు వచ్చినా బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

**వెంటనే అప్‌డేట్ చేస్తున్నాం: శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌వో, సూర్యాపేట**

ప్రతి నెల కొత్తగా రేషన్ కార్డులు వచ్చిన వారి వివరాలు బియ్యం పంపిణీ కోసం 25వ తేదీ వరకు అప్‌డేట్ చేస్తున్నాం. వారికి మాత్రమే మరుసటి నెల బియ్యం పంపిణీ చేస్తారు. 25వ తేదీ అనంతరం మా వద్దకు వస్తే అప్పుడు అప్‌డేట్ చేస్తే ఆ మరుసటి నెల నుంచి బియ్యం వస్తాయి. రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కార్డులు వచ్చిన ప్రతి ఒక్కరికి బియ్యం అందుతాయి.

## రైతు వేదికలో యూరియా

మిర్యాలగూడ : యూరియా సరఫరాలో సమస్యతో రైతులు ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల ఎదుట బారులు తీరకుండా ఉండేలా రైతు వేదికల్లో యూరియా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించి ంది. ఈ మేరకు పీఏసీఎస్‌లు అందుబాటులో లేని ప్రాంతాల్లో రైతు వేదికల్లో యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు విక్రయించనున్నారు. వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది పర్యవేక్షణలో రైతు వేదికల్లో యూరియాను విక్రయిస్తే సమీప గ్రామాల రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా రద్దీని తగ్గించవచ్చనేది ప్రభుత్వ ఉద్దేశం. జిల్లాలో ప్రధాన స్టాక్ పాయింట్‌గా ఉన్న మిర్యాలగూడకు ఇతర ప్రాంతాల నుంచి రైతులు వస్తుండగా ఇక్కడి రైతులకు యూరియా లభించడం లేదని గుర్తించిన అధికారులు రైతు వేదికల పరిధిలోనే




ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో రైతు వేదికలను గుర్తిస్తున్నామని వాటిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచుతామని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

**జిల్లాలో ఎంపిక చేసిన వేదికలు ఇవే...** మొలకచర్ల, రామడుగు, కుపాశిపల్లి, చందంపేట, బంగారిగడ్డ, కుర్మేడ్, కొండ్రపోల్, కమలాపూర్, చెర్యాకుపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి, భీమారం, ఇప్పాలగూడెం, పెండ్లిపాకల, ధర్మాపురం, మునుగోడు, చందుపట్ల, పాలెం, జీకే అన్నారం, దోమలపల్లి, అప్పాజీపేట, సుంకిశాల, అక్కినేపల్లి, నెమ్మాని, అమ్మనబోలు, నేరేడుగొమ్ము, ముప్పారం, రేగులగడ్డ, పర్వేదుల, ఎస్‌జీ కొత్తపల్లి, మాదారం, తిరుమలగిరి, పెద్దదేవులపల్లి, రావులపెంట రైతు వేదికల్లో యూరియా నిల్వలు అధికారులు గుర్తించారు.

## చెరువుల్లో నీళ్లు.. గుట్టలపై అక్రమార్కుల కళ్లు

సంగారెడ్డి : జిల్లాలో ఇటీవల జోరుగా వర్షాలు కురిశాయి. జల వనరులు కళకళలాడుతున్నాయి. అక్రమార్కులకు వీటిలో మట్టి తవ్వకాలు వీలుకాకపోవడంతో సమీప గుట్టలు, అసైన్డ్ స్థలాలపై కన్నేశారు. రాత్రి, పగలనే తేడా లేకుండా తవ్వకాలు చేపడుతూ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులకు రాజకీయ అండదండలు ఉండటంతో అధికారులు చర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, కొండాపూర్, అందోలు, పుల్కల్, చౌటకూర్, మునిపల్లి, వట్‌పల్లి, హత్నూర, తదితర మండలాల్లో జోరుగా ఈ దందా కొనసాగుతోంది.

**హత్నూర మండలంలో జోరుగా..**

హత్నూర మండలం సిరిపుర, కాసాల, బ్రాహ్మణగూడ, సికింద్లాపూర్, దేవునిగుట్ట తదితర ప్రాంతాల్లో మట్టి దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ, అటవీ భూముల్లో రాత్రి వేళలో యంత్రాలతో తవ్వకాలు చేపట్టి వెంచర్లు, పరిశ్రమల అవసరాలు, గృహ నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడ గుట్టలూ కనుమరుగు అవుతున్నాయి.

**పెరిగిన నేతల ఒత్తిళ్లు**

మట్టి తవ్వకాలు జోరుగా సాగే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోని తీరుపై విమర్శలొస్తున్నాయి. అప్పుడప్పుడు ఈ అధికారులు మట్టి టిప్పర్లను పట్టుకున్నా.. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

**జిల్లాలోని మిగతా చోట్ల..** జహీరాబాద్ మండలం శేఖాపూర్, దిడ్గి, కోత్తూర్-బి, ఝరాసంగం మండలం పొట్టిపల్లి, కోహీర్ మండలం చింతలఘాట్, తదితర గ్రామాల్లో మట్టి తవ్వకాలతో గుట్టలు కరిగిపోతున్నాయి. చింతలఘాట్‌లో అర్ధరాత్రి జేసీబీతో తవ్వుతుండగా ఇటీవల మట్టి పెళ్లలు మీదపడి డ్రైవర్ మృతిచెందాడు. కొండాపూర్ మండలం గొల్లపల్లి, మునిదేవునిపల్లి తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కంది మండలం బ్యాతోల్, చిద్రుప్ప, మామిడిపల్లి, కాశీపూర్ తదితర గ్రామాల్లో మట్టి దందాను అడ్డుకునే వారు కరవయ్యారు.విచారణకు ఆదేశాలు జారీచేస్తాం అసైన్డ్, ప్రభుత్వ భూములు, గుట్టల్లో ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు. వెంటనే పరిశీలించాల్సిందిగా తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తాం. అక్రమార్కులు ఎంతటివారైనా వదిలిపెట్టం.సీహెచ్ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో, సంగారెడ్డి

## పరస్పర బదిలీలు.. పైరవీలకు దారులు



కరీంనగర్ : జిల్లా విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటులో ఇష్టారాజ్యం నెలకొంది. రాష్ట్ర విద్యాశాఖ నిబంధనలకు అధికారులు తిలోదకాలు పలికారు. పలుకుబడి, పైరవీలకు పెద్దపీట వేసి దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని కరీంనగర్ చుట్టుపక్కల బడులకు సర్దుబాటు చేశారు. ఉత్తర్వుల జారీ తర్వాత కూడా కొందరికి అవకాశం కల్పించడం ఉపాధ్యాయుల్లో చర్చకు దారి తీస్తోంది. సర్దుబాటులో పరస్పర డిప్యుటేషన్లు కల్పించవద్దనే నిబంధన ఉన్నా జిల్లాలో పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతుల అనంతరం అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో పైరవీలు, సిఫారసులు భారీగా చేయనున్నారనే చర్చ జరుగుతోంది. గత నెలలో విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన అవసరమైన పాఠశాలలకు మిగులుగా ఉన్న 123 మంది ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ సర్దుబాటు చేసింది. వీణవంక మండలంలోని కనపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఒకరు మొదట్లో ఓ ప్రజాప్రతినిధి సిఫారసుతో గత నెలలో జరిగిన సర్దుబాటుకు దరఖాస్తు చేసుకోగా.. పరిశీలించిన జిల్లా విద్యాశాఖ పక్కన బెట్టింది. తీరా ఈనెల 11న అదే ఉపాధ్యాయుణ్ని కరీంనగర్ రూరల్ మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖలోని కొందరు అధికారులు ముడుపులు తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది.

వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీని రామడుగు ప్రాథమిక పాఠశాలకు, అక్కడ పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీని ఇక్కడికి పరస్పర డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని టీచర్‌ను జమ్మికుంట మండలం వావిలాలకు, ఇక్కడ పనిచేస్తున్న టీచర్‌ను అక్కడికి పరస్పర ఒప్పందంపై సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**రాష్ట్ర విద్యాశాఖ చొరవ అవసరం**

సర్దుబాటులో వెళ్లిన ఉపాధ్యాయులకు పరస్పర డిప్యుటేషన్లకు ఆస్కారంలేదని రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన నిబంధనల్లో స్పష్టంగా ఉన్నా... పైరవీలకు దారులు తెరిచారు. రాష్ట్ర విద్యాశాఖ చర్యలకు ఉపక్రమిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయనే చర్చ నడుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులు, ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులకు కూడా సర్దుబాటులో పెద్దపీట వేసి కరీంనగర్ సమీపానికి తీసుకొచ్చారు. చాలామంది కరీంనగర్ సమీపంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖలోని ఇద్దరు, ముగ్గురు అధికారులు ఈ పరస్పర డిప్యుటేషన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ స్పందించి సర్దుబాటులో పలుకుబడి కేటాయింపులు, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన వ్యవహారాలపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## పురోగతి లేని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు



గోదావరిఖని: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనుల్లో పురోగతి లేకుండా పోయింది. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగి ఎనిమిది నెలలు గడిచినా కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతి రాలేదు. దీంతో రామగుండంలో నిర్మించ తలపెట్టిన ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ(2400 మెగావాట్లు) 800 మెగావాట్ల మూడు యూనిట్ల పనులు మొదలు కాలేదు. ఇందులోని 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రానికి సంబంధించి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదిరింది. ఒక యూనిట్ విద్యుత్తు రూ.4.12 పైసల చొప్పున కొనుగోలుకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. ఏప్రిల్ నెలలో అవగాహన కుదిరింది. మిగతా రెండు యూనిట్లకు సంబంధించి ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదరలేదు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం పనులు వేగంగా సాగుతాయని ఆశించినప్పటికీ ఎలాంటి కదలిక లేదు.ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనులకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ఇంకా అనుమతులు రాలేదు. మొదటి దశలో (1600 మెగావాట్లు) 800 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లను నిర్మించింది. రెండో దశలో 2400 మెగావాట్ల మూడు విద్యుత్తు కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. దీనికి సంబంధించి పర్యావరణ అనుమతులతో పాటు రెండు యూనిట్లకు పీపీఏ(విద్యుత్తు కొనుగోలు ఒప్పందం) చేసుకోవాల్సి ఉంది. కేవలం ఒక యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్తు కొనుగోలుకు అవగాహన కుదిరింది. ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. దీనికి సంబంధించిన అభిప్రాయాలను కేంద్ర పర్యావరణ శాఖకు కాలుష్య నియంత్రణ మండలి నివేదించింది. ఎనిమిది నెలలు గడిచినా అనుమతులు రాకపోవడంతో పురోగతి లేకుండా పోయింది.

**తగ్గిన విద్యుత్తు డిమాండ్‌తో సందేహాలు**

రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ తగ్గడంతో ప్రాజెక్టు నిర్మాణంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉండే పరిస్థితి నెలకొంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేవలం ఒక యూనిట్(800 మెగావాట్ల)లో ఉత్పత్తి చేసే విద్యుత్తుకు మాత్రమే కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. మిగతా రెండు యూనిట్లకు సంబంధించి ఎలాంటి అవగాహన కుదరలేదు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే ఒకేసారి మూడు యూనిట్లకు సంబంధించిన పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. విద్యుత్తు డిమాండ్ తగ్గడంతోనే నిర్మాణానికి జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**విభజన చట్టంలో భాగం**

రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తెలంగాణ కోసం 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. దీని ప్రకారం ఎన్టీపీసీ సంస్థ రామగుండంలో 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర విభజన అనంతరం చేపట్టాల్సిన పనులు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు మొదటి దశలో 1600 మెగావాట్ల రెండు యూనిట్లు నిర్మించింది. గతేడాది నుంచి పూర్తిస్థాయిలో ఈ ప్లాంట్ల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. రెండో దశ పనులపై జాప్యం నెలకొంది. వీటిని 2030 నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

## అందుబాటులో ఇసుక.. పనులు ఆగవిక



కొత్తగూడెం: ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు తొలగనున్నాయి. కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఇసుక బజార్లు ఏర్పాటు చేసింది. నేటి నుంచి విక్రయం చేపట్టాలని నిర్ణయించింది. తొలుత కూసుమంచిలో ఏర్పాటు చేసిన ఇసుక బజారును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు మరో వారం రోజుల్లో సత్తుపల్లి, మధిర, ఖమ్మం, కామేపల్లి, వైరా బజార్లలో కూడా అందుబాటులో రానున్నాయి.

**నిర్వహణ మహిళా సంఘాలదే..** ఇసుక బజార్ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకుగాను టన్నుకు రూ.100 సంబంధిత సంఘానికి చెల్లించనున్నారు. రికార్డుల నిర్వహణ మొదలు అన్ని పనులను వీరే చూస్తుంటారు. మైనింగ్ విభాగం పర్యవేక్షిస్తుంది. మహిళా సంఘాల బలోపేతమూ లక్ష్యంగా ప్రభుత్వం ఇసుక బజార్లను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.

**టన్నుకు రూ.1,100** వర్షాకాలం వాగుల్లో వరద ప్రవాహంతో ఇసుక తీయడం కష్టంగా మారింది. దీని ప్రభావం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పడింది. సమస్యను పరిష్కరించడంతో పాటు నాణ్యమైన గోదావరి ఇసుకను లబ్ధిదారులకు అందించేందుకు ఇసుక బజార్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు టన్నుకు రూ.1,100.. మిగతా వాటికి రూ.1,300 వసూలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. హౌసింగ్ శాఖ లబ్ధిదారులు జాబితా, తహసీల్దార్ ఇచ్చిన కూపన్ల ఆధారంగా ఇసుక విక్రయాలుంటాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ ఉంటుందని ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబరు 155242ను సంప్రదించవచ్చు.

**తొలగనున్న ఆర్థిక భారం**

టీజీఎండీసీ అధికారుల తాజా నిర్ణయంతో వెతుకులాట ఇబ్బందులు తొలగడంతో పాటు ఆర్థిక భారం తగ్గనుంది. లబ్ధిదారులు బయట మార్కెట్‌లో ఇసుక కొనుగోలు చేయాలంటే టన్నుకు రూ.1,500 చెల్లించాల్సి వస్తోంది. అదే టీజీఎండీసీ ద్వారా టన్ను రూ.1,100లకే అందనుంది. రవాణా వ్యయాన్ని మాత్రమే నిర్వాహకులు వసూలు చేయడంతో ప్రాంతాలను బట్టి ధరలు మారనున్నాయి. కూసుమంచిలో టన్ను రూ.1,100లకు దొరికితే.. వైరాలో ఇంకా తక్కువకే లభిస్తుంది. దీంతోపాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది.

'లాభాపేక్ష లేకుండా టీజీఎండీసీ ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ మేరకు ఇసుక బజార్లను ఏర్పాటుచేశాం. వీటి ద్వారా లబ్ధిదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు వసూలు చేసి నాణ్యమైన ఇసుక అందిస్తాం.'శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం.

## జ్వరం.. ఆసుపత్రులకు వరం

మెదక్ : ఉమ్మడి మెదక్ జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో ఇంటికొకరు జ్వరం బారిన పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలందని కారణంగా జ్వర పీడితులు ప్రైవేటు బాటపడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు దవాఖానాల్లో సాధారణ కిట్లతో నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. ప్లేట్‌లెట్లు(రక్తకణాలు) కొంత తగ్గినా డెంగీగా పేర్కొంటూ.. బాధితులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్రత్యేక చికిత్స పేరిట రూ.వేలల్లో దండుకుంటున్నారు.

**ఆందోళనకు గురిచేసి.. అడ్డగోలుగా బిల్లులేసి..**

ఇటీవల మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన రోగికి జ్వరం రాగా చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. ఎర్ర రక్తకణాలు భారీగా పడిపోయాయని ఆందోళనకు గురిచేసి ప్లేట్‌లెట్లు ఎక్కించాలని నిర్దేశించారు. రోగికి చికిత్స నిమిత్తం రోజుకు రూ.20వేల చొప్పున మూడు రోజులకు రూ.60వేలు వసూలు చేశారు.

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్‌లో అపరిశుభ్రత కారణంగా డెంగీ ప్రబలింది. స్థానిక ఆర్‌ఎంపీ, పీఎంపీల సూచనలతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల బాట పట్టారు. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గాయనే నెపంతో రోగుల నుంచి భారీగా వసూలు చేసిన విషయంపై స్థానికులు



వైద్యారోగ్యశాఖకు ఫిర్యాదు చేశారు.

**అమలుకు నోచని ఆదేశాలు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు టీ-హబ్ కేంద్రాలలో నిర్ధారణ తర్వాతే డెంగీ కేసుల వివరాలు వెల్లడించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు జారీచేశారు. ఇందుకు విరుద్ధంగా ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గగానే డెంగీగా నిర్ధారిస్తూ రోగిని బెంబేలెత్తిస్తున్నారు. ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాల్సిన వైద్యశాఖ అధికారులు మిన్నకున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మూడు జిల్లాల డీఎంహెచ్‌వోలను వివరణ కోరగా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సంగారెడ్డి జిల్లా నారాయణరెడ్డి కాలనీకి చెందిన ఓ చిన్నారి జ్వరంతో పేరొందిన పిల్లల ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా మొదటగా వైరల్ జ్వరమని చికిత్స చేశారు. రెండు రోజులు కాగానే డెంగీగా నిర్ధారించి ప్లేట్‌లెట్లు ఎక్కించామని రెండు రోజులకు కలిపి రూ.45వేలు తీసుకున్నారు.

## ఒక్క అడుగు పడితే ఒట్టు!

మెదక్: మెతుకు సీమలో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి ఏర్పాటు కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరై రెండేళ్లు దాటింది. నిర్మాణ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. నిర్మాణ బాధ్యతలను ఒక ప్రభుత్వ శాఖ నుంచి మరో శాఖకు అప్పగించారు. ఇంకా భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అద్దె భారం తప్పడం లేదు.

**అద్దె భవనంలో..**

జిల్లాలో ఉన్నత విద్యకు సంబంధించి ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వపరంగా లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. 2023లో మెదక్‌కు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైంది. వంద సీట్లను కేటాయించారు. గతేడాది నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 50 సీట్లే అందుబాటులోకి తీసుకొచ్చారు. తరగతులు ప్రారంభానికి పట్టణ పరిధి పిల్లికొట్టాల వద్ద ఓ ప్రైవేటు భవనం ఎంపిక చేశారు. గతేడాది అక్టోబరులో తరగతులు మొదలయ్యాయి. గతంలో ఇదే భవనంలో సమీకృత కలెక్టరేట్ కొనసాగింది.

**స్థల సేకరణ జరగక..**

వైద్య కళాశాల భవన, వసతిగృహ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పట్టణంలోని చేగుంట మార్గంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్మించగా, దీని పక్కనే అత్యవసర కేంద్రాన్ని (క్రిటికల్ కేర్) ఏర్పాటుచేస్తున్నారు. వైద్య కళాశాల సైతం ఇక్కడే నిర్మాణం చేపట్టాలని గతంలో నిర్ణయించారు. 2023 అక్టోబరులో శంకుస్థాపన చేశారు. కళాశాలకు 20 ఎకరాలు అవసరం. రాజ్‌పల్లికి వెళ్లే దారిలో ప్రభుత్వ భూమి ఉండటంతో 12.5 ఎకరాలు సేకరించారు. మరో 7.5 ఎకరాలు అవసరం. మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లే దారిలో పట్టా భూములను సేకరించాల్సి ఉంది. ఇది పూర్తయితే పనులు షురూ అయ్యే అవకాశం ఉంది.



గతంలో నిర్మాణ పనులను ర.భ. శాఖకు అప్పగించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు బదలాయించారు.

మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో.. సీట్లు: 50

ఏర్పాటైంది: 2024-25 అక్టోబరు

నిధుల మంజూరు: రూ.180 కోట్లు

భవన నిర్మాణానికి కావాల్సిన స్థలం: 20 ఎకరాలు

సేకరించింది: 12.5 ఎకరాలు

టెండర్ దశలో ఉంది శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, విద్యా,సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ వైద్య కళాశాల భవన నిర్మాణానికి సంబంధించి టెండర్ దశలో ఉంది. 7.5 ఎకరాలను సేకరించాల్సి ఉంది. సివిల్ పనులకు రూ.130 కోట్లు, యంత్రాలు సమకూర్చేందుకు రూ.50 కోట్లు కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తయి.. మిగిలిన స్థలాన్ని అప్పగిస్తే పనులు షురూ చేస్తాం.

చురకలు



# హృదయం.. ఇలా పదిలం

హైదరాబాద్ : నృత్యం చేస్తూ ట్రాఫిక్ కానిస్టేబుల్ కుప్పకూలి మృతి... పెళ్లి బారాత్‌లో డ్యాన్స్ చేస్తూ యువకుడి ఆకస్మిక దుర్మరణం .. తరచూ ఇలాంటి సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ తరుణంలో గుండె ఆరోగ్యం చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని నిమ్స్‌కు చెందిన హృద్రోగ నిపుణులు డాక్టర్ సాయిసతీష్ తెలిపారు.

**ప్రధాన కారణాలు..**

వెంట్రిక్యులర్ ఫైబ్రిలేషన్ టాచీకార్డియా(సీవీపీటీ)అనేది కార్డియాక్ అరెస్టుకు దారితీస్తుంది. వేగంగా డ్యాన్స్ చేసినప్పుడు, పరిగెత్తడం, ఆటలాడినప్పుడు గుండెలోఅసాధారణ విద్యుత్తు ప్రసరణ జరుగుతుంది.గుండె, దాని వాల్వుల్లో అసాధారణ పరిస్థితి, అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, తీవ్ర శారీరక శ్రమతో రక్త ప్రసరణలో ఒక్కసారిగా మార్పువచ్చి ఆకస్మిక గుండె వైఫల్యానికి దారి తీస్తాయి.

చాలామందిలో పుట్టుకతోనే వచ్చే హైపర్ ట్రోఫిక్ అబ్‌స్ట్రక్టివ్ కార్డియోమయోపతి(హెచ్ఓసీఎం) కూడా ఒక కారణం.



జన్యులోపాలు, కార్డియోమయోపతి, మందుల ప్రభావం వల్ల కూడా సీవీపీటీ సంభవిస్తుంది.

**ఇవి చేద్దాం..**

రోజూ గంటపాటు వ్యాయామం అవసరం.

సమతుల ఆహారం తీసుకోవాలి.

7–8 గంటలపాటు నాణ్యమైన నిద్ర

**ఈ జాగ్రత్తలు**

కుటుంబంలో ఎవరికైనా హెచ్ఓసీఎం, సీపీవీటీ సమస్యలు ఉంటే.. మిగతా వారు తప్పక గుండె స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

హెచ్ఓసీఎం సమస్యతో బాధపడుతున్న వారు కఠినమైన వ్యాయామాలు, నృత్యాలు, ఆటలు, ఎక్కువ శారీక శ్రమ చేయొద్దు.

మధుమేహం, అధిక రక్తపోటు, పొగ, మద్యపానం అలవాటు, చెడు కొలెస్ట్రాల్(ఎల్‌డీఎల్) ఉంటే.. ఏటా తప్పనిసరిగా ఈసీఈ, 2డీఈకో, టీఎంటీ లాంటి పరీక్షలు చేయించుకోవాలి.

సాధారణ వ్యక్తులకు సంబంధించి 35 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారైనా గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

# స్థోమతే వెనక్కి లాగుతోంది!

కొత్తగూడెం: దుమ్ముగూడెం మండల కేంద్రానికి చెందిన ఎనగంటి చంద్రం, కొంపల్లి సత్యనారాయణ, మాధవి, సూరిబాబు.. ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల పేర్లలో కొన్ని పేర్లు.. వీరెవరూ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. బేస్‌మెంట్ వరకూ లబ్ధిదారులే ఖర్చులు భరించాల్సి రావటంతో ఇలాంటి వారు చాలామంది తట్టెడు మట్టి తీయలేదు. జిల్లాలోని చాలా మండలాల్లో ఇదే పరిస్థితి.

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్థోమతే ప్రధాన అవరోధంగా మారుతోంది. మంజూరు పత్రాలు పొందిన వెంటనే ముగ్గుపోసి పనులు ప్రారంభించాలంటే లబ్ధిదారుని చేతిలో కనీసం రూ.లక్ష వరకు ఉండాల్సిందే. పేద కుటుంబాలకు ఇది భారంగా మారుతోంది. ఆ సొమ్ములు లేక, ఎక్కడా అప్పుపుట్టక జిల్లాలో చాలామంది పనులు వాయిదా వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. బేస్‌మెంట్ లెవల్ వరకే రూ.లక్ష ఖర్చు చేయాల్సి రావడంతో గిరిజనులు పనులకు మొగ్గుచూపడం లేదు.

**ఇతర కారణాలు..**

ఇనుము, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు అధికంగా ఉండటంతో వాటిని కొనుగోలు చేయలేక నిర్మాణాలను మధ్యలోనే వదిలేస్తున్నారు.వర్షాల నేపథ్యంలో ఇసుక కొరత కూడా ఇబ్బందిగా మారింది.పిల్లర్లతో కూడిన ఇంటిని నిర్మించాలంటే ప్రభుత్వ సాయం రూ.5లక్షలకు అదనంగా మరో రూ.రెండు లక్షలు గుత్తేదారులకు చెల్లించాల్సి వస్తోంది.



**ఆ నియోజకవర్గంలోనే ఎందుకు..?**

మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం ఇచ్చారు. లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం నాలుగు విడతల్లో రూ.5లక్షలు జమ చేస్తున్నా జిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మరికొన్నిచోట్ల నత్తేనయం అన్నట్లుగా ఉన్నాయి. చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇప్పటికే 57 ఇళ్లు పూర్తవగా.. మిగిలిన గ్రామాల్లో ఆ స్థాయి పురోగతి లేదు. మిగిలిన వాటితో పోల్చితే అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మొత్తం 3,502 కేటాయించగా.. 3,495 మంజూరు పత్రాలు జారీ చేశారు. వాటిల్లో 3,074 గృహాలకు ముగ్గుపోశారు. అందులో 2,556 బేస్‌మెంట్, 703 రూఫ్ లెవల్‌లో ఉండగా.. 193 ఇళ్లలో కొన్ని గృహప్రవేశాలు పూర్తయ్యాయి. మిగిలినచోట్ల ఈ స్థాయి స్పందన లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా భద్రాచలం, కొత్తగూడెంలో మరీ నెమ్మదిగా సాగుతోంది.

'అన్ని నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మంజూరు పత్రాలు జారీ చేసిన ప్రకారంగా నిర్మాణం చేపడుతున్నారు.'రవీంద్రనాథ్, హౌసింగ్ పీడీ, భద్రాద్రి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు (ఈ నెల 4వ తేదీ నాటికి)

కేటాయించిన గృహాలు: 15,260

మంజూరు పత్రాలు జారీ చేసినవి: 14,779

ముగ్గు పోసినవి: 11,279

బేస్‌మెంట్ లెవల్: 6,659

రూఫ్ : 1,467

చివరి దశలో..513

# సాగని పనులు.. తీరని ట్రాఫిక్ చిక్కులు



ఉప్పల్ : ఉప్పల్ రింగురోడ్డులో నలువైపులా నిర్మించే ఫ్లైఓవర్లతో రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. నాలుగేళ్లుగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. సర్వేలతోనే సరిపెట్టారు. భూయజమానులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకొన్నారు. ఉప్పల్‌లో మాత్రం ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు. ఉప్పల్ రింగురోడ్డులో జీహెచ్ఎంసీ అధికారులు రూ.311 కోట్లతో నాలుగు ఫ్లైఓవర్లను నిర్మించేందుకు సుమారు నాలుగేళ్ల క్రితం ప్రతిపాదనలు చేశారు. మెట్రో రైలు మార్గానికి సమాంతరంగా సికింద్రాబాద్–శంషాబాద్‌కు సాఫీగా సాగిపోయేలా రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. వరంగల్ వైపు వెళ్లే వాహనాలే రింగురోడ్డుకు కిందనుంచి రానున్నాయి. ఎల్బీనగర్ వైపు వెళ్లేవి కొత్తగా నిర్మించనున్న ఫ్లైఓవర్ మీదుగానే రాకపోకలు సాగించనున్నాయి. ఎలివేటెడ్ కారిడార్ రింగురోడ్డుకు సుమారు 300 మీటర్ల దూరంలోనే ముగియనుంది. అక్కడినుంచి 6 లేన్ల ఫ్లైఓవర్ ఉప్పల్ రింగురోడ్డులోని మెట్రో రైలు లైన్ పైనుంచి ఉప్పల్ ఐడీఏ వరకు నిర్మించనున్నారు. అక్కడినుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లేందుకు వీలుగా ఇక్కడి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నుంచి ఏక్‌మినార్ వరకు 3లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణంచేయాలి. ఏ ఒక్క ఫ్లైఓవర్ నిర్మాణం కాలేదు.

**పిల్లర్ల దశలోనే..**

ఉప్పల్ రింగురోడ్డు–ఐడీఏ మార్గంలో మాత్రమే పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. సుమారు మూడేళ్లయినా పనులు ముందుకు సాగలేదు. రోడ్డు మధ్యలో పిల్లర్లతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మిగతా మూడు ఫ్లైఓవర్ల పనులు చేపట్టలేదు. ఈ నాలుగు ఫ్లైఓవర్లను ఎస్ఆర్‌డీపీలో భాగంగా జీహెచ్ఎంసీ పనులు చేపట్టింది. తర్వాత ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

**వ్యూపాయింట్‌పెన్కే ఓ లుక్కేయాలి!** వ్యూపాయింట్ అంటే ఎత్తైన ప్రదేశంలో నిలబడి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించే కేంద్రం.. కానీ బంజారాహిల్స్‌లోని డైనోసార్ పార్క్‌లో రూ.లక్షలు వెచ్చించి మొదలుపెట్టిన వ్యూ పాయింట్ల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వాటికి మెట్లు కూడా లేకపోవడంతో చెత్త నిండి ఇలా పాడబడిన భవనంలా కనిపిస్తోంది.

ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు : 4 అంచనా వ్యయం : రూ.311 కోట్లు

# భవనం లేక.. సమావేశం సాగక..



వికారాబాద్ : జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు పొదుపు చేస్తూ, రుణాలు పొందుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. వీరికి బ్యాంకులు రుణాలు ఇస్తూ, తోడ్పాటు అందిస్తున్నాయి. అయితే సంఘాల సమావేశాల నిర్వహణకు చాలా చోట్ల సొంత భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. నెలకోసారి సమావేశం నిర్వహించాల్సి ఉన్నా, సరైన వసతి లేక అవస్థలు పడుతున్నారు.

**మండల సమాఖ్యలకూ కొరతే:** జిల్లాలో 20 మండల సమాఖ్యలు ఉన్నాయి. వీటిలో మూడు చోట్ల మండల సమాఖ్యలకు సొంత భవనాలు లేవు. ఇందులో కొత్తవాటితో పాటు పాత మండలాలున్నాయి. కోట్‌పల్లి, చౌడాపూర్, దుద్యాలలో మండల సమాఖ్యలకు సొంత భవనాలు నిర్మించాల్సి ఉంది. సొంత భవనాలు లేకపోవడంతో మండల పరిషత్తు కార్యాలయంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనాలు లేని కారణంగా మండల సమాఖ్యలకు సంబంధించిన దస్త్రాలను భద్రపరచడం ఇబ్బందిగా మారింది.

**ప్రభుత్వ పరిశీలనలో ఉంది..**

గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యలకు సొంత భవనాలు నిర్మించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ విషయంలో కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చాలా చోట్ల కొత్తగా పంచాయతీ భవనాలు నిర్మించారు. ఆయా గ్రామాల్లో సమావేశాల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయి.

**పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో..**

జిల్లాలో 657 గ్రామైక్య సంఘాలున్నాయి. వీటిలో 121 సంఘాలకు సొంత భవనాలున్నాయి. మిగిలిన 536 సంఘాలకు లేవు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణ, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాల నిర్వహిస్తున్నారు. ఎక్కడా అవకాశం లేకుంటే చెట్ల కింద ఏర్పాటు చేస్తున్నారు. గ్రామైక్య సంఘాలు ప్రతి నెలా సమావేశం నిర్వహించి లోటుపాట్లు, సంఘం బలోపేతం తదితరాలపై చర్చిస్తారు. ఆ వివరాలను, ఆ ప్రాంతాన్ని చిత్రం తీసి అప్‌లోడ్ చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాన్ని సంఘాలు అమలు చేస్తున్నాయి.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 657

మండల సమాఖ్యలు: 20

మహిళా సంఘాల: 16,087

సభ్యులు: 1,63,955

# వేగం.. జరిమానాల మూల్యం



కరీంనగర్ : కరీంనగర్‌కు చెందిన ఓ వ్యాపారి రెండు నెలల కింద కారు కొనుగోలు చేశారు. 80 కిలోమీటర్ల వేగంతో కరీంనగర్ నుంచి హైదరాబాద్ మార్గంలో ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి బోల్తాకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతి వేగమే ప్రమాదానికి కారణం అని తేల్చి చెప్పారు. మూడేళ్లలో 34 వేలకుపైగా కేసుల నమోదు అతి వేగం ప్రమాదకరం. కానీ కొందరు దానిని పాటించకుండా వాహనాలపై దూసుకెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.. అకారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని చోట్ల 80 కిలోమీటర్లలోపు వేగంతో ప్రయాణించాలని సూచిస్తున్నా పట్టించుకోవడంలేదు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ మీదుగా రామగుండం వరకు ఉన్న రాష్ట్ర ప్రధాన రహదారిపై ఈ అతివేగం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇదే మార్గంలో నిత్యం ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. 2023 నుంచి ఇప్పటివరకు కరీంనగర్–హైదరాబాద్, రామగుండం రహదారులపై ఏర్పాటు చేసిన స్పీడ్ గన్స్ ద్వారా 34,677 కేసులు నమోదు కాగా, వాటికి ఈ–చలాన్ ద్వారా రూ.3,58,88,796 జరిమానాలు విధించినట్లు తెలుస్తోంది.

**ప్రమాదాలు జరుగుతున్నా..**

చాలా మంది ప్రధాన రహదార్లపై కార్లలో వేగంతో ప్రయాణిస్తుండగా వాహనాన్ని అదుపు చేయడం కష్టం. ఈ కారణంగానే ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. రోడ్లు భవనాల శాఖ ఈ ప్రమాదాలను అదుపు చేసేందుకు ఆయా మార్గాల్లో రాకపోకలను బట్టి 40, 60, 80 కిలోమీటర్ల వేగాన్ని సూచిస్తూ రోడ్ల పక్కన బోర్డులను ఏర్పాటు చేసింది. వాహనదారులు వీటిని లెక్క చేయడంలేదు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న టాప్ ఎండ్ మోడల్ కారు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో ప్రయాణిస్తేనే దాని పికప్‌ను అందుకుంటుంది. రహదారిపై సూచించిన వేగాన్ని పక్కనపెట్టి వాహన వేగానికి అనుగుణంగా వెళుతున్నారు.పోలీసులు వేగ నియంత్రణ పరికరంతో తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. అయినా కొందరు తీరు మార్చుకోకుండా యథావిధిగా వేగంగా వెళ్లడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. సామాన్యులే కాక బాధ్యతాయుతులైన పలువురికి, అధికారుల వాహనాలకు సైతం జరిమానాలు పడుతున్నాయి.

# కాలిపోతే.. జేబు ఖాళీ

దేవరకొండ : నేరెడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామ రైతులకు చెందిన నియంత్రిక పది రోజుల క్రితం కాలిపోయింది. ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకొని నియంత్రికను కొండమల్లేపల్లిలోని ఎస్‌పీఎం సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ దించినందుకు, మరమ్మతుల అనంతరం ఎత్తినందుకు రూ.500 చొప్పున సిబ్బందికి చెల్లించి గ్రామానికి తెచ్చుకున్నారు. విద్యుత్ కార్యాలయంలోనూ సిబ్బందికి టీనోట్ ఫాం కోసం రూ.500 చెల్లించారు. ట్రాక్టర్ కిరాయి రూ.5వేలు. ఇవీ నియంత్రిక మరమ్మతులకు గురైనప్పుడల్లా కర్షకులు పడుతున్న కష్టాలు. దేవరకొండ మండలం కట్టకొమ్ముతండాకు చెందిన రైతులు నియంత్రిక మరమ్మతుల కోసం పది రోజుల కిందట కొండమల్లేపల్లిలోని కేంద్రానికి తీసుకొచ్చారు. అవి..ఇవి అన్ని కలిపి ఒక్కసారికే రూ.5వేలు ఖర్చయింది. వారం వ్యవధిలోనే మూడు పర్యాయాలు మరమ్మతు కేంద్రానికి తరలించడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. నాసిరకం పరికరాలు బిగించడంతోనే ఇలా జరిగిందని వాపోయారు. విత్తు విత్తింది మొదలు.. పంట చేతికొచ్చే దాకా అష్టకష్టాలు అన్నదాతను వెంటాడుతున్నాయి. విత్తనాలు, ఎరువుల కొరత నుంచి బయటపడకముందే ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు కరెంట్ కష్టాలు కర్షకులకు తప్పడం లేదు. బోర్లు, బావుల కింద సేద్యం చేస్తున్న రైతులకు నియంత్రికలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. విద్యుత్ సరఫరాలో లోపమో, మరేకారణమో కానీ తరచూ నియంత్రికలు కాలిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవి కాలిపోతే 48 గంటల్లో పునరుద్ధరించాలి. ఎస్‌పీఎం కేంద్రంలో రైతుల పొలాల నుంచి నియంత్రికలను తెచ్చేందుకు వాహనం ఉండాలి.



కానీ ప్రైవేట్ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మరమ్మతు కేంద్రాలకు కాలిపోయిన నియంత్రిక పరిధిలోని బోర్లు, బావులున్న రైతులంతా తలా కొంత డబ్బులు పోగుచేసుకొని ట్రాక్టర్ కిరాయికి తీసుకొని తరలిస్తున్నారు. అక్కడి సిబ్బంది దించినందుకు, ఎత్తినందుకు, ఇతర పనులకు డబ్బులు వసూలు చేస్తున్నారు. మరమ్మతులకు సైతం సమయం పడుతుందని చెబుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నాట్లు, కలుపు కూలీల ఖర్చుతో నెట్టుకొస్తున్న వారిపై కాలిపోయిన నియంత్రిక మరమ్మతుల అదనపు భారంతో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. దీనిపై దేవరకొండ విద్యుత్‌శాఖ డీఈ విద్యాసాగర్‌ను వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.నల్గొండ జిల్లాలో ఎస్‌పీఎం సెంటర్‌లు నల్గొండ 3, మిర్యాలగూడలో 2, హాలియా, కొండమల్లేపల్లి, నాంపల్లి, వేములపల్లి, మునుగోడు, నకిరేకల్‌లో ప్రాంతాల్లో ఒకటి చొప్పున ఉన్నాయి.

# భూ సేక'రణం'

నల్గొండ : విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై కీలకమైన ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) నిర్మించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ ప్రాంతం కేంద్రబిందువుగా మారనుంది. కేంద్ర ప్రభుత్వం నిర్మాణ ప్రతిపాదనలు ఖాయం చేయనుండగా.. దక్షిణ భాగం పనులను అనుసంధానం చేస్తూ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వాహనాల రాకపోకలు, సర్వీస్ రోడ్లు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక వసతులతో బహుళ అంతస్తుల థియేటర్లు, ఐదు నక్షత్రాల హోటళ్లు ఏర్పాటు చేసేందుకు సర్వే బృందాలు మార్కింగ్ చేశాయి. తమ భూములు, ఇళ్లు కోల్పోతున్నామని బాధపడుతున్న నిర్వాసితులకు మరోసారి అదనంగా భూసేకరణ చేస్తామనే సమాచారం అందడంతో ఆందోళనలు ముమ్మరం చేస్తున్నారు.

బడా పారిశ్రామికవేత్తలకు 'రాజకీయ' అండదండలు

చౌటుప్పల్ పురపాలికలోని లింగారెడ్డిగూడెం, తాళ్లసింగారం, లింగోజీగూడెంలు ఆర్ఆర్ఆర్‌కు మరోవైపు విడిపోనున్నాయి. నిర్వాసితులు ఇప్పటికే పార్టీలకు అతీతంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట, చౌటుప్పల్ కూడలిలో నిరసనలకు దిగారు.

రాజకీయ నాయకులు బడా పారిశ్రామికవేత్తలకు చెందిన ఔషధ



సంస్థలు, ఇతరత్రా పరిశ్రమలు, భూములను కాపాడేందుకు తరచూ రహదారి విస్తరణకు సంబంధించి భూ సేకరణ ప్రతిపాదనలు మార్చడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తమ గోడు చెప్పుకున్నా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓఆర్ఆర్ తరహాలోనే విస్తరణ పనుల కోసం 78 ఎకరాలు మాత్రమే అవసరమవుతుందని అధికారులు గుర్తించగా గరిష్ఠంగా 190 ఎకరాల వరకు భూసేకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.

# పట్టభద్రులయ్యేలా.. ఫిజిక్స్ వాలా..!

సూర్యాపేట: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వం.. వారి భవిష్యత్తును బంగారంలా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు నీట్, జేఈఈ, ఎప్‌సెట్‌లో మంచి మార్కులతో పేరున్న విద్యాసంస్థలో సీట్లు సాధిస్తున్నట్లుగా.. ఇకపై ఆదర్శ, కేజీబీవీ, గురుకుల కళాశాలల్లోని పిల్లలు తమ లక్ష్యాన్ని సాధించేలా సర్కారు ముందడుగు వేసింది. ప్రముఖ విద్యావేదిక ఫిజిక్స్ వాలాతో ఒప్పందం కుదుర్చుకుని గత నెల 15 నుంచి బోధన కొనసాగిస్తుంది. ఆ పాఠ్యాంశాలు తమకు ఎంతో ఉపయుక్తమవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

**బోధన ఇలా..**

ప్రతి రోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బోధన ఉంటుంది. గణితం, వృక్ష, జంతు, భౌతిక, రసాయశాస్త్రం సబ్జెక్టులకు మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎన్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో కూడిన కొన్ని రికార్డు చేసిన వీడియో పాఠాల రూపంలో, మరికొన్ని ఆన్‌లైన్ విధానంలో ఉంటాయి. వీటితో పాటు అభ్యాస వ్యాయామ, పరీక్షలతో కూడినవి బోధిస్తున్నారు. పిల్లలకు అర్థం కాని పాఠ్యాంశాలను కళాశాలలోని సబ్జెక్టు బోధకులు నివృత్తి చేస్తున్నారు.

**విద్యార్థుల ఆసక్తి**

ఎంతో ఖర్చుతో కూడుకున్న శిక్షణ ఉచితంగా అందుతుంది. పాఠ్యాంశాలు వినడానికి తొలుత కాస్త ఇబ్బంది పడిన విద్యార్థులు ఇప్పుడు ఆసక్తిగా వింటున్నారని ఆయా విద్యాలయాల అధ్యాపకులు



చెబుతున్నారు. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేందుకు అవసరమైన ప్రవేశపరీక్షలో రాణించేలా పేరున్న విద్యా సంస్థ ద్వారా పాఠ్యాంశాలను అందిస్తున్న ప్రభుత్వం వాటికి సంబంధించి మెటీరియల్ అందిస్తే బాగుంటుందని అభ్యాసకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆదర్శ, కేజీబీవీ, గురుకులాల్లో కళాశాలలోని సైన్స్ విద్యార్థులు: 2,520ఆన్‌లైన్ విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తున్న ఇతను ఆత్మకూరు(ఎస్) ఆదర్శ పాఠశాలలోని పీజీటీ కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీధర్. 120 మంది ఇంటర్ విద్యార్థులు జేఈఈ, నీట్, ఎప్‌సెట్‌లో రాణించేలా ఫిజిక్స్ వాలా అందిస్తున్న ఆన్‌లైన్, రికార్డు వీడియో పాఠ్యాంశాలను వివరిస్తున్నారు. అర్థం కాని పాఠ్యాంశాలను మూలాల్లోకి వెళ్లి నివృత్తి చేస్తున్నారు. ప్రవేశపరీక్షలో ఎలాంటి భయం లేకుండా బాగా రాసి మంచి మార్కులు సాధించేలా పాఠ్యాంశాల ద్వారా తర్ఫీదు ఇస్తున్నామంటున్నారు..

**తరగతులు బాగున్నాయి**

జేఈఈ, ఎప్‌సెట్ ప్రవేశపరీక్ష బాగా రాసేందుకు ఫిజిక్స్ వాలా తరగతులు బాగున్నాయి. ప్రతి పాఠ్యాంశం సులభంగా అర్థమవుతున్నాయి. వీటి వింటుండటంతో ప్రవేశపరీక్ష బాగా రాసి మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం పెరిగింది.

**నాగసాయి, ఎంపీసీ, ద్వితీయ, ఆత్మకూరు(ఎస్)**

**అర్థం కానివి నివృత్తి చేస్తున్నారు**

నీట్ ప్రవేశ పరీక్ష రాయాలనే కోరిక ఉంది. అందుకు ఏవిధంగా సన్నద్ధం కావాలని ఆలోచించా. ఇంతలో ప్రభుత్వం ఫిజిక్స్ వాలా ద్వారా తరగతులను చెప్పిస్తుంది. అవి అర్థవంతంగా ఉన్నాయి. కొన్ని అర్థం కాని పాఠ్యాంశాలను లెక్చరర్లు నివృత్తి చేస్తున్నారు. ఎస్‌కె. సంజన, బైపీసీ, ద్వితీయ

# మీ సేవ కేంద్రాలకు మోక్షమెప్పుడో!

భువనగిరి : జిల్లాలో 'మీ సేవ'లు విస్తృత పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రజలు పలు రకాల సేవలను ఈ కేంద్రాల ద్వారా వినియోగించుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 69 కేంద్రాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఈ సేవలు అందుబాటులో లేవు. చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభ్యర్థన మేరకు చౌటుప్పల్ మండలంలో నాలుగు, నారాయణపురం మండలంలో ఒక కేంద్రం ఏర్పాటుకు జులై నెలలో జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

**దరఖాస్తులు స్వీకరించి నెలరోజులైనా..**

దరఖాస్తులు స్వీకరించి నెల రోజులు కావొస్తున్నా.. ఇంత వరకు కేంద్రాల నిర్వాహకుల ఎంపికకు రాత పరీక్ష నిర్వహించలేదు. దరఖాస్తు చేసుకునేందుకు జులై 19వ తేదీన వరకు గడవు ఇచ్చారు. వాటిని పరిశీలించి అభ్యర్థులకు రాత పరీక్ష ద్వారా నిర్వాహకుల ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ ఆపై చదివి 21 నుంచి 44 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి అవకాశం ఇవ్వనున్నారు. కేంద్రం నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక స్థోమత ఉండాలి. నెల రోజులైనా పరీక్ష తేదీ ప్రకటించకపోవడంతో అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఆయా కేంద్రాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో నిర్వాహకులను యుద్ధ ప్రాతిపదికన ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుల, ఆదాయ, మరణ, జనన, ఈసీ తదితర ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నా.. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిందే. చాలా మండలాల్లో గ్రామాలకు దూరంగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మోటకొండూరు మండలంలో ఒకే కేంద్రం ఉంది. సుమారుగా 10 వేలకు పైగా జనాభా ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలో అదనపు కేంద్రాలే లేవు. భూదాన్‌పోచంపల్లిలో ఒకటే ఉంది. మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చొరవ తీసుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి తన మండలాల పరిధిలో 5 కేంద్రాలను మంజూరు చేయించారు. ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలో అవసరం ఉన్న చోట కొత్త కేంద్రాల ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది.

2017 తరువాత జిల్లాలో ఎక్కడా కొత్త కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. సర్వే చేయించి అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది. గతంలో నూతన కేంద్రాల ఏర్పాటుకు ప్రకటన జారీ చేసినా కోర్టు స్టే కారణంగా ఈ ప్రక్రియ ఆగిందని మీ సేవ జిల్లా మేనేజర్ సాయి తెలిపారు. త్వరలో రాత పరీక్ష నిర్వహించి చౌటుప్పల్, మునుగోడు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు.

# జన ఔషధి.. పేదల పెన్నిధి




పరిగి : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వివిధ పథకాలు అమలు చేస్తోంది. మరోవైపు గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే చౌక ధరలకు మందులు అందించాలని దుకాణాలు నిర్వహించేలా సంకల్పించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు జిల్లాలో కనీసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభిస్తామని అధికారులు నాలుగేళ్లుగా చెబుతున్నా బాలారిష్టాలు దాటడం లేదు. ఇప్పటి వరకు ఒక్కటీ ప్రారంభించలేదు. జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 657 గ్రామ, 19 మండల సమాఖ్యలున్నాయి. వాటిలోని సభ్యులకు అప్పగించేందుకు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నీలినీడలు కమ్ముకున్నాయి.

**సౌభాగ్య పథకం కింద..** సౌభాగ్య పథకం కింద జన ఔషధి స్టోర్ పేరిట రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో దుకాణాలు నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతోపాటు నిరక్షరాస్యత అధికంగా ఉంది. దీంతో మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన కొరవడింది. ఇలాంటి సమయాల్లో మందుల కొనుగోలు వారికి ఆర్థిక భారంగా మారింది. చౌకధరలకు మందులు దొరకితే ఎంతో ప్రయోజనం కలగనుంది.

**నిబంధనల సడలింపు..**

జన ఔషధి స్టోర్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో బీఫార్మసీ, ఎంఫార్మసీ చదువుకున్న వారికే అవకాశముండేది. ప్రస్తుతం ఆ నిబంధనలు మార్చారు. సంఘం సభ్యురాలి కుటుంబీకులు లేదంటే స్నేహితులు, బంధువులకు సంబంధించిన వారూ దరఖాస్తుకు అర్హులే. ధ్రువపత్రాలు అయిదేళ్లపాటు లీజుకు తీసుకొని నడిపించేందుకు అవకాశం కల్పించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు అనంతరం మండల కేంద్రాలపై దృష్టి సారించాలని నిరుపేదలు కోరుతున్నారు. గతేడాది తాండూరు, కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్, దోమ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా వివిధ కారణాలతో వాటిని తిరస్కరించారు.

**ముందుకొస్తే ప్రోత్సహిస్తాం..–రాజు, ఏపీఎం**

మండలంలో ఔత్సాహికులైన మహిళలు ముందుకొస్తే ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తాం. ఆర్థికంగా నిలదొక్కుకునే సంఘం సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. జనరిక్ ఔషధాలు తక్కువ ధరలకే పేదలకు లభిస్తాయి.

# దోమల దండు.. జ్వరాలు మెండు



తాండూరు: పట్టణంలో డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. రాజీవ్ గృహకల్ప కాలనీలో ఓ బాలుడికి సోకింది. ఇందిరానగర్‌లోని రామమందిర్, గరీబ్‌నగర్‌లో ఒక్కో కేసు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు. పుర సిబ్బంది పరిసరాలను శుభ్రం చేయించారు. దోమల నివారణకు రసాయన మందులు పిచికారీ చేశారు.

**ఇలా చేస్తే మేలు..**: పట్టణంలో నిల్వ నీటిని ఎప్పటికప్పుడు బయటికి పంపాలి. అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. సాయంత్రం వేళ దోమలు కుట్టకుండా ఫాగింగ్ చేయాలి. కాలనీల్లో వరద నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. వీధుల్లో పోగవుతున్న చెత్తను ఎప్పటికప్పుడు దిబ్బకు తరలించి కాలనీలను శుభ్రంగా ఉంచాలి.

**ఎగువ నుంచి దిగువకు పారి..**

దోమలు బాగా పెరగడంతోనే డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తున్నాయి. వర్షాలతో ఎగువ నుంచి వరద దిగువనున్న కాలనీల్లోకి చేరుతోంది. నీరు గుంతల్లో నిల్వ ఉంటోంది. ఇలాంటి మడుగుల్లోని నీటిపై దోమలు గుడ్లు పెట్టి సంతతిని వృద్ధి చేస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద పట్టణంలోని మార్కండేయనగర్, మిత్రానగర్, గ్రీన్‌సిటీ, అయ్యప్పనగర్, ఆదర్శ, తులసీనగర్, సాయిపూరు శివారు కాలనీల్లోకి చేరుతోంది. ఇందిరానగర్, మాణిక్‌నగర్, గొల్ల చెరువు కాలనీల్లో చాలాచోట్ల నిల్వ ఉన్న మురుగుకు వరద తోడవుతోంది. ఇలాంటి ప్రదేశాల్లోనే దోమలు వృద్ధి చెంది స్థానికులను అనారోగ్యాల బారిన పడేస్తున్నాయి. మురుగు దిగువకు వెళ్లకుండా నిలిచిపోయే ప్రదేశాలు దోమల ఉత్పత్తికి కారణమవుతున్నాయి.

**పట్టణ వాసులు జాగ్రత్తలు పాటించాలి..**– డా.గిరిధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరానగర్

డెంగీ, మలేరియాతోపాటు టైఫాయిడ్ జ్వరాలు సోకకుండా పట్టణ ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలి. ఇళ్లలోని పూలకుండీల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. వినియోగంలో లేని కూలర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, రుబ్బురోళ్లు, ఇనుప సామగ్రి, టైర్లు, ప్లాస్టిక్ బకెట్లు, డ్రమ్ములు, సిమెంటు తొట్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. లేదంటే దోమలు ఆవాసం ఏర్పాటు చేసుకొని సంతతిని వృద్ధి చేసుకుంటాయి. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. **చర్యలు చేపడుతున్నాం..**

– విక్రమ్‌సింహారెడ్డి, పుర కమిషనర్, తాండూరు

పట్టణంలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం. కాలువల్లో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. స్థానికులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలో దోమల నివారణకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే ఫాగింగ్ చేస్తాం.

# లబ్ధిదారుల్లో 'డబుల్' ఆశలు

వేములవాడ: ఇళ్లు లేని నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత సర్కారు మొదలుపెట్టిన రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి ఇటీవల లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం పట్టాలు అందించడంతో ఆశలు చిగురించాయి. వేములవాడ పట్టణంలో చాలామంది సొంతిళ్లు లేక అద్దెకుంటున్నారు. చిన్నా చితక వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు అనేకమంది ఉన్నారు. వీరికి మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 800 ఇళ్లను మంజూరు చేసింది. వీటన్నింటికి ఒకే ప్రాంతంలో స్థలం లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలించారు.

**రూ.40 కోట్లతో పనులు**

మొదటి విడతగా నాంపల్లి శివపార్వతుల కాలనీకి ఎదురుగా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి 144 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం రూ.40.32 కోట్లతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. జీ ప్లస్ టూ కింద ఒక్కో బ్లాక్‌లో 12 ఇళ్లు ఉండేలా నిర్మాణాలు చేపట్టారు. వాస్తవానికి ఇవి 2021 సెప్టెంబరులో పూర్తి కావాల్సి ఉన్నప్పటికి.. సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆగుతూ సాగుతూ, కొన్ని బ్లాక్‌లు స్లాబ్ వరకు నిర్మాణం చేశారు. ఆ తరువాత గుత్తేదారు వదిలేయడంతో మూడున్నరేళ్లుగా పనులు నిలిచిపోయాయి.

**పట్టాల పంపిణీతో ఆశలు**



రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకే ప్రాధాన్యం ఇస్తుండటంతో ఈ రెండు పడక గదుల నిర్మాణాలను పట్టించుకున్నవారు లేరనే విమర్శలున్నాయి. పట్టణంలో ఇందిరమ్మ వార్డు కమిటీలను నియమించి ఇంటింటి సర్వేతో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించారు. వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇదే క్రమంలో అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి 144 మంది పేదలకు కూడా ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇంటి పట్టాలను పంపిణీ చేయడంతో ఆశలు చిగురించాయి. ఇందుకు సంబంధించి రూ.7.63 కోట్లు మంజూరుకాగా ఇందులో రూ.2 కోట్ల మేర నిధులు ఖర్చయ్యాయి. మిగిలిన రూ.5.63 కోట్ల నిధులతో అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కాగా ఈ పనులు నిలిచిపోవడంతో సదరు నిర్మాణాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

# ఆశయ సాధనలో.. ఐదు దశాబ్దాలు..!

చిట్యాల : మహాత్ముడి సిద్ధాంతాలు, ఆశయాలను గత 50 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నాయి 'గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్', 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ' సంస్థలు. ఈ సంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్గొండ జిల్లాకు చెందిన యానాల ప్రభాకర్‌రెడ్డి పని చేస్తున్నారు. 2007 నుంచి ఆయన ఈ సంస్థల కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ' అంతర్జాతీయంగా, 'గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్' దేశంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా గాంధీ సూచించిన సూత్రాలైన 'సత్యం, అహింస, దొంగతనం చేయకుండా ఉండటం, బ్రహ్మచర్యం పాటించడం, స్వీయ క్రమశిక్షణ, మంచి నడవడిక, అనుమతి లేకుండా ఇతరుల వస్తువులను తాకడం, సర్వధర్మ సమానత్వం, స్వదేశీ వస్తువుల వాడకం, అంటరానితనం నిర్మూలన, శ్రమదానం, మధురవచనాలు పలకడం వంటి వాటిపై ప్రచారం నిర్వహిస్తున్నారు. వీటితో పాటు



విద్యార్థులలో స్వయం సమృద్ధి సాధనకు మెలకువలు, ప్రకృతి వైద్యం, సేంద్రియసాగు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపైనా విద్యాసంస్థల్లో, ఇతరత్రా సెమినార్లు, కార్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 400 వరకు కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 2018లో నల్గొండ ఎన్‌జీ కళాశాలలో 5500 మంది విద్యార్థులతో నిర్వహించిన గాంధీ వేషధారణ ప్రదర్శన గిన్నిస్‌బుక్ రికార్డులకు ఎక్కింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో గాంధీ ప్రతిమలతో ఇటీవల ప్రదర్శన నిర్వహించారు. తమ సంస్థలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని రానున్న అక్టోబరు 10 నుంచి 13 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించామని, సీఎం ముఖ్య అతిథిగా రానున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

# లెక్కల్లేవు.. దస్త్రాల్లేవు!

మెదక్: సొంతలాభం కొంత మానుకొని.. పొరుగు వారికి తోడుపడవోయి.. అన్నది కవి వాక్కే కాదు.. మన సమాజ ధర్మం కూడా. దాన్ని పరిశ్రమలు తప్పకుండా పాటించాలని తెచ్చిందే సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) విధానం. ప్రభావిత ప్రాంతాల్లో ప్రగతి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్నారు. ఇందుకోసం పటిష్ఠ విధివిధానాలు రూపొందించి అమలు చేసే బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పలు పరిశ్రమల నిర్వాహకులు పర్యవేక్షణ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకొని.. నిర్దేశిత నిధులు పూర్తిగా వ్యయం చేయకుండా కాగితాల్లోనే మమ అనిపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనల ప్రకారం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత లాభం ఆర్జిస్తున్న కంపెనీలు తప్పనిసరిగా ఆదాయంలో రెండు శాతాన్ని సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాలి. ప్రతి కంపెనీలోనూ సీఎస్ఆర్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ నిధులను వ్యయం చేయకుంటే జరిమానా విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

**సంగారెడ్డిలో లొసుగులు ఇలా..**

రెండు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లాలో సీఎస్ఆర్ నిధులపై కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష నిర్వహించగా.. పలు లొసుగులు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా కంపెనీలు ఎన్ని నిధులు వెచ్చించాయనే సమాచారం పర్యవేక్షణ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. దీంతో పాటు పరిశ్రమల వద్ద సైతం ఈ నిధుల వ్యయంపై దస్త్రాలు లేవు. ఏయే



పనులు చేపట్టారనే దానిపై జిల్లా అధికారులతో పాటు పరిశ్రమల వద్ద సమాచారం కొరవడింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం కాగితాల్లోనే జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చిన కలెక్టర్ నూతనంగా సీఎస్ఆర్ కమిటీని నియమించి చేపడుతున్న పనులపై పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో..**

సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సీఎస్ఆర్ నిధుల జమ, వినియోగానికి సంబంధించిన అధికారుల వద్ద సమచారం కొరవడింది. పరిశ్రమలు ప్రకటించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగానికి నోచడం లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా ఆడిట్ లేకపోవడంతోనే సీఎస్ఆర్ నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలు పరిశ్రమల వద్ద లేనట్లుగా తెలుస్తోంది. చేపట్టిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ సక్రమంగా సాగకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సీఎస్ఆర్ నిధుల వినియోగంపై పర్యవేక్షణ పెరగడంతో పాటు నూతన కమిటీల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

# ప్రభుత్వ బడుల్లో.. పూర్వ ప్రాథమిక విద్య

తూప్రాన్,: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. వాటిల్లో శుక్రవారం నుంచే బోధన కొనసాగనుంది. జిల్లాలో 27 పాఠశాలలను ఎంపిక చేయగా అందులో బోధకులు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. బోధకులకు ఇంటర్, ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. అన్ని పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా బోధకులు 150 మందికి, ఆయా పోస్టుకు 130 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిల్లో విద్యార్హత ఎక్కువగా ఉన్న వారికి అవకాశం కల్పించేలా పరిశీలిస్తున్నారు. చిన్న ఉద్యోగం.. పెద్ద చదువులు: ఈ పోస్టులకు దరఖాస్తులు సమర్పించిన వారిలో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారున్నారు. కొన్ని చోట్ల ఒక్కో పాఠశాలలో 10 వరకు దరఖాస్తులు వచ్చాయి. బోధకులకు రూ. 8వేల వేతనం, ఆయాకు రూ. 6వేల వేతనం ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయినా చాలా గ్రామాల్లో రెండు ఉద్యోగాలకు పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొందరు పైరవీలు సైతం చేసుకుంటున్నారు. అయినా నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తిచేసి, చిన్నారులకు బోధన అందించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రైవేట్‌కు వెళ్లే చిన్నారులను వీటిల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నం చేస్తున్నారు. ఆదేశాలు ఇచ్చాం: రాధాకిషన్ డీఈఓ పూర్వప్రాథమిక విద్యా విధానాన్ని ప్రారంభించేందుకు అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. వారే బోధకులు, ఆయాలను నియమిస్తారు. వారు అందించిన జాబితానే ఖరారు చేస్తాం.

# మాయ చేసి.. మాయం చేసేసి!

ఒంగోలు : వేసవి కాలం ఆరంభమయ్యే ఏప్రిల్, మేలలో పంటల సాగు ఊసే ఉండదు. బోర్లు కింద కొన్నిచోట్ల కూరగాయల పంటలు వంటివి మాత్రమే వేస్తుంటారు. వీటికి వంద కాదు.. రెండొందలు కాదు.. వేల టన్నుల యూరియా వినియోగించినట్లు దస్త్రాల్లో సృష్టించారు. సీజన్‌కు ముందే తెలివిగా వ్యాపారులు సరకు అమ్మేసినట్లు లెక్కలు చూపారు. యూరియా పక్కదారి పడుతున్న విషయాన్ని పట్టించుకోని వ్యవసాయాధికారులు ఆమ్యామ్యాలతో చోద్యం చూశారు. జిల్లాలో 1.29 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగవుతున్నాయి. గత నెల ఆరంభంలోనే పంటల సాగు ముమ్మరం కావాల్సి ఉన్నా వర్షాభావ పరిస్థితులతో సాగు జాప్యమై గత నెలాఖరు నుంచి మొదలైంది. ప్రస్తుతం జిల్లాలో 58 వేల హెక్టార్లలో పంటలు వేశారు. యాభై శాతం పంటలు వేయకున్నా యూరియా వినియోగం మాత్రం వేల టన్నులకు చేరుకుంది. తీరా పంటలకు అవసరమయ్యే సమయానికి నిల్వలు అందుబాటులో లేక రైతులు నల్లబజారులో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాకు అవసరమెంత? సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో ఎంత వరకు అందుబాటులో ఉంచాలనే దానిపై ప్రణాళికతో సిద్ధంగా ఉండాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించారు. దీంతో రూ.266 ధర ఉన్న యూరియా బస్తాను రైతులు రూ.400కు కొనుగోలు చేయాల్సి వస్తోంది. లేదంటే మిశ్రమ ఎరువులను రైతులకు



అంటగడుతున్నారు. రైతులు రూ.1,500 వెచ్చించి డీఏపీ బస్తా కొనుగోలు చేస్తే రూ.300 ధరకు యూరియా బస్తా ఇస్తున్నారు. ఇదేమని డీలర్లను అడిగితే నిల్వలు అందుబాటులో లేవని, నచ్చితే కొనండి.. లేకుంటే లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాలోని ఓ స్వయంసమృద్ధి సంఘానికి 525 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించగా, దీనిలో 258 మెట్రిక్ టన్నుల యూరియా ఉండగా, సీజన్‌కు ముందే నిల్వలు ఖాళీ అయిపోవడం గమనార్హం. వాస్తవానికి ఏప్రిల్, మే, జూన్‌లలో ఉద్యాన పంటలకు యూరియా అవసరమనుకున్నా వందల టన్నుల్లోనే ఉంటుంది. వేల టన్నులు ఏమైందో దేవుడికే ఎరుక. జులైలో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. ఒక్క నెలలోనే 3 వేలకుపైగా టన్నులు ఎవరికిచ్చారో అర్థం కావడంలేదు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో తోటలకు యూరియా వినియోగం జరిగి ఉంటుందని చెబుతున్నారు. యూరియా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో దాడులు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

# ఆ'గని' ప్రమాదాలు!

ఒంగోలు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో వివిధ రకాల క్వారీలు ఉన్న నేపథ్యంలో ఆయా గనుల్లో భద్రతను పర్యవేక్షించాల్సిన డీడీఎంఎస్ (డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ) కార్యాలయం పక్క రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉండడం గమనార్హం. జిల్లాలో గ్రానైట్ గనులు వెలుగులోకి రాక ముందు నెల్లూరులో డీడీఎంఎస్ కార్యాలయం ఉండేది. దీని పరిధిలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని చీమకుర్తి, కనిగిరి, మార్కాపురం, బల్లికురవ, గురిజేపల్లి తదితర ప్రాంతాల్లోని గనులుండేవి. తరచూ భద్రతా విభాగం అధికారుల తనిఖీలు జరుగుతుండేవి. అలాంటిది 2021లో నెల్లూరులోని కార్యాలయాన్ని హైదరాబాద్‌కు తరలించడంతో గనుల్లో భారీ ప్రమాదాలు చోటుచేసుకుంటే తప్ప తనిఖీలు ఉండటంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలోని చీమకుర్తి ప్రాంతంలోని గ్రానైట్ క్వారీల్లో 15 ఏళ్ల కిందట తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ఏడాదిలో పది మందికిపైగా మృత్యువాత పడేవారు. చీమకుర్తి మండలం రామతీర్థంలోని ఓ గ్రానైట్ క్వారీలో 2010లో హైవాల్ విరిగి పడి 13 మంది కార్మికులు దుర్మరణం చెందారు. దీంతో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు రామతీర్థంలో వృత్తి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి భద్రతా అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించడంతో గత దశాబ్ద కాలంలో ప్రమాదాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో భద్రతా పరంగా యాజమాన్యాల్లో ఉదాసీనత పెరిగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో భద్రతా వారోత్సవాలు నిర్వహించే సమయంలో వారం రోజులపాటు భద్రతా బృందాలు గనుల్లో భద్రతా అంశాలు పరిశీలించి తగిన సూచనలు చేసేవారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన



వారోత్సవాల్లో అవేవీ కనిపించకపోవడం గమనార్హం. ఇటీవల ఓ క్వారీలో పైగోడల నుంచి భారీగా రాళ్లు కిందకు జారిపడిన ఘటనలో కార్మికులెవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో క్వారీని సందర్శించిన జిల్లా గనుల శాఖ అధికారి క్వారీల యజమానులు, మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలిస్తామని, క్వారీల్లో భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లోని డీడీఎంఎస్ కార్యాలయాన్ని ఒంగోలుకు మార్పు చేయాలనే డిమాండు గత కొంతకాలంగా వినిపిస్తోంది. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో సుమారు 100 క్వారీలుండగా, భద్రతా అంశాలను పర్యవేక్షించాల్సిన డీడీఎంఎస్ కార్యాలయం హైదరాబాద్ ఉండడమేమిటని ప్రశ్న తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో డీడీఎంఎస్ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 'మంట'.. ఉపశమనం ఉండదంట!



అనకాపల్లి : 1. ఇటీవల పరవాడలోని జేఎన్ ఫార్మాసిటీలోని ఎస్.ఎస్ ఫార్మాలో కొన్ని నెలల క్రితం విషవాయువు లీకై.. ఇద్దరు చనిపోగా, ఒకరు అస్వస్థతకు గురయ్యారు. గాయపడిన కార్మికుడిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు.

2. కొన్ని నెలల క్రితం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మృతి చెందారు. మరో 30 మందికి పైగా గాయాలయ్యాయి. అత్యవసర చికిత్స అందక ఐదుగురు వరకు చనిపోయారు.

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో (సెజ్‌లో) వందకు పైగా కంపెనీలున్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. పక్కనున్న పరవాడ ఫార్మాసిటీలో మరో 60 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఈ రెండు పారిశ్రామికవాడల్లో రసాయన పరిశ్రమలు ఎక్కువే. ఈ కారణంగా చిన్నపాటి ప్రమాదం సంభవించినా ఎక్కువ మందికి కాలిన గాయాలే అయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎంత త్వరగా వైద్యమందితే అంత మంచిది. కానీ అచ్యుతాపురం, పరవాడలోని ఏ ఆసుపత్రిలోనూ బర్నింగ్ వార్డు లేదు. దాంతో ప్రతి ప్రమాదకర సందర్భంలోనూ అనకాపల్లి, విశాఖపట్నం తరలించాల్సి వచ్చింది. అచ్యుతాపురంలో కొత్తగా కడుతున్న కార్మిక రాజ్య బీమాసంస్థ (ఈఎస్ఐ) ఆసుపత్రి నిర్మాణానికి ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఏపీఐఐసీ 2021లో ఇందుకోసం రెండెకరాల స్థలం ఉచితంగా కేటాయించింది. 2024లో రూ. 62 కోట్లతో 30 పడకల ఆసుపత్రికి భూమిపూజ జరిగింది. ఇప్పటికీ మందకొడిగానే పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణానికి వైకాపా చొరవ చూపలేదు. దీంతో చాలా వరకు పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సకల సౌకర్యాలు కల్పిస్తున్నా..

నిర్మాణాల్లో జాప్యం జరుగుతుంది. జిల్లాలో 1.2 లక్షల మంది ఈఎస్ఐ పరిధిలో ఉన్నారు. వేలాది మంది కార్మికులు డిస్పెన్సరీ సేవలకే పరిమితం కావాల్సి వస్తోంది. ఈఎస్ఐ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే కాలిన గాయాలకు విశాఖపట్నం వెళ్లాల్సిన అవసరం ఉండదని కార్మికులు భావించినా వారికి నిరాశే ఎదురవుతోంది. కొత్త ఆసుపత్రిలో ప్రసూతి వార్డు, చిన్న చిన్న గాయాలకు, గుండె సంబంధిత వ్యాధుల చికిత్సకు మాత్రమే వార్డులు ఏర్పాటు చేస్తున్నారు తప్ప బర్నింగ్‌వార్డు ఏర్పాటు ఉండదనే సమాచారంపై కార్మిక సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కార్మికులకు పూర్తిస్థాయిలో రక్షణ, చికిత్స ఉండేలా బర్నింగ్ వార్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **త్వరలో నిర్మాణం..: విజయ్‌కుమార్, ఎలమంచిలి, ఎమ్మెల్యే** ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్మాణం జరుగుతోంది. ఎటువంటి చిన్న ప్రమాదం వచ్చినా.. అన్నిరకాల సేవలందేలా దీని నిర్మాణం జరుగుతుంది. బర్నింగ్ వార్డు తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చూస్తాం.

# అటు ఖర్చు.. ఇటు కాటు



కాకినాడ : కాకినాడ నగరంలో శునకాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లో పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. పలువురిపై దాడి చేస్తున్నాయి. కొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలు, సైకిళ్ల వెంట పరుగులు తీస్తుండడంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆసుపత్రులకు కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. శస్త్రచికిత్సల పేరుతో నిధులు ఖర్చు చేస్తున్నా, శునకాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. **గుంపులు గుంపులుగా...** నగరంలో శునకాలు గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. మొత్తం 11 వేలకు పైగా వీధి కుక్కలుంటాయని అంచనా. గత అయిదేళ్లుగా శునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇప్పటివరకు 6 వేల వరకు చేశారని చెబుతున్నారు. అయినప్పటికీ వాటి సంఖ్య తగ్గడం లేదు. గతంలో పోలిస్తే రెట్టింపుగా కనిపిస్తున్నాయి. వీధి కుక్కల విషయంలో నగరపాలక సంస్థ వద్ద స్పష్టత లేదు. రెండేళ్ల కిందట సర్వే నిర్వహించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించి, తెల్లవారు జామున ఏక కాలంలో వీధుల్లో సంచరించి గణన చేశారు. నివేదికను మాత్రం వెల్లడించలేదు.

**ఒక్కో ఆపరేషన్‌కు రూ.1300**

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేసే బాధ్యతను సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ (స్నాప్) అనే సంస్థకు అప్పగించారు. ఇద్దరు వైద్యులు, సిబ్బంది సాయంతో ఆపరేషన్లు చేస్తున్నారు. ఇందుకు ఒక్కో దానికి రూ.1300 వరకు నగరపాలక సంస్థ వెచ్చిస్తోంది. ఇంత చేసినా కుక్కల సంతాన నియంత్రణలో తేడా కనిపించటం లేదు. ఎక్కడ చూసినా పెద్దసంఖ్యలో దర్శనమిస్తూ జనాలపైకి ఎగబడుతున్నాయి.

**సజావుగానే చేస్తున్నాం**

నగరంలో వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు సజావుగానే జరుగుతున్నాయి. నగర శివారు గ్రామాల నుంచి కొన్ని నగరంలో రావడంతో ఎక్కువగా కనిపిస్తున్నాయి. మిగిలిన వాటికి కూడా శస్త్రచికిత్సలు పూర్తిచేసి వాటి సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ, కాకినాడ

# ఉద్యానాలను గాలికొదిలేశారు..



రామచంద్రపురం : పురపాలక సంఘాల్లోని ఉద్యానవనాలు అసౌకర్యాలతో ఉన్నాయి. నిర్వహణ కొరవడి తుప్పలు పెరిగి.. వ్యర్థాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం, అమలాపురం, మండపేట పట్టణాల్లోని ఉద్యానవనాలను అభివృద్ధి చేయకుండా ఆరేళ్లుగా వదిలేశారు.

**రామచంద్రపురం.. 6** రామచంద్రపురంలోని ఆరు పార్కుల్లో ఒక్కటీ ఉపయోగంలో లేదు. శివాలయం వీధిలోని నందివాడ సత్యనారాయణ పార్కులో దీపాలు వెలగవు. సగం ట్రాక్‌ను అభివృద్ధి చేసి వదిలేశారు. పిల్లలు ఆడుకునే సామగ్రి పాడై అన్యాక్రాంతమయ్యాయి. బ్రాడీపేటలోని ఎస్ఆర్‌కే విజయాదేవి పార్కు పక్కనే చెత్త వేయడం, పిల్లలు ఆడే వస్తువులు పాడవడంతో సందర్శకులు తగ్గిపోయారు. రత్నంపేట పురపాలక పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు చేస్తామని మరిచారు. వైఎస్సార్‌నగర్, అఫీషియల్‌కాలనీ, రాజబాబునగర్‌లో ప్రహరీలు నిర్మించి వదిలేశారు. **అమలాపురంలో..** అమలాపురం పట్టణంలో చంద్రబాబునాయుడు ఉద్యానవనం, తామరచెరువు పార్కు, గోఖలేవీధిలో పిల్లల పార్కు, నల్లవంతెన నుంచి ఎర్రవంతెన వరకు ఉన్న కాటన్‌పార్కు, తామరచెరువు పార్కు, పిల్లల ఉద్యానాల్లో రెండు మాత్రమే ఫర్వాలేదు. మంచినీటి చెరువు వద్ద ఉన్న పార్కును నిర్వీర్యం చేసేశారు. రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి చేస్తామని పనులను ప్రారంభించలేదు. **మండపేటలోనూ అంతే..** కొండపల్లివారివీధిలో నందమూరి తారకరామారావు పార్కులో పరికరాలు, ఫౌంటైన్ ధ్వంసమయ్యాయి. 19వ వార్డు పరిధి వల్లూరి రామస్వామి ఉద్యానంలో క్రీడా పరికరాలు తుప్పుపట్టాయి. 11వ వార్డు న్యూకాలనీ అంబేడ్కర్ ఉద్యానవనంలో బల్లలు విరిగిపోయాయి.

**త్వరలోనే అభివృద్ధి చేస్తాం..** పట్టణంలోని ఉద్యానవనాలను నిధుల మంజూరును బట్టి త్వరలోనే అభివృద్ధి చేస్తాం.

# భళా నుంచి దివాలాకు!

ఒంగోలు : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు లాభాలు చేకూర్చేందుకు ఒంగోలు నగరంలో రెండేళ్ల కిదంట మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. దీనిని నగరంలోని పొదుపు సంఘాల మహిళలు ఒక్కొక్కరు రూ.150 చొప్పున పెట్టుబడులు పెట్టి రూ.లక్షల వ్యయంతో ప్రారంభించారు. అధికారుల తీరుతో ప్రస్తుతం దివాలా అంచుకు చేరింది. లాభాల మాట అటుంచితే పెట్టుబడి రూపంలో పెట్టిన రూ.లక్షలు ఏమయ్యాయోయని పొదుపు సంఘాల మహిళలు ఆందోళన చెందుతున్నారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు రెండేళ్ల కిందట ఒంగోలులోని 4 వేల పొదుపు సంఘాల నుంచి రూ.48 లక్షలు వసూలు చేశారు. అప్పటి ప్రజా ప్రతినిధులు కూడా రూ.లక్షల్లో సాయం అందించారు. మార్ట్‌లో వచ్చే లాభాలను సభ్యులందరికీ పంచుతామని అధికారులు పేర్కొన్నారు. మార్ట్ ప్రారంభమైన అనంతరం కొంతకాలంపాటు లాభాలొచ్చినట్లు లెక్కలు చూపారు. తరువాత ఏం జరిగిందో మార్ట్‌లో సరకులు ఖాళీ అవుతూ రావడంతోపాటు బ్యాంకు ఖాతాలో నగదు ఖాళీ అవుతూ వచ్చింది. నగదు నిల్వలు కరిగిపోవడంతో పొదుపు మహిళలు ఆందోళన చెందుతూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

సరకులు విక్రయించిన నగదు ఏం చేశారని ప్రశ్నిస్తే, లెక్కలు సరిచూస్తామని చెప్పుకొస్తున్నారు తప్ప ఏం జరుగుతుందనే దానిపై అధికారులు విచారణ ప్రారంభించలేదు. ప్రస్తుతం మార్ట్ మూతపడే దశకు చేరుకుంది. గతేడాది అక్టోబరు నాటికి ఓ అధికారి బదిలీ అయినప్పుడు రూ.6.70 లక్షల విలువైన సరకులు లెక్కలు చూపారు.



అంత తక్కువ సరకులు ఉండటంపై అప్పట్లోనే పెద్ద చర్చకు దారి తీసింది. బ్యాంకు ఖాతాను పరిశీలిస్తే రూ.20 లక్షల మేర నగదు ఉంది. నిర్వహణ పేరుతో ఆ ఖాతా నుంచి నగదును తీసి సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చుల పేరిట ఖర్చు పెట్టేశారు. తమకు లాభాలు పంచకపోగా, అసలు సొమ్మునే మాయం చేస్తుండడంపై పొదుపు సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ కమిటీని నియమించాం :** మార్ట్ నిర్వహణలో లోపాలను గుర్తించేందుకు విచారణ కమిటీని నియమించాం. రెండేళ్ల కిందట మహిళా మార్ట్ ప్రారంభమైనప్పటి నుంచి నెలవారీ లావాదేవీల వివరాలు సేకరిస్తున్నాం. బ్యాంకు ఖాతాలను సైతం పరిశీలిస్తున్నాం. విచారణలో అక్రమాలు బయటకు తీయిస్తాం.

శ్రీహరి, పీడీ, మెప్మా

# గ'తుక్కు'మనక్కర్లేదు!

ఒంగోలు :పచ్చని పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం కబళిస్తోంది. దీని నియంత్రణకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా పూర్తిస్థాయిలో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో గుంటూరు గ్రామీణ మండలంలో ఈ ఏడాది జులై 10వ తేదీన పైలట్ ప్రాజెక్టు కింద 'స్వచ్ఛ రథం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని ఆదేశిస్తూ తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తొలివిడతగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8 మండలాలను ఎంపిక చేసి చేసినట్లు జడ్పీ సీఈవో చిరంజీవి తెలిపారు.

**ఏమిటీ ప్రాజెక్టు..**

ఇళ్లల్లో నిరుపయోగమైన సామగ్రిని ఒకేసారి తీసుకెళ్లి రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తుంటారు. దీంతో పలుచోట్ల వ్యర్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఇకపై పనికి రాని ప్లాస్టిక్, గాజు, ఇనుప వస్తువులు, అట్టపెట్టెలు, పుస్తకాలు తదితర సామగ్రిని నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సేకరిస్తారు. ఆ ధరకు సమానంగా కిరాణా సరకులు ఇస్తారు. అందుకు 'స్వచ్ఛ రథం' కింద సంచార వాహనాలను సిద్ధం చేయనున్నారు. ఎంపిక చేసిన మండలాల్లో రోజుకొక గ్రామం చొప్పున ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనం తిరుగుతుంది. ఆయా మండలాల్లో విజయవంతమైతే జిల్లాలోని మిగతా మండలాల్లోనూ పథకం విస్తరించనున్నారు. స్క్రాప్ డీలరును 'స్వచ్ఛ బంధు'గా నియమిస్తారు. వీరికి మండల ప్రజాపరిషత్తు నుంచి నెలకు రూ.25 వేలు చొప్పున పారితోషికం ఇవ్వనున్నారు.

**ఎంపిక చేసిన మండలాలు:** చీమకుర్తి, మద్దిపాడు, కొత్తపట్నం, పామూరు, టంగుటూరు, బల్లికురవ, మార్టూరు, వేటపాలెం

స్వచ్ఛ రథంలో లభించే సామగ్రి: కొబ్బరినూనె సీసా, సర్ఫ్ ప్యాకెట్, దస్తుల సబ్బులు, ఒంటి సబ్బులు, టీ/కాఫీ ప్యాకెట్లు, కంఫర్ట్ ప్యాకెట్లు, లేస్, షాంపు ప్యాకెట్లు, పేస్ట్‌లు, ఉల్లిపాయలు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమ పిండి కిలో ప్యాకెట్, వేరుశనగ, మినపపప్పు, కందిపప్పు.

# అందంపై శిక్షణ.. అతివలకు ఆలంబన

తాళ్లూరు: కాలంతోపాటు ఉపాధి రంగంలోనూ అనేక మార్పులు వస్తున్నాయి. గతంలో వీటిపై ఎక్కువగా పట్టణ ప్రాంత మహిళలు మక్కువ చూపేవారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంత వనితలు సైతం నేర్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించేందుకు కృషి చేస్తున్నారు. అందుకు తాజా ఉదాహరణగా పట్టణాలకే పరిమితమైన బ్యూటీషియన్ కోర్సు ప్రస్తుతం గ్రామాలకు విస్తరించడాన్ని పేర్కొనవచ్చు.కేంద్రం, జన శిక్షణ సంస్థాన్ తోడ్పాటుతో..కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన శిక్షణ సంస్థాన్ తోడ్పాటుతో పల్లెల్లోని మహిళలు బ్యూటీషియన్ రంగంలో ప్రావీణ్యం గడించేందుకు అవకాశం కలుగుతోంది. ప్రధానంగా పుట్టినరోజు, పెళ్లి, ఇతర శుభ కార్యాలకు సమీప బ్యూటీపార్లర్లకు వెళ్లి అందంగా ముస్తాబై రావడం ఇప్పుడొక అవసరంగా మారింది. బ్యూటీషియన్లు గతంలో పట్టణాల నుంచి రావాల్సి వచ్చేది. ఇక ఆ అవసరాలు లేకుండా నేరుగా గ్రామీణ మహిళలే చేసేందుకు వీలు కలుగుతోంది. ఇప్పటి వరకు పల్లె ప్రాంత వాసులకు కేవలం కుట్టు, అల్లికలు, అంబ్రాయిడరీపైనే శిక్షణకు అవకాశం దక్కగా.. ప్రస్తుతం తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెంలో మహిళలకు ప్రథమంగా బ్యూటీషియన్ కోర్సులో తర్ఫీదు పొందేందుకు అవకాశాలు కల్పించారు. రెండు నెలలపాటు తూర్పుగంగవరానికి చెందిన ట్రైనరు పాల్వాది సునీత 20 మంది బృందానికి నిత్యం శిక్షణ ఇస్తున్నారు. ఐబ్రోస్, బ్లీచింగ్, వ్యాక్సింగ్, మానిక్యూర్, పెడిక్యూర్, వివిధ రకాల హెయిర్ కట్స్, ఫేషియల్స్, బ్రైడల్ మేకప్ తదితర అంశాలపై మహిళలు, యువతులకు వివరిస్తున్నారు. నేర్చుకున్న వారంతా ఉపాధి పొందేందుకు బాసటగా దీనిని మలుచుకుంటున్నారు. ఉత్సాహంగా ముందుకొస్తున్నారు... బ్యుటీషియన్ కోర్సు నేర్చుకోవడానికి గ్రామీణ ప్రాంతం నుంచి మహిళలు ముందుకు వస్తారో, రారో అని మొదట్లో సందేహించాను. కానీ శిక్షణ ప్రారంభించాక మహిళలు చాలా ఉత్సాహంతో హాజరవుతున్నారు. విషయాలన్నింటినీ శ్రద్ధగా తెలుసుకొని ఆచరిస్తున్నారు. పాల్వాది సునీత, శిక్షకురాలు

## 'తల'కెక్కించుకోకుంటే జేబుకు చిల్లే..!

కాకినాడ: 'శిరస్త్రాణం (హెల్మెట్) లేకుండా వాహనంతో రోడ్డెక్కితే పోలీసులు ఏం చేస్తారు..? ఫొటో తీస్తారు, ఈ-చలానా పంపిస్తారు. డబ్బులున్నప్పుడు జరిమానా కడతాం. లేకుంటే అలానే తిరుగుతాం' ఇదీ కొంత మంది తీరు. ఇకపై శిరస్త్రాణం లేకుండా బండి ఎక్కితే లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రమాద కేసుల్లో చిక్కుకున్నవారి లైసెన్స్‌లనే రద్దు చేస్తున్నారు.

**వందలో 20 మందే వినియోగం..**

రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నవారిలో ఎక్కువ మంది శిరస్త్రాణం, సీటుబెల్ట్ ధరించనివారే ఉంటున్నారు. జిల్లాలో ఎనిమిది లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు శిరస్త్రాణం లేకుండా ప్రయాణించే వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో రూ.100 అపరాధ రుసుము ఉండగా ఇప్పుడు రూ.1,035కు పెంచారు. ముఖ్యంగా కాకినాడ నగరంలో ప్రతి వంద ద్విచక్ర వాహనదారుల్లో 20 నుంచి 25 మంది మాత్రమే శిరస్త్రాణం ధరిస్తున్నట్లు రవాణాశాఖ పరిశీలనలో తేలింది. నిబంధనలిలా ..

హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ మొదటిసారి చిక్కితే మూడు నెలలు లైసెన్సు రద్దు చేయవచ్చు. రెండోసారి దొరికితే ఆరు నెలలు రద్దు చేస్తారు. మూడోసారి కూడా చిక్కితే కోర్టు ఆదేశాలతో శాశ్వతంగా రద్దుచేసే అవకాశం ఉంది. లైసెన్స్ రద్దు తర్వాత వాహనం నడిపితే



రూ. 5 వేల అపరాధ రుసుం విధిస్తారు.

**ఏడాదిలో 4300 లైసెన్స్‌లు రద్దు..**

జిల్లాలో గత ఏడాది కాలంలో సుమారు 4,300 మంది ద్విచక్ర వాహనదారుల లైసెన్స్‌లు రద్దు చేశారు. సగటున నెలకు 330 నుంచి 350 వరకు రవాణాశాఖ అధికారులు వీటిని సస్పెండ్ చేస్తున్నారు. సెక్షన్ 304ఎ కింద నమోదైన కేసుల్లో లైసెన్స్‌లు ఆటోమేటిగ్గా ఆరు నెలలు రద్దయిపోతున్నాయి. ఇలా జిల్లాకు చెందినవారు నెలకు 200 వరకు ఉంటే ఇతర జిల్లాలకు చెందినవారు 150 మంది ఉంటున్నారు.

**ఆలోచనా ధోరణి మారాలి..**

ద్విచక్రవాహనదారుల్లో చాలామంది శిరస్త్రాణం ధరించడం లేదు. కొంతమంది లైసెన్స్‌లు లేకుండానే నడుపుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కేసుల్లో చిక్కుకుంటే చాలా ఇబ్బందులు పడాలి. వాహనదారుల ఆలోచన మారాలి. మోటార్ వాహనాల చట్టంపై కళాశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం.

శ్రీధర్, రవాణశాఖ ఉప కమిషనర్, కాకినాడ

## గుట్టలన్నీ గుటకాయ స్వాహా

పాయకరావుపేట: పోలవరం కాలువ గ్రావెల్ అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పోలవరం ఎడమ కాలువ, రెవెన్యూ, పోలీసు శాఖల మౌనం వీరికి వరంగా మారింది. ఇక్కడ గుట్టలుగా ఉన్న గ్రావెల్‌ను రాత్రి, పగలు తేడాలేకంఉడా తరలిస్తూ సొమ్ములు వెనకేసుకుంటున్నారు. చీకటి పడిన తర్వాత నుంచి యథేచ్ఛగా వాహనాలు అధికారుల కళ్లముందే పరుగులు తీస్తున్నా ఎవరూ వాటిని అడ్డుకునే సాహసం చేయడం లేదు. పాయకరావుపేట, పి.ఎల్.పురం, సీతారాం పురం, నక్కపల్లి మండలం దేవవరం, ఎస్.రాయవరం మండలం పలు గ్రామాల పరిధిలో పోలవరం ఎడమ కాలువ పనులు తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ కాలువ ఏర్పాటుకు పాయకరావుపేట నుంచి మూడు మండలాల పరిధిలోని కొండలను తవ్వాల్సి వస్తోంది. దీంతో పెద్దఎత్తున గ్రావెల్ వస్తోంది. వీటికోసం ప్రత్యేకంగా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి అక్కడే గ్రావెల్ వేస్తున్నారు.

ఒకప్పుడు ఇవన్నీ చిన్నసైజు కొండలను తలపించేవి. గ్రావెల్ మాఫియా కన్ను వీటిపై పడింది. అంతే అడ్డగోలు తరలింపునకు తెరలేపారు. లే అవుట్ల చదునుకు, ఇంటి నిర్మాణాలు, రోడ్ల పనులు చేపట్టే వారితో ఒప్పందాలు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్లు, రాత్రిపూట లారీలపైనా పంపిస్తున్నారు. గ్రావెల్ వాహనాల్లో నింపేందుకు పొక్లెయిన్లను వినియోగిస్తున్నారు. పైసా పెట్టుబడి లేకుండానే రోజుకు లక్షలాది రూపాయలను వెనకేసుకుంటున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలపై గ్రావెల్ తరలిస్తూ దందా కొనసాగిస్తున్నారు. వీటి రాకపోకలు అధికారుల ముందే సాగుతున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై సీఐ అప్పన్నను వివరణ కోరగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## ఆపరేషన్ స్వర్ణ.. అవశ్యం

తిరుపతి : ప్రకృతి ప్రేమికులు, భక్తులు, సామాజిక స్పృహ కలిగిన వారిలో స్వర్ణముఖి ప్రక్షాళన ఆకాంక్ష దశాబ్దాల కిందటే ఆవిష్కృతమైంది. ఆచరణలో మాత్రం అదో కలగా మిగిలిపోగా.. ఇటీవల స్వర్ణముఖి అంశాన్ని తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆమోదం తెలపడంతో 'ఆపరేషన్ స్వర్ణ' తెరపైకి వచ్చింది.స్వర్ణముఖి ప్రక్షాళన చేయాలన్న ఆలోచన మినహా ఇప్పటి వరకు ఎలాంటి విధివిధానాలు రూపొందించలేదు. తుడాతోపాటు రెవెన్యూ, జలవనరులు, సర్వేశాఖలు సహా తొమ్మిది మంది సభ్యులతో కమిటీ నియమించారు.

పట్టణాలు, నగరాలు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పరివాహక ప్రదేశాల్ని సుందరీకరించి పర్యాటక ప్రదేశాలుగా మార్చడం, ఇసుక రవాణాకు అవకాశం లేకుండా చేసి భూగర్భ నీటిమట్టం పెంచడం, కలుషిం కాకుండా పవిత్రతను కాపాడటం.వరదల నియంత్రణకు ఆనకట్టల బలోపేతం, చెక్‌డ్యాంలు, అడ్డుకట్టలతో నీటిని నిల్వచేసి భూమిలోకి ఇంకించడం.నదీ పరివాహక ప్రాంతమైన 3.10 లక్షల హెక్టార్లను సర్వేచేసి పరాధీనంలో ఉన్న 15 వేల ఎకరాలను స్వాధీనం చేసుకొని.. హద్దులు నిర్ణయించడం, బఫర్ జోన్‌లోని ఆక్రమణలు తొలగించి సంరక్షించడం.**ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఉపేక్షించం** భావితరాలకు నీటివనరుల కొరత లేకుండా చేయడం, ప్రకృతి విపత్తులు అధిగమించాలంటే స్వర్ణముఖి సంరక్షణే శరణ్యం. తుడా ప్రథమ ప్రాధాన్యం ఆపరేషన్ స్వర్ణకే. ఒక్కోచోట 60 అడుగులు, మరోచోటు 300 అడుగులు వెడల్పుతో ఉండాల్సిన నది కుంచించుకుపోయింది. భవన నిర్మాణ వ్యర్థాలు, పంటపొలాలు, కంచెలు వేసి సేద్యం చేస్తున్నారు.

# వామ్మో.. జ్వరాలు!



అనంతపురం : ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో మార్పులు, తాగునీరు కలుషితం.. లోపించిన పారిశుధ్యం.. తదితర కారణాలతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇంట్లో ఒకరికి జలుబు, దగ్గు, జ్వరం వచ్చిందంటే వారంలోపు మిగతా వారు బాధితులు అవుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయి. జ్వరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**'సర్వజన'లో తాకిడి**

అనంత ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీకి జలుబు, దగ్గు, జ్వరం, లక్షణాలున్న వారు సగటున 350 నుంచి 450 వరకు వస్తుండటం గమనార్హం. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ వార్డుల్లో 90 మందికిపైగా చికిత్స పొందుతున్నారు.

కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ లక్షణాలు ఉన్నాయని.. ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని చెబుతూ ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారు. దాతల నుంచి సేకరించే ప్లేటెలెట్స్‌కు సగటున రూ.11 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కించటానికి అదనంగా ఇవ్వాలి. ఆర్‌డీపీ ద్వారా ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తే ఐదు ప్యాకెట్‌లైనా రూ.1500 తీసుకుంటున్నారు. ఈక్రమంలో మొదటి విధానానికే మొగ్గుచూపుతూ రోగులపై భారం మోపుతున్నారు. సర్వజన వైద్యశాలలో చికిత్స పొందే రోగులకు సింగిల్ డోనర్, ఆర్‌డీపీ ప్లేట్‌లెట్స్ ఉచితంగానే అందిస్తారు.

కూడేరు మండలం కలగల్లు నుంచి జ్వరంతో భాగ్యమ్మ కుమారుడిని వెంటబెట్టుకొని సోమవారం సర్వజన వైద్యశాలకు వచ్చారు. వరుసలో నిల్చోలేక సొమ్మసిల్లిపోయారు. తరువాత ఐపీ విభాగానికి తరలించారు.

**తగిన చర్యలు తీసుకుంటాం : డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం**

కిట్‌ల ద్వారా పరీక్ష చేసి డెంగీ నిర్ధారించరాదు. ఎలిసా పరీక్షలో పాజిటివ్ వస్తేనే నిర్ధారించాలి. ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా పెడతాం. జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. బీ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలున్న వారు సమీపంలో ఉండే విలేజ్‌హెల్త్ క్లినిక్ లేదంటే యూహెచ్‌సీ, పీహెచ్‌సీలకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

**గత నెలలో చేసిన ఫీవర్ సర్వే ఇలా..**

వారానికి పైగా జ్వరం ఉన్న వారు : 3,783

వారంలోపు ఉన్న బాధితులు : 13,756

## ఈ కనికట్టు.. ఎవరు కనిపెట్టు!!




విశాఖపట్నం : మొదట... రూ.105 కోట్లతో ఏడు రోడ్లకు టెండర్లు పిలిచారు!

ఆ తర్వాత... వాటిని రద్దు చేశారు!

మళ్లీ.. అంచనాలు సవరించి రూ.120 కోట్లతో టెండర్లు పిలిచారు!

కొద్ది రోజుల తర్వాత... ఏమైందో ఏమోగాని పలు కారణాలు చూపించి మళ్లీ వాటిని రద్దు చేశారు!

తాజాగా.. అంచనాలను భారీగా పెంచేసి అదనంగా ఒక రోడ్డును కలిపి రూ.207 కోట్లతో కొత్త టెండర్ పిలిచారు!!

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లేందుకు అనువుగా విస్తరించ తలపెట్టిన రోడ్ల అంచనాలు, తెర వెనుక వ్యూహాలు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి.

ఓ గుత్తేదారుకు పనులు అప్పగించేందుకే ఇందంతా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు అనుకున్న సమయానికి రోడ్లు పూర్తికాకపోతే ట్రాఫిక్ ఇక్కట్లు తప్పవని జనం భయపడుతున్నారు.

అడుగైనా పడలేదు: విమానాశ్రయానికి అనుసంధానంగా విస్తరించే రోడ్ల పనులు మరింత ఆలస్యమయ్యేలా ఉన్నాయి. త్వరితగతిన అందుబాటులోకి తెచ్చి నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించాలనేది ఆలోచన. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పలు సమావేశాల్లో వీటి ఆవశ్యకతను ప్రస్తావించారు. ఇప్పటికే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉన్నా ఒక్క అడుగైనా ముందుకు పడ లేదు. టెండర్లను రద్దు చేసి మళ్లీ మళ్లీ పిలుస్తూ అంచనాలను ఊహించని స్థాయిలో పెంచడం గమనార్హం.

మొత్తం రోడ్లు : 8

కి.మీ. : 33.27

అంచనా : రూ.207 కోట్లు

గతంలో ఏడు రోడ్లను ప్రతిపాదించగా ఇప్పుడు అదనంగా ఒకటి జత చేశారు.

ఒకే ప్రాజెక్టు కింద: వాస్తవానికి వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. ప్రతి రోడ్డుకు వేర్వేరుగా టెండరు పిలవాలి. అయితే పురపాలకశాఖ ఈ రోడ్లన్నింటినీ ఒకే ప్రాజెక్టు కిందికి తీసుకొచ్చింది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఒకరికే అప్పగించే అవకాశాలున్నాయి.

## పేరు రైతులది.. సరకు వ్యాపారులది!



నర్సీపట్నం : నాతవరంలో కొంతమంది వ్యాపారులు జీడి పిక్కలు అనధికారికంగా నిల్వ చేశారన్న సమాచారంతో మార్కెటింగ్ శాఖ అధికారులు కొద్దిరోజుల కిందట రెండు గోదాముల్లో తనిఖీలు చేశారు. గోదాములు తెరించేందుకు సిబ్బంది యత్నించినప్పుడు కొందరు వచ్చి ఈ సరకు రైతులది, గిట్టుబాటు ధర లేక దాచుకున్నారు. మార్కెట్లో ధర ఉన్నప్పుడు అమ్ముకుంటారని చెప్పుకొచ్చారు. ఆ రైతుల చిరునామా కోసం ప్రయత్నించినా వీలుకాలేదు. గోదాములను సీజ్ చేస్తున్నామంటూ రెవెన్యూ, పోలీసు సిబ్బందిని పిలవగానే వ్యాపారులు పరుగున వచ్చి సరకు తమదేని అంగీకరించారు. వీరు సెస్ చెల్లించకుండా నిల్వ చేసినట్లు గుర్తించి అప్పటికప్పుడు బకాయిలన్నీ కట్టించారు. జీడి తోటల విస్తీర్ణం, దిగుబడి లెక్కలకు, మార్కెటింగ్ శాఖకు జమవుతున్న సెస్‌కు పొంతనే లేదు. నర్సీపట్నం పరిసర మండలాల్లో 10 నుంచి 15 మంది జీడిపిక్కల టోకు వ్యాపారులు ఉన్నారు. పంట దిగుబడి వచ్చినప్పుడు ధరల్లేవంటూ తక్కువకు రైతుల నుంచి కొనుగోలు చేసి గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని నిల్వ చేస్తున్నారు. సీజన్ ముగిసిన తర్వాత ధర వచ్చినప్పుడు విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాలకు ఎగుమతి చేసేటప్పుడు కొనుగోలు ధర కంటే తగ్గించి చూపుతున్నారు. తక్కువ మొత్తం చూపుతున్నారని తెలిసినా చెక్‌పోస్టు సిబ్బంది చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. సిబ్బంది కొరతను సాకుగా చూపి మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు చెక్‌పోస్టులపై నిఘా పెట్టడం లేదు. వ్యాపార అవసరాలకు తీసుకువెళ్లే సరకు విలువలో ఒక శాతం సొమ్మును మార్కెటింగ్ శాఖకు సెస్‌గా చెల్లించాల్సి ఉంది. పర్యవేక్షణ ఉంటే ఇప్పుడొస్తున్న సెస్‌కు రెట్టింపు వసూలయ్యే అవకాశం ఉంది.నోటీసులు ఇస్తున్నాం.. ఎవరెవరు జీడిపిక్కల వ్యాపారం చేస్తున్నారో ఆరా తీసి నోటీసులు ఇస్తున్నాం. వాణిజ్య పన్నుల శాఖకు చూపుతున్న టర్నోవర్‌కు అనుగుణంగా సెస్ చెల్లిస్తున్నారా, లేదా పరిశీలిస్తున్నాం. ఎవరైనా చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కొంతమంది బస్సుల్లో, పార్శిల్ సర్వీసు వాహనాల్లో తరలిస్తున్నారు. సెస్ రసీదు లేకుండా తరలింపు అనుమతించవద్దని ఆర్టీసీ డిపో మేనేజర్, పార్శిల్ సర్వీసుల యాజమానులను కోరుతున్నాం. సెస్ ఎగవేత లేకుండా పక్కాగా చర్యలు తీసుకుంటాం.

గవిరెడ్డి వెంకటరమణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, నర్సీపట్నం

## ప్రసవానికి వేదన

గూడూరు : జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవానికి వేదన పడాల్సి వస్తోంది. 58 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 203 ప్రసవాలు మాత్రమే జరిగినట్లు వైద్యశాఖ లెక్కలు తేల్చింది. వీటిలో 12 కేంద్రాల్లో ఒక్కటీ జరగలేదు. మరో 10 కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున మమ అన్పించారు. ప్రతి కేంద్రంలో నెలకు పది కాన్పులు జరగాలన్న నిబంధన ఉన్నా.. వైద్యులు, సిబ్బంది కొరత, పలు కేంద్రాల్లో అన్నీ ఉన్నా పట్టించుకోక పోవడంతో పేదలు ప్రైవేటు వైద్యశాలలకు తరలిపోతున్నారు.

15 శాతమే.. ప్రతి నెలా ఒక్కో కేంద్రంలో పది కాన్పులు చొప్పున జిల్లాలో మొత్తం నెలకు 580 జరగాలి. ఆ లెక్కన ఐదు నెలలకు 2,900 కాన్పులు జరగాల్సి ఉండగా 203 మాత్రమే చేశారు. 15 శాతం మాత్రమే లక్ష్యానికి చేరుకున్నారు.

**ఒక్కటీ జరగక..** కోటాల, చిట్టమూరు, గునపాటిపాలెం, తొగరాముడి, పెదపరియ, వి.వి.పాలెం, అత్తివరం, కమ్మపల్లి, దాసుకుప్పం, తడ, బాలిరెడ్డిపాలెం, జీకేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐదు నెలలుగా ఒక్క కాన్పు చేయలేదు. ఇవన్నీ జిల్లాలో మారుమూల గ్రామాలు.



ఇక్కడ ఎక్కువగా నిరుపేదలే ఉంటారు.

**ఒక్కటితో సరి** చినతోట, ఈశ్వరవాక, దొరవారిసత్రం, గొట్టిప్రోలు, గొల్లపల్లి పుత్తూరు, మంగళం, ఏర్పేడు, రామాపురం, పరమేశ్వర మంగళం, పేర్నాడు కేంద్రాల్లో ఐదు నెలల్లో ఒక్కటి చొప్పున మాత్రమే చేసి మమ అన్పించారు.

**వైద్యులు, సిబ్బంది కొరత తీరుస్తాం..**

జిల్లాలో పీహెచ్‌సీల వారీగా పరిశీలించి కాన్పులు చేయని చోట పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నచోట త్వరలో భర్తీ చేస్తాం.

– బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

## ఎర్ర మట్టి దోచుకెళ్తున్నారు..!

పాలసముద్రం : పాలసముద్రం ఎర్ర మట్టిపై తమిళనాడు గ్రావెల్ మాఫియా కన్నుపడింది. ఎంత అడ్డుపడినా ఎర్రమట్టిని చెన్నైకు తరలించడమే లక్ష్యంగా రెచ్చిపోతోంది. సోమవారం మండలంలోని వనదుర్గాపురం రెవెన్యూ కొండ భూమిలో అత్తిమాంజేరిపేట సమీపంలో ఉదయం సుమారు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లు గ్రావెల్ కోసం వాలిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కలెక్టరు సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠకు సమాచారమిచ్చారు. స్పందించిన అధికారులు ఎస్సై చిన్నరెడ్డప్ప, తహసీల్దారు అరుణకుమారికి సమాచారం అందించి అడ్డుకోవాలని తెలపడంతో దాడులు నిర్వహించారు. కొన్ని వాహనాలు మండలం దాటి వెళ్లిపోగా.. మిగిలిన వాహనాలను తనిఖీ చేసి సీజ్ చేశారు.

ఒక్కో టిప్పరులో 40 టన్నులుఒక్కో టిప్పరులో సుమారు 40 టన్నులకు పైగా మట్టిని తరలిస్తూ... బిల్లులో మాత్రం అంతకంటే తక్కువ చూపడం గమనార్హం. కొన్నింటికి సక్రమంగా బిల్లులు, వే-బిల్లులు లేకుండానే తమిళనాడుకు చెందిన టిప్పర్లు అక్రమ రవాణా సాగిస్తున్నాయి. తచ్చూరు-చిత్తూరు హైవే పేరిట పాలసముద్రం మండలంలో పర్యావరణాన్ని తమిళవాసులు కొల్లగొడుతున్నారని మండల వాసులు విమర్శిస్తున్నారు.

**అక్కడి చట్టాలకు భయపడి**

కూతవేటు దూరంలోనే తమిళనాడుకు చెందిన కొండలు, గుట్టలు ఉన్నా అక్కడ మట్టి తవ్వడం లేదని అక్కడి చట్టాలకు భయపడి మండలంలోని కొండలపై వాలిపోతున్నారని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు.

**రెండు వాహనాల సీజ్**

సోమవారం గ్రావెల్ నింపుకొని వచ్చిన టిప్పర్లను ఎస్సై చిన్నరెడ్డప్ప, తహసీల్దారు అరుణకుమారి తనిఖీ చేశారు. ప్రతి వాహనానికి అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు వాహనాలను సీజ్ చేశారు.

**చర్యలు తీసుకుంటాం**

మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకోవాలి. కొండలు, గుట్టల్లో తవ్వకాలకు మైన్స్ శాఖ నుంచి.. చెరువుల్లో అయితే ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరి. వాణిజ్యపరమైన పనులకు మట్టిని విక్రయించినా, అనుమతి లేకుండా మట్టిని తరలించినా సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.– సత్యనారాయణ, డీడీ, మైన్స్

## సౌరశక్తితో నీళ్లు తోడేలా..!

చిత్తూరు: ఉమ్మడి జిల్లాలో పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసి.. వ్యవసాయ బోర్లకు విద్యుత్తు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఎస్పీడీసీఎల్ పరిధిలో మొదటి దశలో 600 మెగావాట్లు ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 108 మెగావాట్ల ఉత్పత్తికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కుప్పంలో రెస్కో పరిధిలో మరో 140 మెగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి. యంత్రాంగం భూములు అప్పగించిన తర్వాత మిగిలిన పనులు మొదలు కానున్నాయి. పీఎం సూర్యఘర్ పథకంలోలా ప్రతీ బోరు వద్ద సౌర ఫలకాలు అమర్చడం కష్టం కాబట్టి ఒకే ప్రాంతంలో వీటిని అమర్చి సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఒక మెగావాట్‌కు 5 ఎకరాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. కుప్పంలోనే రాష్ట్రంలో అత్యధికంగా..

రాష్ట్రవ్యాప్తంగా పీఎం కుసుమ్ మొదటి దశలో 1,200 మెగావాట్లు ఉత్పత్తికి ఆమోదం లభించింది. ఇందులో అత్యధికంగా కుప్పంలోనే 140 మెగావాట్ల ఉత్పత్తి కానుంది. కుప్పం రెస్కో డివిజన్ పరిధిలో 140 మెగావాట్లకు 600 ఎకరాలు అవసరం. ఇప్పటికే 400 ఎకరాలకు అవసరమైన భూమిని గుర్తించారు. గుడిపాల, బంగారుపాళ్యం, ఐరాల మండలాల్లో 80 మెగావాట్లకు 400 ఎకరాలు కావాలి. భూముల కోసం అన్వేషణ జరుగుతోంది.

**శ్రీకాళహస్తి, గూడూరు డివిజన్లలో..**

తిరుపతి జిల్లాలో 54 ఫీడర్ల కింద 6,213 పంప్‌సెట్లకు సౌర విద్యుత్తు అందించనున్నారు. ఇందుకు 142 ఎకరాలు అవసరం. శ్రీకాళహస్తి, గూడూరు రెవెన్యూ డివిజన్లలో భూమి కావాలని ఎస్పీడీసీఎల్ అధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. ఇప్పటికే వారు ప్రభుత్వ భూమిని గుర్తించే పనిలో పడ్డారు. ఇది ఓ కొలిక్కి వస్తే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి అధికారికంగా స్థలాన్ని అప్పగించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ సౌర విద్యుత్తు ఉత్పత్తి కావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించడంతో త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు మొదలుకానున్నాయి.

# మా వాళ్లే..అటు చూడొద్దు

ఏలూరు: ఆయన చెప్పిందే శాసనం అనేలా ఉద్యోగులు పాటిస్తున్నారు. ప్రజాపంపిణీ బియ్యాన్ని నల్లబజారుకు తరలించేవారిపై కఠిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రే చెప్పారు. కానీ జిల్లాలో మెట్ట ప్రాంత ప్రజాప్రతినిధి ఒకరు ఇందుకు భిన్నంగా రేషన్‌మాఫియాతో అంటకాగుతూ వారిచ్చే మాముళ్లు పుచ్చుకుని చివరకు యంత్రాంగాన్నే బియ్యం పట్టుకోవద్దని ఆదేశించటం చర్చనీయాంశమవుతోంది.

**కిడ్నాప్‌లు చేసుకునే దాకా..**

రేషన్ మాఫియా ఆగడాలు శ్రుతి మించాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతంలో పీడీఎస్ బియ్యం సేకరించే విషయంలో మాఫియా మధ్య ఏర్పడిన ఆధిపత్య పోరు చివరకు ఒకరికొకరు కిడ్నాప్‌లు చేసుకునే వరకు వెళ్లింది. తూ.గో.జిల్లాకు చెందిన మాఫియా గత కొన్నాళ్ల నుంచి మెట్ట, ఏజెన్సీ మండలాల్లో బియ్యం సేకరించి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించి సొమ్ము చేసుకుంటోంది. ప్రస్తుతం తాడేపల్లిగూడేనికి చెందిన మాఫియా మెట్ట ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధి అండతో ఇక్కడకు వచ్చి బియ్యం సేకరిస్తోంది. ఇది మా అడ్డా. మమ్మల్ని ప్రజాప్రతినిధి చేసుకోమన్నారు. విజిలెన్స్‌కు మాపై ఫిర్యాదు చేస్తున్నావ్...అసలు నీ సంగతి ఏమిటి అని తూ.గోకు చెందిన వ్యాపారిని ఇటీవలే జంగారెడ్డిగూడెం-అశ్వారావుపేట రహదారిలో ఓ మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లి బంధించి అర్ధరాత్రి దాకా విడిచిపెట్టలేదు. సెల్‌ఫోన్లు లాగేసుకుని భయభ్రాంతులకు గురిచేశారు.

**కేసుతోనే సరిపుచ్చారు!**



వారి నుంచి తప్పించుకుని ఆ బాధితుడు నేరుగా పోలవరం సబ్‌డివిజన్‌లో ఓ స్టేషన్‌కు వెళ్లి తనను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేయగా మొక్కుబడిగా కేసు కట్టి అంతటితో సరిపుచ్చారు. పోలీసులు మిన్నకుండిపోవటంపై విమర్శలొచ్చాయి. ఇలాంటి ఉదంతాలను చాలా తీవ్రంగా పరిగణిస్తారు. కానీ ఈకేసు విషయంలో పోలీసులపై ఒత్తిడి ఉన్నట్లు చర్చ సాగుతోంది. బియ్యం, గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని నేర సమీక్షలో ఎస్పీ తరచూ చెబుతున్నా కిందిస్థాయిలో యంత్రాంగం గాలికొదిలేస్తోంది.


**ఉన్నతాధికారులకు చెప్పలేదా?**

ఆ ప్రజాప్రతినిధి తమను పిలిచి రేషన్ మాఫియాకు అడ్డు తగలొద్దని హెచ్చరించి పంపారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పాపాన పోలేదు. కొందరు డీటీలు ఆ ప్రజాప్రతినిధి పిలవగా వెళ్లారు. ఆ వ్యాపారులు మావాళ్లే.. జోక్యం చేసుకోవద్దని అధికారులను ఆదేశించటం చూస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చినా పర్లేదు అనేలా ఆయన తీరు ఉంది.

# లేదు తోవ.. తెండి నావ

భీమవరం : మురుగు కాలువలు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు, ఔట్‌లెట్ వ్యవస్థ అస్తవ్యస్తం, వేసవిలో పూర్తి చేయాల్సిన పూడిక తొలగింపు ఇప్పటికీ కాకపోవడం వెరసి వర్షం కురిస్తే పలు కాలనీల్లో ప్రజలు ఇంటికి వెళ్లాలంటే పడవలు అవసరమన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. ముంపు ఇబ్బందులపైన పుర అధికారులతో మాట్లాడానని పురపాలక రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడు సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ముంపు ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

**కాలనీళ్లే..** వానొస్తే భీమవరంలోని ప్రధాన రహదారులు, హౌసింగ్‌బోర్డు కాలనీ, నర్సయ్యఅగ్రహారం, బ్యాంకు కాలనీ, శ్రీరామపురం, బలుసుమూడి, వంశీకృష్ణానగర్ ముంపులోనే ఉంటాయి. పాలకొల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీరాంపేట, బ్యాంకు కాలనీ, బస్టాండు ప్రాంతాలు, బ్రాడీపేట, కోడుగట్టు, పల్లపువీధి, కొత్తపేట, తణుకులో ఇరగవరం కాలనీ, బ్యాంకు కాలనీ, ఎన్జీవో కాలనీ, కప్పల వెంకన్న కూడలి, ఉండ్రాజవరం కూడలి, వేల్పూరు రోడ్డు, నరసాపురం బస్టాండ్ ప్రాంతం, పొన్నపల్లి, మెయిన్‌రోడ్డు, వైఎస్సార్‌కాలనీ, రుస్తుంబాద, మాధవాయపాలెం, నందమూరికాలనీ, తాడేపల్లిగూడెంలో స్టేషన్‌రోడ్డు, యాగర్లపల్లి, రెల్లి కాలనీ, కడగట్ల, కె.ఎన్‌రోడ్డుకు ముంపు బాధ తప్పదు. భీమవరంలో ఆరు గంటలకు కొత్త బస్టాండ్ దగ్గర ద్విచక్ర వాహనంపై



బయల్దేరిన ప్రైవేటు ఉద్యోగి కేవలం అయిదారు నిమిషాల్లోనే రెండో పట్టణంలోని అంబేడ్కర్ కూడలికి చేరవచ్చు. కానీ వర్షపు నీటితో వెళ్లడానికి 45 నిమిషాలు పట్టింది.

విద్య, వైద్య, వాణిజ్య రంగాల్లో పోటీ పడుతున్న జిల్లాలోని పట్టణాలు వాన కురిస్తే హైదరాబాద్‌ను గుర్తు చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం రెండు మూడు గంటల పాటు 236 మిల్లీమీటర్ల వాన కురిస్తేనే రహదారులు జలమయమై దారులన్నీ మూసుకుపోయాయంటే ఎడతెరిపి లేకుండా పడితే పరిస్థితి ఎలా ఉండేదోనని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఇదీ లెక్క..** జిల్లాలోని ఆరు పట్టణాల్లో పూడిక తీయడానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.2.10 కోట్లకు పైగా కేటాయించారు. డ్రెయిన్లలో సిల్టు తీశారో లేదో పర్యవేక్షణ లేదు. గతంలో అన్ని చోట్లా డ్రెయిన్లపై 875కు పైగా ఆక్రమణలను గుర్తించారు. వాటిని తొలగించలేదు. ఇటీవల డ్రెయిన్ల ఆనవాళ్లే లేదు. భీమవరంలో జాతీయ రహదారి పొడవునా రూ.1.20 కోట్లతో నిర్మించిన డ్రెయిను కప్పేయడంతో ప్రకాశంచౌక్, రూపాంతర దేవాలయం, పోలీసుబొమ్మకూడలి వరకు చెరువును తలపిస్తుంది.

# ఐటీకి పూర్వకళ.. సాకారం యువత కల



విశాఖపట్నం: వైకాపా పాలనలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలకు ఎగనామం పెట్టారు. ఫలితంగా కొన్ని కంపెనీలు విశాఖను వదిలి వెళ్లిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త ఐటీ పాలసీ తీసుకొచ్చి, భారీగా రాయితీలు ప్రకటించి సాగర తీరానికి ఆహ్వానం పలికింది.

కొన్ని దిగ్గజ కంపెనీలు ముందుకొచ్చి విశాఖలో కార్యకలాపాలు సాగించడానికి ఒప్పందాలు చేసుకోగా, మరికొన్ని కంపెనీలు వరుస కట్టాయి. అందుకు అవసరమైన భూ కేటాయింపులు చేస్తూ ఇటీవల మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

భూ కేటాయింపులు జరిగిన కంపెనీలు 12 నెలల వ్యవధిలో తమ కార్యకలాపాలు సాగించడంతోపాటు, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం యువతకు ఉపాధి కల్పించేలా అడుగులు పడుతున్నాయి.

**ఏ కంపెనీకి భూములు ఎక్కడంటే:** విశాఖలో టీసీఎస్ క్యాంపస్ విస్తరణకు ఐటీహిల్స్-3లో 22 ఎకరాలను కేటాయించారు. ఏఐ డేటా సెంటర్, క్లౌడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్‌తో ఒప్పందం కాగా, తొలుత మధురవాడలో భూమి ఇవ్వాలని నిర్ణయించారు. అయితే తర్లువాడలో గుర్తించిన 200 ఎకరాల్లో 80 ఎకరాల మేర కేటాయింపులు చేయనున్నారు. కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు మధురవాడలో 22.19 ఎకరాలు కేటాయించారు. ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సెంటర్, ఐటీ ఆఫీస్ స్పేస్ ఏర్పాటుకు కాపులుప్పాడ వద్ద 56.5 ఎకరాలు, ఐటీ హిల్-3లో 3.5ఎకరాలు కేటాయించారు. ఫీనమ్ పీపుల్ సంస్థకు 4.45 ఎకరాలు ఐటీ హిల్స్‌లో కేటాయించారు. హిల్ నెంబరు 3లో 2.5 ఎకరాలు, హిల్ నెంబరు 4లో 7.79 ఎకరాలు ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఇచ్చారు. ఐటీ హిల్-3పై 3.6 ఎకరాలు, పరదేశిపాలెంలో 50 ఎకరాలు సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు కేటాయించారు.

**ప్రస్తుతం 150 వరకు కంపెనీలు**

మధురవాడలోని ఐటీ హిల్స్, నగరంలో కలిపి వివిధ స్థాయిల ఐటీ కంపెనీలు 150 వరకు ఉన్నాయి. వీటిలో డబ్ల్యూఎన్ఎస్ (5వేల మంది), పాత్ర (3వేలు), టెక్‌మహేంద్ర (1500), కాండియంట్ (వెయ్యి), ఇన్ఫోసిస్ (వెయ్యి), ఫ్లూయింట్‌గ్రిడ్, మిరాకల్, ఏసీఎన్, తదితర కంపెనీలున్నాయి. వీటన్నింటిలో సుమారు 30వేల మంది ఉపాధి పొందుతున్నారు. గత ప్రభుత్వం ఇన్నోవేషన్ వ్యాలీ స్టార్టప్ భవనం బోసిపోయేలా చేసింది. ప్రస్తుతం కొన్ని స్టార్టప్ కంపెనీలతో ఈ భవనం తిరిగి పూర్వకళ సంతరించుకుంటోంది.

# రూపాయికే ఇంటి ప్లాన్




అమలాపురం : పట్టణాల్లో నూతనంగా ఇంటిని నిర్మించుకునే వారికి కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 50 చదరపు మీటర్లలోపు నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని రూపాయి ఫీజు చెల్లిస్తే ఇంటి ప్లాన్ మంజూరు చేస్తారు. గతంలో ఈ ఫీజులు రూ.వేలల్లో ఉండేవి.

**దరఖాస్తు విధానం..** పురపాలిక పరిధిలో అనుమతి కలిగిన సాంకేతిక నిపుణులు(ఎల్‌టీపీ)ను కలిసి ఖాళీ స్థలం ఫొటో, దస్తావేజులు, వాటి లింక్ డాక్యుమెంట్లు, వివరాలు, ప్లాన్‌తో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే చలానా చెల్లించాలని సందేశం వస్తుంది. రూపాయి చెల్లిస్తే అనుమతులు వచ్చినట్లే. తాజా నిబంధనలతో కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ప్లాన్ పొందవచ్చు. గతంలో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భవనం నిర్మించాలంటే అభివృద్ధి, ఇతర ఛార్జీలతో సహా ఆ ప్రాంతంలో స్థలం విలువలో 15 నుంచి 20 శాతం వరకు ఖర్చయ్యేది.

**జిల్లా వివరాలు..** జిల్లాలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం పురపాలక సంఘాలు, ముమ్మిడివరం నగర పంచాయతీ ఉన్నాయి. వీటిలో ఏటా 10వేల వరకు నూతన ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో 50 చ.మీ.లోపు ఉన్నవి 40శాతం వరకు ఉంటున్నాయి. వీటిని నిర్మించుకునే వారంతా పేద, మధ్య తరగతి వర్గాల వారే ఉంటున్నారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం వీరందరికీ ఉపసమనం కలగనుంది.

**సడలింపు ఇచ్చింది-నిర్మల్ కుమార్, కమిషనర్, అమలాపురం**

భవన నిర్మాణ అనుమతుల్లో ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. ఈ వెసులుబాటు కేవలం జీ ప్లస్ వన్ భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. అంతకు మించి నిర్మిస్తే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజు కేవలం నివాసా గృహాలకు మాత్రమే వర్తిస్తుంది.

# జ్వరాలు వైరల్



నంద్యాల : పట్టణానికి చెందిన రామారావు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్నా తగ్గలేదు. దీంతో సర్వజన వైద్యశాలకు వచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి వైరల్ ఫీవర్ అని నిర్ధారించి మందులు ఇచ్చి పంపించారు. నగరానికి చెందిన రేణుకమ్మ గత ఐదు రోజులుగా జ్వరంతో పాటు జలుబు, ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వైద్యుల వద్ద చూపించుకోగా పరీక్షలు చేసి టైఫాయిడ్ అని చెప్పారు. తర్వాత ఆమె సర్వజన వైద్యశాలలో చూపించుకోగా వైరల్ ఫీవర్ అని తేలింది. ఉమ్మడి జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి..వారం రోజులుగా జ్వర బాధితులతో ఆసుపత్రుల్లో ఓపీ అమాంతం పెరిగింది. కర్నూలు సర్వజన వైద్యశాలలోని 9వ నంబరు ఓపీకి రోజుకు 150 మంది జ్వర బాధితులు వస్తున్నారు. వీరిలో 70 మందికి పైగా వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబుతో బాధపడే వారున్నారు. చాలా కుటుంబాల్లో ఒకరిద్దరు జ్వరాల బారినపడ్డారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పరిసరాల్లో నీళ్లు నిలిచాయి. ఖాళీ స్థలాలు చెరువుల్లా మారాయి. వీధుల్లో పోగైన చెత్తాచెదారం కుళ్లి తీవ్ర అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి. వీటి కట్టడికి అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

**అప్రమత్తతే ఔషధం**

వాతావరణంలో అనూహ్య మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని సర్వజన వైద్యశాల జనరల్ ఫిజీషియన్ ప్రొఫెసర్ డా.మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు జ్వరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.కాచి వడపోసిన నీరు తాగాలి. బయట ఆహారం తీసుకోకూడదు. ఇంట్లో వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. చిన్నారులను చల్లటి పదార్థాలకు దూరంగా ఉంచితే మంచిది.ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు నిలవకుండా జాగ్రత్తపడాలి. దోమతెరలు వాడాలి. కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.సిగరెట్, బీడీలు తాగే అలవాటున్న వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వీరు జాగ్రత్తగా ఉండాలి.మధుమేహ రోగులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. వీలైనంత వరకు ప్రయాణాలకు దూరంగా ఉండాలి.

వర్షాకాలంలో ఏసీలను సరిగా శుభ్రం చేసుకోవాలి. ఏసీలకు అలవాటు పడ్డ వారు త్వరగా వైరల్ జ్వరాల బారినపడే ప్రమాదం ఉంది.

# ముం'చేను'

ఉండి : అల్పపీడన ప్రభావంతో కురిసిన కుండపోత వర్షానికి జిల్లాలోని పల్లపు ప్రాంతాల్లో వరిచేలు జలదిగ్బంధంలో చిక్కాయి. మట్టిపూడికతో పాటు తూడు, గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయిన్లల్లో మురుగునీరు సాఫీగా ముందుకెళ్లని పరిస్థితులున్నాయి. జిల్లాలోని 20 మండలాల్లో 24 గంటల వ్యవధిలో 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంటలపై ఈ ప్రభావం ఎక్కువగా పడింది ఉదయం పొడి వాతావరణం ఏర్పడటంతో రైతులు పొలంబాట పట్టారు. అత్తిలి మండలం తిరుపతిపురం, వరిఘేడు ప్రాంతాల్లో నీట మునిగిన వరిచేలను కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరిందని ఆమె గుర్తించారు. నీరు పూర్తిగా బయటకెళ్లితే అక్కడ పంట దెబ్బతిన్నదీ లేనిదీ తెలియదు.

**15 మండలాల్లో ప్రభావం..** జిల్లాలో 2,06,245 ఎకరాలకు 1,71,902 ఎకరాల్లోనే ఖరీఫ్ వరి నాట్లు పడ్డాయి. అధిక వర్షాలతో రైతులు నాట్లేయలేదు. 34,343 ఎకరాల్లో వేయాలి. కుండపోత వర్షానికి జిల్లాలో 15 మండలాల్లో ఉన్న 21,560 ఎకరాల్లో వరి చేలు ముంపులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, అత్తిలి, తణుకు, ఇరగవరం, తదితర చోట్ల ఎక్కువగా నీటిలో ఉన్నాయని చెప్పారు.

**డ్రెయిన్‌లోకి మళ్లింపు..** భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో విజ్జేశ్వరం వద్ద డెల్టాలోని 11 ప్రధాన కాలువలకు బుధవారం సాయంత్రం నుంచే 500 క్యూసెక్కుల సాగునీటి విడుదలకు పరిమితం చేశారు. అంతకు ముందు 6,500 క్యూసెక్కుల నీరొదిలారు. జిల్లాలోని కాలువల్లో నీటిమట్టాన్ని తగ్గించేందుకు సర్‌ప్లస్ వియర్లన్నీ తెరిచి డ్రెయిన్‌ల్లోకి మళ్లిస్తున్నారు. సాగునీటితో చేలు దెబ్బతినకుండా



ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. భగ్గేశ్వరం, యనమదుర్రు, రుద్రాయకోడు, చినకాపవరం తదితర డ్రెయిన్లల్లోని తూడు, గుర్రపుడెక్క మురుగునీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

**తణుకులో 236.6 మి.మీ వర్షపాతం**

జిల్లాలో సగటు వర్షపాతం 90 మి.మీగా నమోదైంది. అత్యధికంగా తణుకులో 236.6 మి.మీ, ఇరగవరం- 196.6, పెనుగొండ - 193.8, పెంటపాడు - 189.0, తాడేపల్లిగూడెం -162.2, గణపవరం-144.4, అత్తిలి-85.4, పోడూరు- 82.6, ఆకివీడు-77.2, పాలకోడేరు -76.2, పెనుమంట్ర-75.2, ఉండి-54.4, కాళ్ల-42.6, ఆచంట-40.2, పాలకొల్లు- 35.2, నరసాపురం-32.4, భీమవరం-27.6, వీరవాసరం-22.2, యలమంచిలి-17.4, మొగల్తూరులో 8.6 పడింది. యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి ఉద్ధృతి బాగా పెరిగింది. వానకు 1.54 ఎకరం విస్తీర్ణంలో ఉన్న తణుకు మత్స్యశాఖ కార్యాలయం, దాని ఆవరణలో చెరువులో అంగుళం ఉన్న 30 లక్షల సీడ్ కొట్టుకుపోయింది.

# పూడికతీత.. పనులు సాగదీత

బొబ్బిలి: పెద్దగెడ్డ జలాశయం నుంచి నీరు విడిచిపెట్టి సుమారు 15 రోజులు అవుతున్నా.. ఇంతవరకు శివారు ప్రాంతానికి సాగునీరు అందలేదు. ఈ జలాశయం నుంచి పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు చెందిన 12 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువ చెంతనే ఉన్నా నీరు రాకపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. సకాలంలో పూడికతీత పనులు చేయక, కాలువల మరమ్మతులు చేపట్టక నీరు అందడం లేదు. నారుమడులు ఎండిపోవడంతో దూర ప్రాంతం నుంచి పైపులతో తెచ్చి తడుపుతున్నారు.కాలువలు అధ్వానం..

పెద్దగెడ్డ శివారు ప్రాంతాలైన రామభద్రపురం, కొట్టక్కి, తారాపురం, జన్నివలస, బూసాయివలస, ఇట్లామామిడిపల్లి, సోంపురం తదితర గ్రామాలకు చెందిన 3,100 ఎకరాలకు సాగునీరు అందాల్సిఉంది. ఇంతవరకు సెంటు భూమికి కూడా అందలేదు. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పనికిరాని మొక్కలు ఎక్కువగా పెరిగి ఉన్నాయి. రూ.20 లక్షల మేర నిధులు మంజూరైనా అధికారులు సకాలంలో పనులు చేయలేకపోయారు. పాచిపెంట, సాలూరు మండలాల్లో కూడా పూడికతీయలేదు. ప్రధాన కాలువ అధ్వానంగా ఉంది. పిల్ల కాలువల పరిస్థితి మరింత దారుణం.

చర్యలు తీసుకుంటాం.. - శ్రీనివాసరావు, డీఈ, పెద్దగెడ్డ

పెద్దగెడ్డ జలాశయం నుంచి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. పూడికతీత పనులు జరుగుతున్నాయి. శివారు ఆయకట్టుకు నీరు వచ్చేలా చూస్తాం.

# బస్తాలు పరిచి.. బలోపేతం మరిచి..

కనిగిరి : వరుస వర్షాలతో మోపాడు దిగువ ప్రాంత వాసులు చిగురుటాకుల్లా వణుకుతున్నారు. గతంలో అర్ధరాత్రి వేళ కట్ట కొట్టుకుపోయి వందలాది మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ సంఘటన నేటికీ అక్కడి వారికి కునుకు లేకుండా చేస్తోంది. పామూరు మండలంలోని మోపాడు జలాశయం గట్టు నేటికీ బలహీనంగా ఉండటం వారి ఆందోళనకు కారణం !

పామూరులోని మోపాడు జలాశయం వద్ద నేటికీ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గతంలో రిజర్వాయర్ నుంచి లీకేజీలు ఏర్పడ్డాయి. అప్పట్లో సాగునీటి పారుదల అధికారులు కష్టపడి అలుగును పెద్దది చేసి పైనుంచి వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా చేశారు. యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలు వేసి లీకేజీలను తాత్కాలికంగా నిలువరించారు. నిధులు మంజూరు చేసి శాశ్వత రక్షణ కల్పిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. నేటికీ నిధులు మంజూరు కాలేదు.వైకాపా హయాంలో.. : అవిగో నిధులు..ఇవిగో నిధులంటూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు తప్ప మంజూరు చేయలేదని మోపాడు దిగువ ప్రాంత రైతులు వాపోతున్నారు. రూ. 2 కోట్లు ఇస్తామని చెప్పినా విడుదల చేయలేదు. కట్ట బలోపేతానికి ఇప్పటివరకూ పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత తెలుగుదేశం హయాంలో రూ.33 కోట్ల జైకా, ఇతర నిధులతో ప్రధాన కాల్వలు బాగు చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు కట్ట గట్టితనానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దిగువ గ్రామాల వారు భీతిల్లుతున్నారు. 1996 నాటి పరిస్థితి పునరావృతమైతే.. : వాస్తవంగా జలాశయం నిల్వ సామర్థ్యం 29 అడుగులు మాత్రమే. 2023 సంవత్సరంలో భారీ వర్షాలు, వరదలతో నీటిమట్టం 31 అడుగులకు చేరి కట్టకు లీకేజీలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. 1996లో ఒక్కసారే కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్ కట్ట తెగి 183 మంది వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. అదే పరిస్థితి నెలకొంటే తమని ఆదుకునేదెవరని మోపాడు, కంభాలదిన్నె, బొట్ల గూడూరు, కమ్మవారిపాలెం, రేగిచెట్లపల్లి, లక్ష్మీనర్సాపురం ప్రజలు భయపడుతున్నారు. గత పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు మంజూరుచేసి కట్టను గట్టి పర్చాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా, ఎలాంటి నిధులు మంజూరు కాలేదన్నారు. గతంలో జైకా, ఇతర నిధులతో కాల్వల మరమ్మతులు, ఇతర పనులు చేపట్టారన్నారు.

# ఆలస్యమైనా ఆదరణ

శ్రీకాళహస్తి: వైకాపా మూసేసిన కళాశాలను కూటమి ప్రభుత్వం మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. రెండో విడత దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఇవ్వడంతో పలువురు సద్వినియోగం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం జేఎన్‌టీ విశ్వవిద్యాలయం శ్రీకాళహస్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)కు కొంత మేర ఆదరణ లభించింది. ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 330 సీట్లకు 68 సీట్లు భర్తీ చేసుకోవడం గమనార్హం. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం పలు దఫాలు జేఎన్‌టీయూ యాజమాన్యంతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. తొలి విడత దరఖాస్తుల స్వీకరణకు అవకాశం అయ్యాక స్కిట్‌కు అనుమతులు వచ్చాయి. ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (సీఎస్ఎం), డేటా సైన్స్ (సీఎస్‌డీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్




(ఈఈఈ) కోర్సులకు ఒక్కో విభాగానికి 66 సీట్లు వంతున 330 సీట్లు నిర్ణయించింది. ప్రస్తుతం రెండో విడత దరఖాస్తుల స్వీకరణల నేపథ్యంలో సీఎస్ఈ 33, సీఎస్ఎం 18, సీఎస్‌డీ 8, ఈసీఈ 7, ఈఈఈ 2 వెరసి 68 దరఖాస్తులు అందాయి.

**విద్యార్థులకు వరమే..:** ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతుల ప్రారంభానికి అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలు అందుబాటులోకి తెస్తున్నారు. తరగతి గదులకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఇందులో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండటం, జేఎన్‌టీయూఏ సొంత కళాశాలలో చదివే అవకాశం లభించడం విద్యార్థులకు వరమని పాలకులు, నిర్వాహకులు అంటున్నారు.

# ఏవీ ముద్రలు.. తేలని లొసుగులు

అనంతపురం : పెట్రోలు, డీజిల్ కొనుగోలు సమయంలో వాహనదారులు నష్టపోకుండా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. వాటిని అమలు చేసే బాధ్యతలు తూనికలు, కొలతల శాఖ యంత్రాంగానికి అప్పగించింది. యంత్రం, పంపులు, నాజిల్ (గొట్టాలు) పరికరాలకు ఏడాదికోసారి ముద్ర వేయించాలని నిబంధన విధించారు. మీటరు బోర్డు, యంత్రంలో ఏదేని సాంకేతిక మరమ్మతు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలి. నిర్వాహకులు సొంతంగా ఎలాంటి మరమ్మతులు చేయించకూడదు. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసి, అన్నీ బాగుంటే టాంపరింగ్ చేయకుండా బోర్డుకు సీలు వేస్తారు. అయితే ఈ ముద్రలు వేయించకుండా జిల్లాలో చాలాచోట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు జరిపిన ఆకస్మిక



తనిఖీల్లో పలుచోట్ల నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది.

**ఆకస్మిక తనిఖీ.. అపరాధ రుసుం**

ఉమ్మడి జిల్లాలో 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు పలు బంకుల్లో సకాలంలో ముద్ర వేయించని 104 మంది యజమానులకు రూ.11.75 లక్షలు అపరాధ రుసుం విధించాం. బసవేశ్వర ఫిల్లింగ్ సెంటర్‌పై (ఓబుళాపురం)- రూ. 25 వేలు, ఏకలవ్య ఫిల్లింగ్ స్టేషన్ (తాడిపత్రి) రూ.25 వేలు, శివసాయి ఫిల్లింగ్ స్టేషన్ (తాడిపత్రి)- రూ.25వేలు, సిద్దలింగేశ్వర ఫిల్లింగ్ స్టేషన్ (బుక్కరాయసముద్రం) రూ. 25 వేలు అపరాధ రుసుం విధించాం. లొసుగులు ఉన్నట్లు గమనిస్తే.. చరవాణి నంబరు 98490 95707కు ఫిర్యాదు చేయవచ్చు.

తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలరు సుధాకర్

# ముంచుకొచ్చినా.. పూడిక తీయరు..!

రాజమహేంద్రవరం: జిల్లాలో వర్షాలు జోరుగా పడుతున్నాయి. కాలువలు పొంగిపొర్లుతున్నాయి. పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కాలువల్లో పూర్తి స్థాయిలో పూడిక తొలగించకపో వడంతో ముంపు తీవ్రత ఎక్కువగా ఉంది. వేసవిలో చేపట్టిన పనులు నామమాత్రంగా ఉండటంతో పూడిక పెరిగిపోయింది. ఏటా వీటి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తారు. ఆయా పురపాలికల్లో సిబ్బంది కొరతతో ఈ పనులు జరగడం లేదు. రాజమహేంద్రవరం, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన కాలువల్లో నిత్యం వ్యర్థాలు మేట వేస్తున్నాయి. పెరుగుతున్న జనాభా, అవసరాలకనుగుణంగా కాలువల విస్తరణ లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చిన్న పురపాలికల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు నాలుగైదు చోట్ల ముంపు సమస్య ఉంటే, ప్రస్తుతం అంతకు రెండింతలు ఉండటం గమనార్హం.

# ఎర్రమట్టి కొండలు తరిగిపోతున్నాయ్



శింగనమల : కొండలు తవ్వి ఎర్రమట్టిని యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఫలితంగా ఎర్రమట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. శింగనమల, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం ఎర్రమట్టి కొండలు తరిగిపోతున్నాయి. మట్టి త్వకాలను అడ్డుకొనేందుకు ఏర్పాటు చేసిన మైనింగ్ అధికారుల తనిఖీ కేంద్రాల ముందే వాహనాలు వెళుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**నేలమట్టం చేస్తూ...**

శింగనమల మండలం కొరివిపల్లి వద్ద జేసీబీలతో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. నాగులగుడ్డం సమీప కొండలాల్లోనే ఇదే తంతు సాగుతోంది. నార్పల మండలంలోని పులసలనూతల, మూగేతిమ్మంపల్లి, నడిమిదొడ్డి, నాయనపల్లి, చామలూరు గ్రామాల కొండల్ని వదలడం లేదు. గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద శింగారప్ప కొండలో మట్టి తవ్వకాలతో రూ.లక్షలు గడిస్తున్నారు. బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి, బొమ్మలాటపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. కొండల్ని కొల్లగొట్టడమే కాకుండా పచ్చని చెట్లను తొలగిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టితరలుతోంది.

**రూ.లక్షల్లో అక్రమార్జన**

నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో కొందరు ఎర్రమట్టిని వ్యాపారంగా మార్చుకొన్నారు. ఇళ్ల నిర్మాణాలకు, పునాదులు పూడ్చేందుకు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒక ఎర్రమట్టి ట్రాక్టర్ రూ.వెయ్యి, టిప్పరు రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఫలితంగా నిత్యం రూ.లక్షల్లో అక్రమార్జన సాగుతోంది.


నార్పలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్‌లు తిరుగుతూనే ఉంటాయి. అత్యంత రద్దీగా ఉన్న సర్కిల్ గుండా వాహనాలు వెళుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

**ఎవరికీ అనుమతులు లేవు..**

– అరుణకుమారి, తహసీల్దారు, నార్పల

కొండల్లో మట్టిని తవ్వేందుకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వుకునేందుకు ఎవరికీ హక్కు లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే తగిన చర్యలు తీసుకుంటాం.

# చెరువులకు జలకళ



అనంతపురం : విస్తారంగా కురుస్తున్న వానలతో పల్లెలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయి. గడిచిన రెండు మాసాల్లో వరుణుడు కరుణించలేదు. ఈనెలలో సాధారణ వర్షపాతానికి రెట్టింపు స్థాయిలో కురవడంతో అన్నదాతల మోములో చిరునవ్వు విరబూస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1487 చెరువులు ఉంటే.. ఏకంగా 5.189 టీఎంసీలు నిల్వ ఉండటం గమనార్హం. ఎక్కడికక్కడ కుంటలు, చెక్‌డ్యాంల్లోనూ వర్షపు నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలమట్టం సైతం పెరిగింది. దీంతో వాటి పరిధిలోని ఆయకట్టు సాగుకు మార్గం సుగమమైంది. త్వరలోనే హంద్రీనీవా, హెచ్చెల్సీ జలాలతో చెరువులను నింపే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి చెరువులను నింపడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**18 చోట్ల నిండాయి**

మొత్తం 514 చెరువుల్లోకి నీరు వచ్చింది. ఇందులో వంద శాతం భర్తీ అయిన చెరువుల్లో అనంతలో పది, శ్రీసత్యసాయిలో ఎనిమిది ప్రకారం ఉన్నాయి. అనంత జిల్లాలో అనంత గ్రామీణ మండలంలో రెండు, వజ్రకరూరులో మూడు, గుత్తి, గుంతకల్లు, పామిడి, విడపనకల్లు, తాడిపత్రిలో ఒక్కొక్కటి ఉండగా... శ్రీసత్యసాయిలో సీకేపల్లి, గాండ్లపెంటలో నాలుగు ప్రకారం, ఎన్‌పీ కుంట, ముదిగుబ్బ, బుక్కపట్నం, గోరంట్లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. 75 శాతం మేర పూర్తయిన చెరువులు 29... 50 శాతం నిండినవి 89.. 25 శాతం మేర నీరున్నవి 378 ఉన్నాయి. వాన నీరు భూమిలోకి కొంతమేర ఇంకడం సహజమే. దీని ప్రకారం చూస్తే.. జూన్ నుంచి ఆగస్టు ఒకటో తేదీ దాకా 65.46 టీఎంసీలు భూమిలో నిల్వ ఉన్నట్లే. అనంత జిల్లాలో 33.67 టీఎంసీలు, శ్రీసత్యసాయి జిల్లాలో 31.79 టీఎంసీలు ఉన్నాయి. ప్రస్తుతం అనంత జిల్లా సగటు భూగర్భ నీటి మట్టం 11.01 మీటర్లు, శ్రీసత్యసాయిలో 12.75 మీటర్ల మేర ఉంది.

వర్షపాతం విషయానికి వస్తే.. జూన్ నుంచి ఆగస్టు 14వ తేదీ నాటికి అనంత జిల్లా సాధారణ వర్షపాతం 160.29 మి.మీ ఉండగా.. ఇప్పటి దాకా 233.98 మి.మీ వర్షం కురిసింది. శ్రీసత్యసాయిలో 179.63 మి.మీకుగాను ఏకంగా 219.62 మి.మీ వర్షపాతం నమోదైంది.

# సెలవైతే.. కొల్లగొట్టుడే!



అనకాపల్లి : 'వరుసగా ప్రభుత్వ సెలవులొస్తే చాలు గ్రావెల్ బేరాలొప్పుకుంటారు. రెండు బ్యాచ్‌లుగా విడిపోయి.. రాత్రి, పగలు రెండు పూటలా దొరికిన కొండనల్లా కొల్లగొడుతున్నారు. చెరువులు, కొండవాలు ప్రాంతాలని తేడా లేకుండా చెరిచేస్తున్నారు.' .. ఇదీ సబ్బవరం మండలంలో చీకటి గ్రావెల్ దందా! ఈ ప్రాంతంలోని కొంతమంది మట్టి అక్రమ రవాణానే వ్యాపారంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ కారణంగా రహదారులు పాడవుతున్నాయని స్థానికులు మొత్తుకుంటున్నా ఎవరూ చెవికెక్కించుకోవడం లేదు. తవ్వకందారులతో స్థానిక నేతలు కలిసిపోయి చెరువులు, కొండలను ధ్వంసం చేస్తున్నారు.

సబ్బవరం పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలకు మట్టి, గ్రావెల్‌కి డిమాండ్ బాగా పెరిగింది. గొల్లలపాలెం, తంగిరాలపాలెం, ఎదురునెరవ, గంగవరం, ఒమ్మివానిపాలెం, బాటజంగాలపాలెం తదితర గ్రామాలకు సమీపంలో చెరువులు, కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. మామూలు రోజుల్లో స్తబ్దుగా ఉంటున్న అక్రమార్కులు వరసగా ప్రభుత్వ సెలవు దినాలు రాగానే రెచ్చిపోతున్నారు. ఎంతమేర గ్రావెల్, మట్టి కావాలో ముందే అడ్వాన్సులు తీసుకుని రాత్రివేళ భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు.

అసకపల్లి వజ్రాల కొండ చుట్టూ కొండవాలు ప్రాంతంలో తవ్వకాలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం స్థానికులు అడ్డుకుని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం గంగవరం సమీపంలోని కొండవాలు ప్రాంతంలో అక్రమార్కుల కన్ను పడింది. ఇక్కడ సమీపంలో లేఅవుట్ వేస్తున్నారు. కొన్ని రోజులుగా రాత్రివేళ కొండను కొల్లగొట్టి గుట్టుగా తరలిస్తున్నారు.

**అక్రమంగా తవ్వితే చర్యలు..** చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కొండవాలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. సబ్బవరంలో తవ్వకాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని రెవెన్యూ అధికారులకు చెప్పాం. రాత్రి వేళల్లోనూ నిఘా ఉంచుతాం. ప్రభుత్వ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తే.. చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, ఏడీ మైనింగ్, అనకాపల్లి

# ధర ఉన్నా.. నాణ్యత లేక

పలమనేరు : పట్టు రైతుల పరిస్థితి వైకుంఠపాళిని తలపిస్తోంది. ధర ఉంటే.. పంట ఉండదు. పంట ఉంటే ధర ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నా.. వర్షాల కారణంగా దిగుబడి పడిపోయింది. వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో గూళ్ల నాణ్యత అంతగా లేదని వాపోతున్నారు. జిల్లాలో ప్రధానంగా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 10 వేల హెక్టార్లలో రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. సాగులో నష్టాలు చూస్తుండటంతో చాలా మంది ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దాంతో మల్బరీ విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గింది. గతంలో పలమనేరు నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో మల్బరీ సాగు ఉండగా.. ప్రస్తుతం 6 – 7 వేల హెక్టార్లకు పడిపోయింది.

**పెరిగిన పట్టుగూళ్ల ధరలు**మార్కెట్‌లో గత నెల కిలో పట్టు గూళ్లు రూ.500 ధర పలికింది. అంతకు ముందు రూ.300 – రూ.400 ఉంది. ప్రస్తుతం రూ.636 నుంచి రూ.700 ధర పలుకుతోంది.



దిగుబడి మాత్రం లేదని రైతులు సతమతమవుతున్నారు. గతంలో మార్కెట్‌కు రోజుకు ఏడు నుంచి 10 టన్నుల వరకు పట్టుగూళ్లు రాగా ప్రస్తుతం రోజుకు 1,025 కిలోలు మాత్రమే వస్తోంది. ఈ విషయమై మార్కెట్ అధికారి అనిల్ కుమార్‌ను సంప్రదించగా.. మార్కెట్‌కు ప్రస్తుతం తక్కువ గూళ్లు వస్తున్నాయని.. వచ్చిన వాటిలోనూ నాణ్యత లేక ధర పలకడం లేదని చెప్పారు.

**ఆకు మాత్రం అమ్ముకుంటున్నా..**

నేను ఏడెకరాల్లో మల్బరీ సాగు చేశా. ప్రస్తుతం పట్టుగూళ్లకు ధర వచ్చింది. పంట మాత్రం రావడం లేదు. వర్షాలకు పట్టుగూళ్లు దెబ్బతినడంతో నాసిరకం గూళ్లు వస్తున్నాయి. వీటికి మార్కెట్‌లో పెద్దగా ధర పలకడం లేదు. అందుకే పండించిన మల్బరీ ఆకును ఇతర రైతులకు విక్రయిస్తున్నా. బాబు, పట్టు రైతు, పలమనేరు

# పల్లె ప్రగతికి మార్గం

కర్నూలు :కోడువరు మండలం బైనదొడ్డి గ్రామానికి ఇటీవల పూర్తి చేసిన సీసీరోడు ఈ ఊరికి ఇన్నేళ్లు నేరుగా రహదారి లేదు. ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా.. ఇతరులు ఈ పల్లెకు రావాలన్నా వర్కూరు– మెరుగుదొడ్డి రోడ్డు నుంచి అర కిలోమీటరుకు పైగా నడిచి వెళ్లాల్సి వచ్చేది. వర్షాలు పడినప్పుడు.. అత్యవసర సమయంలో నరకం అనుభవించాల్సి వచ్చేదని గ్రామస్థులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామానికి రూ.40 లక్షల ఉపాధి నిధులతో 0.60 కి.మీ సీసీరోడ్డు వేయడంతో బైనదొడ్డి వాసులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు పూర్తయినా జిల్లాలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇలాంటి పల్లెలకు రవాణా వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రోడ్డు వసతి లేని 24 గ్రామాలకు 14 కి.మీ రహదారులు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం రూ.18.02 కోట్ల ఉపాధిహామీ నిధులు మంజూరు చేసింది. పల్లె పండగలో భాగంగా ఇప్పటి వరకు 14 గ్రామాలకు రహదారులు పూర్తి చేశారు.

**కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

'మా గ్రామాలకు రోడ్డు వసతి కల్పించిన కూటమి ప్రభుత్వానికి, కలెక్టర్, పంచాయతీరాజ్ ఇంజినీర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గూడూరు, కోడువరు, హొళగుంద, గోనెగండ్ల, పత్తికొండ, తుగ్గలి మండలాల పరిధిలోని 14 గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. 14 గ్రామాల ప్రజలు గురువారం కర్నూలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టరు రంజిత్‌బాషాను కలిసి సన్మానించారు. పీఆర్ ఇన్‌ఛార్జి ఎస్ఈ మద్దన్న, డ్వామా పీడీ వెంకటరమణయ్య, విశ్రాంత ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీఈఈలు శ్రీనివాసులు, కర్రెన్న, శేషయ్య, ఏఈఈ ముక్తార్‌బాషా పాల్గొన్నారు.

# ఇక లెక్క పక్కా..

పుత్తూరు : స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ఆర్థిక కార్యకలాపాలన్నీ ఇక నుంచి పక్కాగా జరగనున్నాయి.. ఈ మేరకు కూటమి ప్రభుత్వం 'మన డబ్బులు–మన లెక్కలు' పేరిట ప్రత్యేక యాప్‌ను ఈ నెల 16 నుంచి అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు.. ఇప్పటివరకు బ్యాంకులకు చెల్లిస్తున్నా నోటీసులు రావడం, సిబ్బంది చేతివాటం, సభ్యుల పేరిట అక్రమంగా రుణాలు పొందడం తదితర అవకతవకలు జరిగేవి.. ఈ యాప్ అందుబాటులోకి వస్తే ఇవన్నీ ఇకపై జరగవు.

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 678 వీవోలు ఉండగా.. తొలుత ఎంపిక చేసిన వీవోల పరిధిలో అమలు చేస్తారు. యాప్‌లో సంఘాలకు చెందిన వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. సభ్యులకు చెందిన ప్రత్యేక ఐడీతో నమోదయ్యేలా చూస్తారు. పాస్‌వర్డ్ సాయంతో ఎప్పటికప్పుడు వివరాలు చూసుకోవచ్చు. లావాదేవీలన్నీ కనిపిస్తాయి. సంఘ వివరాలు సైతం తెలుసుకోవచ్చు. మరో వైపు సమాచారం అప్‌డేట్‌లో భాగంగా ఇప్పటికే మెప్మా పరిధిలోని సంఘాలను ఆడిట్ చేశారు. దీంతో పారదర్శకంగా సేవలు అందనున్నాయని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు.

# బ్లాక్ శారీలో దివి అందాల ఆరబోత!

ప్రస్తుత కాలంలో అమ్మాయిలు ఎక్కువగా సోషల్ మీడియాలో సమయాన్ని గడిపేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. సెలబ్రిటీల విషయానికొస్తే ఇది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఇదే సోషల్ మీడియా ద్వారా పాపులారిటీ సంపాదించుకొని.. ఇప్పుడు ఇండస్ట్రీలో హీరోయిన్లుగా మారిన వారు కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు సోషల్ మీడియానే ఆయుధంగా చేసుకొని అందాలు ఆరబోస్తూ దర్శకుల కంట్లో పడే ప్రయత్నం చేస్తున్నారు. అలా ఎప్పటికప్పుడు తన అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ గ్లామర్ బ్యూటీగా పేరు సొంతం చేసుకుంది దివివాద్య. ఈ క్రమంలోనే తాజాగా మరొకసారి చీరకట్టులో కనిపించి కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది. తాజాగా నెట్టెడ్ బ్లాక్ శా రీ ధరించిన ఈమె దానికి కాంబినేషన్లో మల్టీకలర్ థ్రెడ్ తో చాలా అందంగా డిజైన్ చేసిన బ్లాక్ కలర్ బ్లౌజ్ ధరించి.. తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. ముఖ్యంగా ఈ నెట్టెడ్ బ్లాక్ శారీలో తన అందాలను ప్రదర్శిస్తూ.. నడుము, నాభి అందాలు హైలైట్ అయ్యేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. అంతే కాదండోయ్ స్టైలిష్ గా కూలింగ్ గ్లాస్ పెట్టి మరి నీలాంబరి 2



అనిపించింది ఈ ముద్దుగుమ్మ. పైగా ఈ ఫోటోలను షేర్ చేస్తూ కింద క్యాప్షన్ లో.. "నా సందిట్లో ముంగిట్లో గుప్పిట్లో ఉండరా.. శృంగార వీర" అంటూ నరసింహ సినిమాలో నీలాంబరి గెటప్ లో చేసిన రమ్యకృష్ణ పాడిన పాటను క్యాప్షన్ గా జోడించి తన అందాలను ఆరబోసింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం దివి వాద్య షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈమె కెరియర్ విషయానికి వస్తే.. మోడల్ గా కెరియర్ మొదలుపెట్టి.. ఆ తర్వాత సినీ నటిగా తనను తాను మార్చుకుంది. 2019లో వచ్చిన మహేష్ బాబు 'మహర్షి' సినిమా ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన దివి.. బిగ్ బాస్ సీజన్ ఫోర్లో కంటెస్టెంట్ గా పాల్గొని అక్కడి నుంచి ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది. 2020లో టీవీ పరిశ్రమకు చెందిన మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ గా హైదరాబాద్ టైమ్స్ ఈమెను ప్రకటించింది కూడా.. 1996 మార్చి 15న తెలంగాణ హైదరాబాద్ లో జన్మించిన ఈమె ఎంబీఏ, ఎంటెక్ పూర్తి చేసింది. చివరిగా పుష్ప2 డాకు మహారాజ్ సినిమాలలో నటించిన ఈమె.. ఇప్పటికీ పలు చిత్రాలలో అవకాశాలు అందుకొని దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్లామర్ వలకబోయడమే కాదు యాక్షన్ పాత్రలతో కూడా ప్రేక్షకులను మెప్పించగలను అని మరొకసారి నిరూపించింది. ఇకపోతే ప్రస్తుతం తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న దివికి ఒక హీరోయిన్గా మంచి పాత్ర లభించాలి అని.. అందులో తన నట విశ్వరూపం చూపించి హీరోయిన్గా ఎదగాలని అభిమానులు కోరుకుంటున్నారు . ఏది ఏమైనా టాలెంట్ ఉండాలి కానీ సరైన పాత్ర పడితే స్టార్ హీరోయిన్ హోదా ఈజీగా దొరుకుతుందని మరికొంతమంది తమ అభిప్రాయంగా వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం.

# శ్రీలీల రికార్డ్.. ఒకేసారి నాలుగు భాషల్లో..!

కన్నడ మూవీ 'కిస్'తో హీరోయిన్గా పరిచయం అయిన శ్రీలీల తెలుగులో 2021లో 'పెళ్లి సందడి' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. తెలుగులో మొదటి సినిమానే ఫ్లాప్ కావడంతో శ్రీలీలను ప్రేక్షకులు, ఇండస్ట్రీ వర్గాల వారు పెద్దగా పట్టించుకోరని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ లక్కీగా శ్రీలీలకు ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కింది. వరుస ఫ్లాప్స్లో ఉన్న రవితేజతో శ్రీలీల నటించడంతో చాలా మంది పట్టించుకోలేదు. కానీ ధమాకా సినిమా హిట్ కావడంతో పాటు, ఆ సినిమాలో శ్రీలీల అందంతో పాటు డాన్స్తో మెప్పించడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ధమాకాతో శ్రీలీల చేతికి ఏకంగా అర డజను సినిమాలు వచ్చి పడ్డాయి. హీరోయిన్గా ఒకే ఏడాదిలో డజనుకు పైగా సినిమాలతో వచ్చి అరుదైన రికార్డ్ను సొంతం చేసుకుంది. ఏడాది గ్యాప్లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలను చేయడం మాత్రమే కాకుండా పలు సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకోగా, కొన్ని సినిమాలు ఆమెకు నటిగా, డాన్సర్గా గుర్తింపును తెచ్చి పెట్టాయి. 2024 చివర్లో వచ్చిన పుష్ప 2 సినిమా శ్రీలీలను పాన్ ఇండియా రేంజ్కి చేర్చింది. పుష్ప 2 లో శ్రీలీల కిస్సిక్ సాంగ్తో ఒక్కసారిగా బాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ



ఐటెం సాంగ్ హిందీలో సూపర్ హిట్ కావడంతో శ్రీలీలకు హిందీ సినిమా ఇండస్ట్రీ నుంచి మాత్రమే కాకుండా తమిళ్లోనూ మొదటి ఆఫర్ను తెచ్చి పెట్టింది అనడంలో సందేహం లేదు. శ్రీలీల మొదటి సినిమా 2019లో చేయగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు, కన్నడ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చింది. ఇప్పుడు తమిళ్, హిందీ సినిమాలను సైతం చేస్తుంది. ఒకేసారి నాలుగు భాషల సినిమాలు చేస్తున్న హీరోయిన్గా అరుదైన రికార్డ్ను సొంతం చేసుకుంది. ఒకవైపు కన్నడంలో జూనియర్, తెలుగులో మాస్ జాతర, తమిళ్లో పరాశక్తి, హిందీలో ఆషికి 3 సినిమాలు చేసి ఒకే సారి నాలుగు భాషల్లో నటించి రికార్డ్ను సృష్టించింది. శ్రీలీల హిందీలో నటిస్తున్న ఆషికి 3 ఇంకా విడుదల కాలేదు. అప్పుడే హిందీలో మరో సినిమాకు ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా చిన్నా చితకా హీరో కాకుండా ఏకంగా బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్తో శ్రీలీలకు ఛాన్స్ దక్కింది. ఈ మధ్య కాలంలో బాలీవుడ్ యంగ్ హీరోలు సౌత్ దర్శకులు, హీరోయిన్స్ వెంట పడుతున్నారు. అందులో భాగంగానే బాలీవుడ్ స్టార్ హీరో రణ్వీర్ సింగ్ తెలుగు దర్శకుడు బాబీ దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఆ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన అతి త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో శ్రీలీలను హీరోయిన్గా ఎంపిక చేశారని తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో డాకు మహారాజ్ మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే హిందీ సినిమా నుంచి పిలుపు వచ్చింది. త్వరలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. మరో వైపు తమిళ్లో పరాశక్తి విడుదల కాకుండానే మరో సినిమాను కూడా ఓకే చేసింది. ఆ సినిమా ప్రకటన త్వరలో రానుంది. మొత్తానికి శ్రీలీల మోస్ట్ బిజీ హీరోయిన్గా ఉంది.




# ఈసారి ఫైల్స్ వసూళ్లు తెచ్చి పెట్టలేదు






బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి ఇటీవల తీసిన సినిమాలన్నీ తీవ్ర వివాదాలను రాజేసిన విషయం తెల్సిందే. ఆయన తాష్కెంట్ ఫైల్స్ సినిమా మొదలుకుని వరుసగా ది కాశ్మీర్ ఫైల్స్, వాక్సిక్ వార్ సినిమా ఒక రాజకీయ పార్టీకి మద్దతుగా ఉన్నాయి అంటూ విమర్శలు వచ్చాయి. ఇప్పటి వరకు ఆయన దర్శకత్వంలో వచ్చిన తాష్కెంట్ ఫైల్స్, ది కశ్మీర్ ఫైల్స్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా ది కశ్మీర్ ఫైల్స్ సినిమా కమర్షియల్గా బిగ్ విజయాన్ని సొంతం చేసుకుంది.దేశ వ్యాప్తంగా ది కశ్మీర్ ఫైల్స్ రాబట్టిన వసూళ్లు ఆ సమయంలో అందరిని ఆశ్చర్యానికి గురి చేశాయి. వందల కోట్ల వసూళ్లు సాధించడం ద్వారా మరిన్ని ఫైల్స్ మూవీలను తీసుకు వచ్చేందుకు వివేక్ అగ్నిహోత్రి కి మద్దతుగా నిలిచింది అనడంలో సందేహం లేదు.

**వివేక్ అగ్నిహోత్రి బెంగాల్ ఫైల్స్ టాక్..** తాజాగా వివేక్ అగ్నిహోత్రి నుంచి 'ది బెంగాల్ ఫైల్స్' సినిమా వచ్చింది. ఈ సినిమా టైటిల్ను బట్టే ఈ కథ పశ్చిమ బెంగాల్కి సంబంధించింది అని అర్థం అవుతుంది. మిథున్ చక్రవర్తి, పల్లవి జోషి, దర్శన్ కుమార్, సిమ్రత్ కౌర్, అనుపమ్ ఖేర్లు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమా విడుదలకు ముందు నుంచే తీవ్ర వివాదాలను రాజేసింది.

ఈ సినిమా పశ్చిమ బెంగాల్లో తీవ్ర దుమారంను రేపుతాయనే ఉద్దేశంతో రిలీజ్కి అనుమతి ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. పశ్చిమ బెంగాల్లో సినిమా విడుదల చేయకుండానే దేశంలో ఇతర రాష్ట్రాల్లో సినిమాను విడుదల చేశారు. అయితే విడుదల అయిన రాష్ట్రాల్లో ఈ సినిమా వసూళ్లు అంతంత మాత్రమే ఉన్నాయి. వివేక్ అగ్నిహోత్రి గత చిత్రాల మాదిరిగా ఈ సినిమా వసూళ్లు నమోదు కావడం లేదు అనేది బాక్సాఫీస్ వర్గాల టాక్.

**ది కశ్మీర్ ఫైల్స్ వసూళ్లు..** సెప్టెంబర్ 5న విడుదలైన ఈ సినిమా మొదటి వీకెండ్లో కేవలం రూ. 6.5 కోట్లను వసూళ్లు చేసింది. వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వచ్చిన ది కశ్మీర్ ఫైల్స్ సినిమా రాబట్టిన వసూళ్లతో పోల్చితే ఈ సినిమా వసూళ్లు మరీ తక్కువగా ఉన్నాయి. ఓపెనింగ్స్ డల్గా ఉండటంతో లాంగ్ రన్లోనూ ఇదే తరహా వసూళు ఉండే అవకాశాలు ఉన్నాయి అనేది బాక్సాఫీస్ వర్గాల అంచనా.

కేవలం వివాదం కోసం తీసిన సినిమా అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. వివేక్ అగ్నిహోత్రి తన సినిమాలతో రెండు వర్గాల మధ్య విభేదాలు రగిల్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు అనేది కొందరి మాట. మొత్తానికి ఒక పార్టీకి సంబంధించిన వారు కూడా ఈ సినిమాను చూసేందుకు థియేటర్కి వెళ్లడం లేదు అనేది బాక్సాఫీస్ వర్గాల్లో వినిపిస్తున్న వాదన. లాంగ్ రన్లో ఏమైనా ఫలితం మారుతుందా అనేది చూడాలి.

# బ్లాక్ అంటే అందుకే ఇష్టం.. సీక్రెట్ రివీల్ చేసిన శృతిహాసన్!



ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతిహాసన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. సింగర్ గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఈమె.. ఆ తర్వాత తనకంటూ ఒక గుర్తింపును సొంతం చేసుకునే ప్రయత్నం చేసింది. అందులో భాగంగానే మొదట పలు చిత్రాలలో హీరోయిన్ గా నటించింది. కానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. దాంతో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకుంది. ఇక పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' సినిమాతో లైమ్ లైట్ లోకి వచ్చిన తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలు ప్రకటిస్తూ బిజీగా మారిపోయింది శృతిహాసన్. సలార్ సినిమాతో పాన్ ఇండియా బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. బాలకృష్ణతో వీరసింహారెడ్డి, చిరంజీవితో వాల్తేరు వీరయ్య సినిమాలు చేసి ఒకే ఏడాది బాక్సాఫీస్ క్వీన్ గా నిలిచింది. దీనికి తోడు ఇప్పుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ' సినిమాలో హీరోయిన్ గా అవకాశం అందుకుంది.

ఇదిలా ఉండగా ఈ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొన్న ఈమె.. తనకు ఇష్టమైన కలర్ గురించి.. ప్రత్యేకించి ఆ కలర్ ను ఇష్టపడడం వెనుక అసలు కారణాలు చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. నిజానికి శృతిహాసన్ ఇంస్టాగ్రామ్ ఓపెన్ చేసిందంటే చాలు ఆమె ప్రతి ఫోటో దాదాపు నలుపు రంగులోనే ఉంటుంది. సుమారు 90 శాతం ఫోటోలు ఈ బ్లాక్ కలర్ లోనే కనిపిస్తాయి. దీన్ని బట్టి చూస్తే ఈమెకు నలుపు అంటే ఎంత ఇష్టమో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ నలుపు రంగు దుస్తులు ధరించడం వెనుక అసలు కారణాన్ని చెబుతూ.. బ్లాక్ కలర్ అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే మనం ఈ కలర్ వేసుకుంటే ఎంతమందిలో.. ఎక్కడ ఉన్నా చాలా ప్రత్యేకంగా కనిపిస్తాము. ముఖ్యంగా నా స్కిన్ టోన్ కి ఆ రంగు మరింత అద్భుతంగా సూట్ అవుతుంది. వాస్తవానికి నలుపు చాలామంది అశుభంగా పరిగణిస్తారు. కానీ నాకు మాత్రం ఇది ఒక సెంటిమెంట్ గా మారిపోయింది. బ్లాక్ డ్రెస్ వేసుకున్నప్పుడు నాలో ఎక్కడలేని ధైర్యం వస్తుంది. ఇక మిగతా రంగులతో పోల్చుకుంటే బ్లాక్ డ్రెస్ వేసుకున్నప్పుడు నేను మరింత రెట్టింపు ఉత్సాహంగా ఉంటాను. దీనికి తోడు డార్క్ కలర్స్ వేసుకున్నప్పుడు బయటకు వెళ్తే మరకలు పడినా ఎవరికీ సులభంగా కనిపించవు. అందుకే ఒక బెస్ట్ ఛాయిస్ గా నేను బ్లాక్ కలర్ ను ఎంచుకున్నాను" అంటూ సరదాగా చెప్పుకొచ్చింది శృతిహాసన్. ఇకపోతే శృతిహాసన్ స్కిన్ టోన్ కి ఈ కలర్ నిజంగా చాలా అద్భుతంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆమె ధరించే ప్రతి బ్లాక్ డ్రెస్ కూడా ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తాయని చెప్పవచ్చు. ఇక ప్రత్యేక ఆకర్షణగా నలుగురిలో నిలవడానికి ఈ ముద్దుగుమ్మ ఇలా ఈ కలర్ ను ఎంపిక చేసుకున్నానని చెప్పుకొచ్చింది. ఇక బ్లాక్ కలర్ తో పాటు డార్క్ కలర్స్ ఏవైనా సరే తనకు ఇష్టమే అంటూ కూడా చెప్పుకొచ్చింది.

# పొట్టి డ్రెస్సులో అనన్య పవర్ లుక్.. గ్లామర్‌కి కొత్త డెఫినిషన్

టాలీవుడ్లో తన సింపుల్ అండ్ న్యాచరల్ యాక్టింగ్తో గుర్తింపు తెచ్చుకున్న అనన్య నాగళ్ల, ఇప్పుడు సోషల్ మీడియాలో తన ఫ్యాషన్ స్టైల్తోనూ కుర్రాళ్ళ దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు దీనికి నిదర్శనం. మెటాలిక్ సిల్వర్ డ్రెస్లో స్పార్క్లా మెరిసిపోయిన అనన్య, పవర్ మోడ్లో ఉన్నట్లు చెప్పుకుంటూ ఈ ఫోటోషూట్ను పంచుకుంది. క్యాజువల్ గానే కాకుండా స్టైలిష్ గా కనిపించే ఈ లుక్లో ఆమె కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపించింది. రెడ్ లగ్జరీ కార్తో చేసిన ఫొటోషూట్, గ్లామర్ని కొత్త స్థాయికి తీసుకెళ్లింది. డ్రెస్ కాంబినేషన్, మేకప్, హెయిర్ స్టైల్ అన్నీ కలిపి



అనన్య వ్యక్తిత్వాన్ని హైలైట్ చేశాయి. ఈ లుక్ను చూసిన అభిమానులు సోషల్ మీడియాలో మంచి రియాక్షన్స్ ఇస్తూ, "గ్లామరస్, క్లాసీ" అంటూ కామెంట్లు చేస్తున్నారు. అనన్య నాగళ్ల కెరీర్ విషయానికి వస్తే, ఆమె "మల్లేశం" సినిమాతో టాలీవుడ్లోకి అడుగుపెట్టి నటనలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఆ తర్వాత "వకీల్ సాబ్"లో పవన్ కళ్యాణ్ పక్కన కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణమైన పాత్రలనుంచి సీరియస్ రోల్స్ వరకు చేస్తూ తనలోని వైవిధ్యాన్ని చూపించడంలో ఆమె విజయవంతమైంది. ఇక ఇటీవల అనన్య కొన్ని వెబ్ ప్రాజెక్టులు, సినిమాలతో బిజీగా గడుపుతోంది. తనకంటూ ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని కూడా సొంతం చేసుకుంది. యాక్టింగ్ మాత్రమే కాకుండా, ఫ్యాషన్ ఫీల్డ్లోనూ తనదైన గుర్తింపును తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. అందుకే తరచూ ఇలాంటి కొత్త లుక్స్తో సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటోంది.

# హీరోయిన్స్ నందు జాన్వీ కపూర్ వేరయ్యా...!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్లో వరుస సినిమాలు చేస్తూనే ఉంది. గత ఆరు.. ఏడు ఏళ్ళుగా జాన్వీ కపూర్ సినిమాలు చేస్తూనే ఉంది. కానీ ఇప్పటి వరకు అక్కడ హిట్ పడలేదు. నటిగా మంచి మార్కులు దక్కించుకుంటుంది, అందంతో కవ్విస్తుంది, ఆకర్షిస్తుంది. దాంతో జాన్వీ కపూర్కి వరుస ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఈమె హిందీ ప్రేక్షకుల ముందుకు హోమ్బౌండ్ సినిమాతో వెళ్లింది. ఆ సినిమా సైతం జాన్వీ కపూర్కి మళ్లీ నిరాశను మిగిల్చింది. బాలీవుడ్లో ఈమె చేసిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్లు అవుతున్నా పారితోషికం విషయంలో తగ్గడం లేదు. పై పెచ్చు సినిమా సినిమాకు పారితోషికం పెంచుతూ వస్తుందట. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు, తెలుగులో ఒక సినిమాను చేస్తున్న జాన్వీ కపూర్ పారితోషికం గురించి షాకింగ్ వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. హిందీ సినిమాలకు నామమాత్రంగా వసూళ్లు చేస్తున్న జాన్వీ కపూర్ టాలీవుడ్ సినిమాలకు మాత్రం షాకింగ్ రేంజ్లో డిమాండ్ చేస్తుందట. దేవర సినిమాకు అప్పట్లో రూ. 4.5 కోట్ల నుంచి రూ. 5 కోట్ల మధ్య పారితోషికం తీసుకుందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు రామ్ చరణ్తో బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో నటిస్తున్నందుకు అంతకు మించి పారితోషికం అందుకుందట. దేవర



సినిమా విడుదలకు ముందే ఆ సినిమా కమిట్ అయింది కాబట్టి సరే పారితోషికం ఎక్కువ డిమాండ్ చేసిందని అనుకోవచ్చు. ఎన్టీఆర్ దేవర సినిమా భారీ ఓపెనింగ్స్ అయితే రాబట్టింది కానీ, సూపర్ హిట్ సినిమాల జాబితాలో నిలువలేదు అనేది వాస్తవం. అంతే కాకుండా ఆ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత లేదు. ఆమె చేసిన చాలా హిందీ సినిమాలతో పోల్చితే దేవర సినిమాలో చేసిన పాత్ర పరిధి చాలా తక్కువగా ఉంది. అయినా కూడా ఆ స్థాయి పారితోషికం ఎలా అందుకుందని చాలా మంది బాలీవుడ్ వర్గాల వారు ముక్కున వేలేసుకున్నారట. జాన్వీ కపూర్ బాలీవుడ్లో చేస్తున్న సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం ఆమె గత చిత్రాల ఫలితాలతో పోల్చితే చాలా ఎక్కువే అని చెప్పాలి. ఇక ఆమె తెలుగు సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం మరీ ఎక్కువ అనే టాక్ వినిపిస్తుంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం చేస్తున్న రామ్ చరణ్, బుచ్చిబాబు సినిమా పారితోషికంను మించి మరో తెలుగు సినిమాకు డిమాండ్ చేసిందట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఆ సినిమాలో నటించేందుకు గాను ఏకంగా రూ. 6.5 కోట్ల నుంచి రూ. 7 కోట్ల మధ్య పారితోషికంను ఆమె డిమాండ్ చేసిందట. దాంతో నిర్మాతలు, మేకర్స్ అవసరమా అనే ఆలోచనలో ఉన్నారు. మంచి సినిమాలు చేయాలి, మంచి పాత్రలు చేయాలి, హిట్ కొట్టాలి అని కాకుండా జాన్వీ కపూర్ సినిమా సినిమాకు పారితోషికం పెంచుకుంటూ పోవాలి అనే ఆలోచన మంచిది కాదని, అది కెరీర్ను నాశనం చేస్తుందని సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. తెలుగులోనూ హిందీ సినిమాలకు తీసుకుంటున్నట్లుగా పారితోషికం తీసుకోవడం ఉత్తమం అని చాలా మంది సూచిస్తున్నారు. జాన్వీ మాత్రం తెలుగు, తమిళ సినిమాలు అనగానే పారితోషికంను ఆకాశమే హద్దు అన్నట్లుగా పెంచి చెబుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536